
సాహిత్య

# ప్రస్థానం

జనవరి 2016

వెల రూ. 10



సాహితీస్రవంతి

## విశాఖపట్నంలో నవంబర్ 29న జరిగిన గురజాడ శతవర్ధంతి కార్యక్రమ దృశ్యాలు



సాహిత్య ప్రస్థానం
జనవరి 2016
సంపుటి : 15 సంచిక : 1

## 'వినూత్న'లో విశాలంగా..

**నూ**తన సంవత్సరంలోకి ప్రవేశిస్తున్నాం.. వినూత్న చైతన్యానికి స్వాగతం పలుకుదాం. కరిగిపోయిన ఏడాది అనుభవాలు నెమరేసుకుంటూ అభిప్రాయాలు కలబోసుకుంటూ కాలంతో పాటు ముమ్ముందుకు సాగిపోదాం...

ముమ్మర సాహిత్య కార్యక్రమాలు *2015*ను ఒక స్మరణీయ సంవత్సరంగా మార్చాయి. స్థానికంగానూ రాష్ట్ర స్థాయిలోనూ అనేక సభలూ సమావేశాలూ గోష్టులూ పుస్తకావిష్కరణలూ పెద్దలకు సత్కారాలు వంటివి సాహిత్యకారులను అలరించాయి. ప్రత్యేకించి గురజాడ అప్పారావు శతవర్ధంతి, గుర్రం జాషువా *120*వ జయంతి ఉత్సవాలు వందల సాహితీ సాంస్కృతిక సంఘాల ఉమ్మడి వేదికలుగా ఉత్సాహమిచ్చాయి. అలనాటి అభ్యుదయ హేతువాదకవి సివి సమగ్ర రచనల ఆవిష్కరణ, చర్చాగోష్ఠి వీటికి నాంది పలికింది.

రచయితలను, హేతువాదులను హత్యచేయడం, బెదిరించడం, భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడి వంటి దుశ్చర్యలతో మతోన్మాదశక్తులు దేశంలో విద్వేష వాతావరణం సృష్టించాయి. వివిధ మతాల కులాల వారి ఆహారపు అలవాట్లు ఆచరణలపై ఆంక్షలతో ఉద్రిక్తత సృష్టించాయి. లౌకిక ప్రజాస్వామిక వాదులతో గొంతు కలిపిన సాహిత్యలోకం ఈ దుర్మార్గాలను తీవ్రంగా ఖండించడంలో ముందు నిలిచింది. అన్నిచోట్లా ప్రగతిశీల సంస్థలన్నీ గొంతుకలిపి ఈ ఫాసిస్టు పోకడలను నిరసించాయి. అభ్యుదయ లౌకిక భావాలు గల సంఘాలు సామాజిక న్యాయం కోసం ఉద్యమిస్తున్న శక్తులను మరోసారి ఒక్క వేదిక మీదకు తీసుకురావడమే *2015* మనకు అందించిన గొప్ప వరవడి. కార్పొరేట్ మార్కెట్ తత్వం, కలుషిత రాజకీయాల మతతత్వం జంట ప్రమాదాల్లా దాపురించిన నేటి పరిస్థితిలో, సామ్రాజ్యవాదానికి పాలకులు మరింతగా లొంగిపోతున్న సందర్భంలో ఈ విశాల ప్రగతిశీల ప్రతిఘటనను మరింత ముందుకు తీసుకుపోవడం అవశ్య కర్తవ్యం. అదే సమయంలో సృజనశీలతనూ సాహిత్య నైపుణ్యాన్ని విమర్శనాత్మక దృక్పథాన్ని పెంచుకోవడంపైనా కేంద్రీకరించితేనే నాలుగుకాలాలు నిలబడే సాహిత్యం అందించగలం.

సాహితీమిత్రులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలందజేస్తూ వారి రచనల్లోనూ ఇతర రంగాల్లోనూ కూడా నిర్దేశిత లక్ష్యాలు పూర్తి చేసుకుంటారని ఆశిద్దాం.

**ముఖచిత్రం : గిరిధర్**

**బొమ్మలు : తుంబలి శివాజి, గంగాధర్, మీరా**

## ఈ సంచికలో ...

కవిత ..... 4
తారతమ్యం (కథ) ..... 5
కవిత ..... 8
స్త్రీవాద కవిత్వంలో మిథోపోయి..... 9
కవిత ..... 15
గాయాలకు అక్షర లేపనాలు అద్దిన కవి..... 16
ఉర్దూ సాహిత్యంలో ఓ ప్రభంజనం ..... 18
పెళ్లి కాని పిల్ల (కథ) ..... 21
కవిత ..... 26
మాలపల్లి అభ్యుదయ కావ్యమేనా?..... 27
సామాజిక చలనంతో 'చలించే' కవి ..... 32
కవిత ..... 34
కరువు (కథ)..... 35
స్వీకారం ..... 39
గురజాడ శతవర్ధంతి కార్యక్రమాలు..... 40
మహాకవికి నీరాజనం..... 42
శ్రీకాకుళం జనకవనం..... 45
సామాజిక, సాంస్కృతిక ఉద్యమ వారధి జాషువా . 47

సంపాదకవర్గం

**తెలకపల్లి రవి** (సంపాదకుడు)
**కె.ఆనందాచారి**
**వొరప్రసాద్**
**వల్లభాపురం జనార్దన**
**కె.లక్ష్మయ్య, మేనేజర్**


చిరునామా
సాహిత్య ప్రస్థానం
ఎం.హెచ్‌భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్ ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్ - 500 020

మనీ ఆర్డర్లు, రచనలు పంపించవలసిన చిరునామా:
ఎడిటర్, సాహిత్య ప్రస్థానం, ఎం.బి. విజ్ఞానకేంద్రం, డో.నెం. 27-30-4, 3వ అంతస్తు, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ - 520 002,
సెల్: 9490099059
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com
www.prasthanam.com

## పురస్కారం



# ప్రముఖ రచయిత్రి ఓల్గాకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు





ప్రముఖ రచయిత్రి ఓల్గాకు 2015 సంవత్సరానికి గాను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. 'విముక్త' కథా సంపుటికి ఈ పురస్కారాన్ని అకాడమీ ప్రకటించింది. 1950, నవంబర్ 27న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో ఓల్గా జన్మించారు. అసలు పేరు పోపూరి లలిత కుమారి. తెలుగు సాహిత్యంలో స్త్రీవాద దృక్పథం పట్ల అవగాహన కలిగించడంలో ముందుండి నడిచారు. తెలుగునాట స్త్రీవాద ఉద్యమానికి ప్రతీకగా నిలిచిన ఓల్గా 'ఆకాశంలో సగం' స్వేచ్ఛ, మానవి, సహజ, గులాబీలు, కన్నీటి కెరటాల వెన్నెల నవలలు రాసారు. మాకు గోడలు లేవు, నీలిమేఘాలు, నూరేళ్ళ చలం, మహిళావరణం వంటి సంకలనాలకు సంపాదకత్వం వహించారు. రాజకీయ కథలు, ప్రయోగం, భిన్న సందర్భాలు, మృణ్మయనాదం కథా సంపుటాలు వెలువరించారు. పలికించకు మౌనమృదంగాలను, తొలివెలుగులు వంటి వ్యాస సంపుటాలు వెలువడ్డాయి. 2010లో వెలువరించిన 'విముక్త' కథా సంపుటిలో ఆరు కథలూ ప్రత్యేకతను సంతరించుకున్నాయి. రామాయణంలోని సీత, అహల్య, శూర్పణఖ, ఊర్మిళ, రేణుక, రాముడు పాత్రలను ప్రధాన ఇతివృత్తాలుగా ఎన్నుకుని స్త్రీవాద కోణంలోంచి కథనం చేయడం ఈ సంపుటి ప్రత్యేకత. పురుష ఆధారిత పాత్రల అంతరంగాన్ని మధించి ఆత్మగౌరవ కోణాన్ని వెలికితీసిన కథలివి. ప్రసిద్ధి చెందిన పురాణపాత్రలను సరికొత్తగా పాఠకుడి ముందు నిలుపుతాయి ఈ కథలు. ఈ పురస్కారం సందర్భంగా ఓల్గా గారికి అభినందనలు.

---



## అక్టోబర్ నెల పురస్కారాలు



**అనామిక**
కథకు: **రూ.700/-**
రచయిత : **బి. కళాగోపాల్**

**అక్షర సేద్యం**
కవితకు : **రూ .500/-**
రచయిత : **సోమవరపు రఘుబాబు**

*సినీ రచయిత జనార్దన మహర్షి అందిస్తున్న పురస్కార చెక్కులు ఈ రచయితలకు అందుతాయి*

*వ్యాసం : **తెలుగు భాషా చరిత్ర పరిశోధనకు మెకంజీ కైఫీయత్తులు మణిదీపాలు** రచయిత : **సి. శివారెడ్డి***



*ఈ రచయితకు 'కర్లపాలెం రుక్మిణమ్మ స్మారక పురస్కారం రూ.500/- అందజేయబడుతుంది*

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు.*

**- ఎడిటర్**

## కథ

# తారతమ్యం

- ఇంద్రగంటి నరసింహమూర్తి
9959352900




మార్చి నెల మొదటి వారం... ఉదయం పదకొండు గంటలవుతోంది. బ్యాంకులో రష్ తక్కువగా ఉంది. కౌంటర్లో ఇద్దరో ముగ్గురో ఉన్నారు. ఎ.టి.ఎం.లు బాగా పాపులర్ అవుతున్నాయి. చాలామంది ఎ.టి.ఎం.లో లావాదేవాలు పూర్తి చేసుకుంటున్నారు. యువత నెట్ బ్యాంకింగ్ వైపు మొగ్గు చూపుతున్నారు. మెషిన్స్ మహిమ... మానవ సంబంధాలు మృగ్యమవుతున్నాయి.

నా క్యాబిన్‌లో ఎ.సి. రన్ అవుతున్నా వుక్కగా అనిపిస్తోంది. అసౌకర్యంగా వుంది. మనసులో గుబులు... కారణం... రుణాల వసూలు మందగించడం... పై అధికారుల చివాట్లు తప్పడంలేదు. మేనేజర్‌గా నా బాధ్యత నిరర్ధక ఆస్తులు తగ్గించడం... రాజకీయ నాయకులు దూరదృష్టి లోపంతో చేసిన వాగ్దానాల వలయంలో చిక్కుకున్న నిజాయితీ దారులు కూడా అప్పులు చెల్లించడానికి ముందుకు రాకపోవడంతో బ్యాంకు మేనేజర్ల పరిస్థితి ముందు నుయ్యి - వెనుక గొయ్యిలా తయారయింది.

రుణగ్రహీతలను కలిసి బాకీ చెల్లించమని ఒత్తిడి చేస్తున్నాను... నా విధి నేను నిర్వహించాలి కదా...

ఈ రోజు కలవాలనుకున్న బాకీదార్ల లిస్టు తయారుచేశాను... ఇంతలో... క్యాబిన్ తలుపు తోసుకుని అటెండర్ వారిస్తున్నా వినకుండా విసురుగా లోపలికి వచ్చిన వ్యక్తివైపు తల త్రిప్పి చూశాను. ఆమె... సుకన్య... నిన్న సాయంకాలం వాళ్ళింటికి వెళ్ళి బాకీ వసూలుకు గొడవ చేయడంతో పేరు గుర్తుంది.

సుకన్య మా బ్యాంకులో సంవత్సరం క్రితం పదివేలు అప్పు తీసుకుంది. సంవత్సరంలో ఒక్క రూపాయి చెల్లించలేదు. తోపుడు బండి మీద కూరగాయలు అమ్ముకుంటుంది. మూడు పదుల వయసుండొచ్చు.

నిన్న సుకన్య ఇంటికివెళ్ళి బాకీ చెల్లించాలని గట్టిగా అరిచాను. ఇలాంటి బడుగు వర్గాల దగ్గర బాకీ వసూలుకు నోరు పెంచడమే మేలని నా అనుభవం చెప్పింది.

'మీలాంటి వాళ్ళకి అప్పు యివ్వడం మాదే బుద్ధి తక్కువ. అప్పు దొరికేదాకా కాళ్ళావేళ్ళా పడతారు. సొమ్ము చేతికందాక మళ్ళీ బ్యాంకు గడప తొక్కరు. అందుకే మీరు పైకి రాలేరు. అప్పు చెల్లించకపోతే తోపుడుబండి జప్తుచేస్తాను

జాగ్రత్త' బెదిరించాను.

భర్త త్రాగుబోతట. 'వాడే బాగుంటే నాకీ తిప్పలు లేకపోను' అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

వీళ్ళింతే... 'కన్నీళ్ళకి కరిగిపోతామని... అంతా నటన' అనుకుంటూ మరోసారి గొంతుపెంచి వార్నింగిచ్చి వచ్చాను.




అదంతా గుర్తు చేసుకుని...

'డబ్బు తెచ్చావా... మళ్ళీ ఏదైనా కథ చెపుదామని వచ్చావా' అన్నాను వ్యంగ్యంగా.

'ఇదిగోనయ్యా నీ డబ్బు' పదివేల కట్ట విసురుగా టేబుల్‌పై పెట్టింది.

'నిన్న రూపాయి లేదన్నావు. ఇంతలో ఇంత డబ్బు ఎలావచ్చింది. ఎక్కడైనా ఎత్తుకొచ్చావా' అడిగాను నేనూ విసురుగా.

ఆమె కళ్ళమ్మట నీళ్ళు... 'మేము నిజాయితీగా పనిచేసుకుని బ్రతికేవాళ్ళం. వుంటే తింటాం. లేదంటే పస్తుంటాం. ఇదిగో ఇది చూడు' అంటూ మెడలో కట్టుకున్న పసుపుకొమ్ము తీసి చూపించింది.

'మంగళ సూత్రం అమ్మేశానయ్యా... మాటపడే మనుషులం కాదు. మాకూ అభిమానం వుంది' కన్నీళ్ళు వత్తుకుంటూ ఆమె అన్న మాటలకు అవాక్కయ్యాను.

'సారీ... తల్లీ...' అంటూ చలాన్‌వ్రాసి కేష్ కౌంటర్లో డబ్బు చెల్లించమని పంపించాను.

నాకు దండంపెట్టి ఆమె కేష్ క్యాబిన్‌వైపు అడుగులు వేసింది.

ఆమె అటు వెళ్ళిందో లేదో...

భార్గవ క్యాబిన్‌లోకి వచ్చాడు.

అతను భార్గవ ప్రయివేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్. అతనికి నలభై ఏళ్ళుంటాయి. మనిషి పొడగిరి. పచ్చని పసిమి ఛాయ. ఖరీదైన బట్టలలో హుందాగా వున్నాడు.

నాలుగు వేళ్ళకి రాళ్ళు పొదిగిన వుంగరాలు... చేతిలో ఖరీదైన సెల్. భార్గవ కంపెనీకి మా బ్యాంకు పదికోట్లు రుణమిచ్చింది. రెండేళ్ళు గడచినా వాయిదాలు చెల్లించలేదు.

ఈ రోజు ఉదయం భార్గవకి ఫోన్‌చేసి వారం రోజుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ వాయిదాలు చెల్లించాలని గట్టిగా నొక్కిచెప్పాను.

ఫలితం... భార్గవ రాక...

'రండి రండి' అంటూ ఆహ్వానించి కుర్చీ చూపించాను.

కుర్చీలో హుందాగా కూర్చున్నాడు భార్గవ.

కుశల ప్రశ్నలయ్యాక అసలు విషయం ప్రస్తావన కొచ్చింది. ఎంతో మర్యాద పూర్వకంగా వాయిదాలు చెల్లించాలని అర్థించాను. పై అధికారుల ఒత్తిడి ఎక్కువగా వుందని చెప్పుకొచ్చాను. భార్గవ చిరునవ్వు చిందిస్తూ చిద్విలాసంగా నా మాటలు విన్నాడు. బ్యాంకు బాకీ చెల్లించలేకపోయాననే ఆందోళన అతని ముఖంలో మచ్చుకైనా కానరాలేదు. చాలా చిన్న విషయంలా తీసి పారేశాడు.

'మీకు తెలియనిదేముంది. ఆర్థిక మాంద్యం వల్ల బిజినెస్ దల్‌గా వుంది. ప్రస్తుతం బాకీ చెల్లించే పరిస్థితిలేదు. మీరే నా లోన్ రీషెడ్యూల్ చేసుకోండి. తరువాత చూద్దాం. రీషెడ్యూల్ చేయమని కోరుతూ తెచ్చిన ప్రపోజల్ మీ పై అధికారులకు పంపండి సరిపోతుంది' అంటూ తనే నిర్ణయం ప్రకటించేశాడు.

బ్యాంకు అధికారులు తను చెప్పినట్లే వింటారనే నమ్మకంతో వున్నాడు.

ప్రతి బాకీదారుడికీ ఈ 'ఆర్థిక మాంద్యం' అనే పదం వూతపదంలా తయారైంది. మరి ఇంత ఆర్థిక మాంద్యంలోనూ నెలానెలా కంపెనీ ఖాతానుండి ఐదులక్షలు తను జీతంగా తీసుకుంటాడు. స్వంత ఆస్తులు పెంచుకుంటాడు.

బాకీ తీర్చాలంటేనే ఇబ్బందులు...

అటెండర్ కాఫీ తెచ్చి టేబుల్‌పై పెట్టాడు.


కాఫీ తీసుకోమని వినయంగా ఆఫర్ చేశాను.

బాకీదారుడైనా భార్గవ మాకెంతో గౌరవనీయుడు. ఎంతయినా మా బ్యాంకు డిపాజిటర్ల సొమ్ము పదికోట్లు అతనిచేతిలో వున్నాయి. ఎంత మర్యాదగా చూసుకోవాలి!

కాసుపు కబుర్లుచెప్పి భార్గవ నిష్క్రమించాడు.

## కవిత

# సత్యం



**- బి. ఇందిర**
**7396303552**

*మతం గంతలు కట్టుకున్న వాడికి*
*గతకాలపు ఘనకీర్తి కనబడదు !*
*మౌఢ్యపు పొరలెక్కినవాడికి*
*హిత వాక్కులు వినబడవు !!*
*మంచి గతమున కొంచెమే ఐనా,*
*ఆ మంచి కోసమే ఇప్పుడు కొట్లాడాల్సొస్తుంది*
*ఒక క్రీస్తు మరణిస్తే మానవత మట్టి గొట్టుకుపోలేదు.*
*అది మరింత పరిపక్వమైంది,*
*ఆ శిలువే పరమ పవిత్రమైంది !*
*గాంధీని కాలిస్తే నిజం నిద్రబోయిందా*
*అది అజరామరమైంది, సత్యమార్గం స్వర్గ తుల్యమైంది!*
*ఉరి తీసినా, పర్యావరణ ఉద్యమాలాగలేదు,*
*నిర్భంధించినా, ప్రజాస్వామ్య గళాలు మూగబోలేదు!*
*మనిషిగా బ్రతికుండీ,*
*రచయితగా మరణించడమెంత దౌర్భాగ్యం !*
*కందుకూరి - గురజాడ, కబీరు - వేమనలు*
*హేతువాద, సంస్కర్తలై చిరకీర్తులైనారు!*
*అణగదొక్కినకొద్దీ అభ్యుదయోద్యమం*
*మరింత పదునెక్కుతుంది*
*మత విశ్వాసాల మర్రిచెట్టెక్కి*
*దెయ్యంలా వేదాలు వల్లించకు*
*ఏ వేదం ప్రబోధించింది మానవ సంహారాన్ని !*
*మతాంధుడి చేతిలో అధికార దీపం*
*చీకటికూపానికి దారితీస్తుంది !*
*మూఢ విశ్వాసాలతో కుళ్లిన మీ మెదళ్లను చీల్చుకుని*
*హేతువాదం మొలకెత్తుతుంది*
*సమాజ ధమనుల్లో చైతన్య ఢమరుకం మోగుతుంది.*
*సిరా సిరల్లో అభ్యుదయ నయాగరా ఉరుకుతుంది*
*అంతిమంగా శాస్త్రజ్ఞానమే వర్ధిల్లుతుంది.*
*ఇది తథ్యం! ఇది సత్యం!!*

**(మానస సాహిత్య అకాడమీ జాతీయ స్థాయి ఉత్తమ కవితా అవార్డు పొందిన కవిత)**

---

అతను బయటికి వెళ్ళాక...

మనసంతా అలజడి...

బ్యాంకుల్లో రెండు లక్షల కోట్లు యిలాంటి పెద్దమనుషుల చేతిలో విలవిల లాడుతున్నాయి. ఇంత పెద్దమొత్తం కొద్దిమంది అనుభవిస్తున్నారు. బ్యాంకులకు అప్పులు ఎగ్గొట్టి తమ స్వంత ఆస్తులు పెంచుకుంటున్నారు. ప్రభుత్వం కూడా వీళ్ళ కొమ్ముకాస్తోంది. చిన్నచిన్న రైతులు బాకీలు చెల్లించలేక ఆత్మాభిమానంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నా కనికరించని బ్యాంకులు బడా పెట్టుబడిదార్లకు కోట్లు గుమ్మరించి మూడోకంటికి తెలియకుండా మాఫీ చేస్తున్నారు.

ఆలోచనలో మునిగితేలుతూంటే...

'సర్... బాకీదార్లను కలవడానికి బయలుదేరుదామా' అంటూ చేతిలో లిస్టుతో ఫీల్డు ఆఫీసర్ క్యాబిన్‌లోకి వచ్చాడు.

'చూడు రమేష్... నిన్న మనం ఇంటికివెళ్ళి బెదిరించిన సుకన్య ఈ రోజు బాకీ చెల్లించింది. ఆమెని పిలిచి మళ్ళీ అప్పు మంజూరుచేయి. భార్గవ తన కంపెనీ అప్పు రీషెడ్యూలు చేయమని ప్రపోజల్ ఇచ్చాడు. ఈ ప్రపోజల్ ఫైల్‌చేసి భార్గవ ప్రైవేట్ లిమిటెడ్ ఆస్తులు డెట్‌రికవరీ యాక్ట్ ప్రకారం జప్తు చేయడానికి వెంటనే చర్యలు తీసుకోమని రికమెండ్ చేస్తూ పై ఆఫీసుకు ప్రపోజల్ తయారుచేయి. నేను ఫోన్‌లో జనరల్ మేనేజర్ గారితో మాట్లాడతాను' అన్నాను.

'అలాగే సర్' అన్నాడు రమేష్ ఫీల్డ్ ఆఫీసర్.

నాకప్పుడు మనసులో అలజడి తగ్గింది. నా డ్యూటీ నేను సక్రమంగా నిర్వహించానన్న తృప్తి నాకుంది. అధికార్లు నిజాయితీగా దృఢంగా నిర్ణయాలు తీసుకోగలిగితే ఈ దేశాభివృద్ధిని అడ్డుకోవడం ఎవరితరం? ❐

**కవిత**

## వాయుముద్ర

- ఏనుగు నరసింహారెడ్డి
8978869183



వసంతంలో
పూలగుత్తులు నాట్యమాడినట్లు
ఒక నిస్తంత్రీ స్పర్శ వీస్తుంది

నిశ్చలమైన నీటిమీద
అలలు మొలుస్తాయి
ఉన్నట్లుండి జల్లులు కురుస్తాయ్
కనిపించని లోకం నుండి
విని మరిచిన గొంతు
గంగలా నేలకు జారుతుంది

పక్షులు వసంతాన్ని
తలుచుకొని కూస్తాయి

లేళ్ళు కరిమబ్బుల్ని ఊహించుకొని
నాట్యం చేస్తాయి
అడవిదారిలో
అశ్వాలు పరుగుపెడతాయి

ఆ స్వరం
కర్ణభేరి ద్వారా
హృదయాన్ని హత్తుకుంటుంది
దుమ్ము పట్టిన వీణ తీగను
అదే పనిగా మీటిపోతుంది
జ్ఞాపకాల సీమ సరిహద్దుల్ని తట్టిలేపి
ప్రమత్తపులోక పరిమళంలో
వింత అలజడి చెలరేగుతుంది

ఇక ఎప్పుడూ ఆ వాయుముద్రకోసమే
మనసు సూదంటు రాయై ఎదురుచూస్తుంది

## వాడు

సుభాషిణి. యన్




"నా బంగారం"
వాడిని "అమ్మ" అనేది
వాడెన్నడూ బంగారం సూల్లే
వాడి ఒళ్ళు వజ్ర కఠోరం
వాడికి వజ్రమంటే తెల్వదు
వాడిది ఉక్కు పిడికిలి
కనీసం ఉక్కుముక్క గూడ వానికి
ఎర్కలే

సూర్యున్ని సూటిగ సూపే గుడిసె
పెయ్ దాయలేని చిరుగుల బట్ట
ఆకలి పేగులను ముడుచుకున్న
పొట్ట
పారలసొంటి చేతులు
పలుగులసొంటి కాళ్ళు
వాడు సంపద సృష్టిస్తడు
వాడికెందుకులే.... అని
"భగవంతుడు"???
వాడికేమీ ఇయ్యలే...

## బంధించలేవు

- కె.శ్రీనివాసు
9490098811



వేయగలవేమో
నిన్ను వేలెత్తిచూపినందుకు
నాచేతికి సంకెళ్ళు

నిలుపగలవేమో
నీతో సమరం చేయవస్తున్న
నా కాలి కదలికలు

బంధించగలవేమో
అణువణువూ కసితో కాగుతున్న
నా భౌతిక శరీరాన్ని

కాని
వేయలేవు
నీ పై తిరగబడుతున్న
నా భావాలకు సంకెళ్ళు

నిలుపలేవు నీపై
క్రోధంతో రగులుతున్న
నా మస్తిష్కపు కదలికలు

బంధించలేవు
విశ్వవ్యాప్తమవుతున్న
నారణన్నినాదపు ధ్వనితరంగాన్ని
నా అంతరంగాన్ని...

## పరిశీలన

# స్త్రీవాద కవిత్వంలో-మిథోపోయి



- డా॥ఎం.ఎన్.బ్రహ్మానందయ్య
9704034854

మిథోపోయి సాహిత్య సంబంధమైన పారిభాషిక పదం. ఇటీవలి కాలంలో తెలుగు సాహిత్య విమర్శ వ్యాసాలలో ఈ అభివ్యక్తి పదం కనపడుతున్నది. కవిత్వ అభివ్యక్తి రీతుల్లో ఒకానొక పద్ధతే ఈ మిథోపోయి. 2002లో తెలకపల్లి రవి సంపాదకత్వంలో 'గమనం' సాహిత్య ప్రత్యేక సంచిక వెలువడింది. అందులో మేడిపల్లి రవికుమార్ 'తెలుగు సాహిత్యంలో మిథోపోయి' అన్న సుదీర్ఘ విమర్శా వ్యాసంలో ఈ మిథోపోయి వెలుగు చూసింది.

మిథోపోయి **(Mythipoeie)** పదబంధంలో రెండు పదాలు ఇమిడి ఉన్నాయి. ఒకటి మైథాలజి, ఇంకొకటి పోయిట్రి. పురణాలు, పురాణేతిహాసాల నేపథ్యంలో రాయబడిన కవిత్వం మిథోపోయి అవుతుంది.

మనం తెలుగులో వ్యవహరిస్తున్న పురాణ ప్రతీకలు, మిథోపోయికి సరిపోవు. మిథోపోయి ప్రత్యేకతలను చూపించలేవు. కనుక ఖచ్చితమైన తెలుగు పదం స్థిరపడేంత వరకు మిథోపోయి పదాన్ని విమర్శకులు స్థిరపర్చారు.

పౌరాణిక నేపథ్యంతో ఆధునిక జీవితాన్ని కవిత్వంలో ఆవిష్కరించడాన్ని, ఆంగ్లంలో మిథోపోయి అంటారు. కేవలం పురాణ ప్రతీక ఉన్నంత మాత్రాన సామాజిక పురోగతి ఆ కావ్యంలో ఉందనడానికి వీలులేదు. కొందరు సాంప్రదాయ వాదులూ, సనాతన వాదులూ సమాజాన్ని యథాతథంగా ఉంచేందుకో, సామాజిక తిరోగమనానికో పురాణ ప్రతీకను వాడుకోవచ్చు. అది మిథోపోయి కాదు. కనుక సామాజిక పురోగతిని కాంక్షించడం మిథోపోయి లక్షణం అని ఎవరూ మరువకూడదు.

ప్రపంచంలో ఈ మిథోపోయి అభివ్యక్తిని ఉపయోగించింది. టి.ఎస్.ఎలియట్ 'ద వేస్ట్ లాండ్' కవితతో. ప్రత్యేకంగా తెలుగులో ఈ అభివ్యక్తికి, ఆరంభం అంటూ ఏమీ లేదు. కొంత మసకగా కనిపిస్తోంది. కనిపించిన వరకూ, ఎన్నో ప్రక్రియలకూ ఆద్యుడైన వీరేశలింగం పంతులుగారే ఈ మిథోపోయికి ఆద్యుడుగా చెప్పాలి. 'సరస్వతీ నారద విలాపం' అనే ఖండకావ్యం ద్వారా కనిపిస్తోంది ఈ ధోరణి. అలా తెలుగులో మొదట వెలువడిన కవిత ఇదే.

అయితే, మిథోపోయి పద్ధతి తన కవిత్వంలో ప్రవేశపెట్టే ఏ కవికైనా, మైథాలజిపట్ల మంచిపట్టు ఉండాలి. పాఠకుణ్ణి సున్నితంగా తట్టిలేపగల నేర్పు ఉండాలి. అప్పుడే పాఠకుల హృదయాలు మూరేకుల్లా గుచ్చుకుని

విచ్చుకుంటాయి. లేకపోతే ముళ్ళపొదల్లా గుచ్చుకుంటాయి.

ఇంతటి ప్రత్యేకతలు కల్గిన మిథోపోయి నిర్మాణ పద్ధతిని, ఉపయోగించుకున్న స్త్రీవాద కవయిత్రులు ఎందరో ఉన్నారు.

స్త్రీవాదం, దళితవాదం, మైనారిటీ వాదం అనేవి ప్రధానమైన వర్తమాన సాహిత్య ధోరణులు. 1980 దశకం నుంచీ స్త్రీవాదం తెలుగు సాహిత్యంలో పట్టిష్టమైన రూపాన్ని పొందుతూ ఉంది.

స్త్రీవాదులు, పురుషాధిపత్య భావజాలాన్ని ప్రశ్నించడం, వారికున్న ప్రధానతాత్త్వికాంశం. సంఘంలో పురుషపక్ష ఆలోచనలకు అధికప్రాధాన్యం ఉండటం. సమస్త అధికారాలూ పురుషుని ఆధీనంలో ఉండటం, సమస్త పార్శ్వాలూ పురుషుని చెప్పుచేతుల్లోకి జారిపోవడం పురుషాధిపత్య భావజాలంలోని ప్రధాన అంశాలు. ఈ అంశాల వల్ల స్త్రీ ఈనాటికీ వివిధ కోణాల్లో దుర్భరమైన, భయంకరమైన పరిస్థితుల్ని ఎదుర్కొంటూనే ఉంది. ఈ విషయాన్ని స్త్రీవాదులు మిథోపోయి అభివ్యక్తీకరణ పద్ధతుల్లో కవిత్వాన్ని ఎలా ఆవిష్కరించారో ఓసారి పరిశీలిద్దాం.

భారతీయ వివాహ వ్యవస్థలో కట్టుబాట్లూ, వాటి చుట్టూ అల్లుకున్న పతివ్రతా సూత్రాలూ స్త్రీకి, జీవన సూత్రాలుగా పురుషవ్యవస్థ భావిస్తుంది. నిజానికి పతివ్రతల జీవితాలు మనం అనుకున్నంత గొప్పగా ఉన్నాయా? వాళ్ళ వ్యక్తిత్వాలకూ, అస్తిత్వాలకూ ఆటంకాలు లేకుండా వారు జీవించగలిగారా? ఇటువంటి లోతైనా సందేహాలు స్త్రీవాదులకు కలిగాయి. ఈ భూమికలోని సూత్రాన్ని ప్రముఖ కవయిత్రి జయప్రభ 'విస్తరిస్తున్న ఎడారులం' కవితా ఖండిక ద్వారా సూటిగా ప్రశ్నిస్తోంది.

"సీతగానో
సావిత్రిగానో
అనసూయ గానో అరుంధతి గానో తప్ప
బతకలేని వాళ్ళం
మొగుడిలేని ఛాయామార్గం వినా
వేరే తోవ తెలియని వాళ్ళం
మేం ఎవరిమని మాట్లాడగలం?
శతాబ్దాలుగా
ఈ జాతి 'పుంసకత్వాని'కి
అరాచకత్వానికి సమిధలమై
సగంచచ్చి బతుకుతున్నవాళ్ళం!"

సీత, సావిత్రి, అనసూయ, అరుంధతులు భారతీయ పతివ్రతలు. రామాయణంలోని సీతకష్టాలూ, భారతంలోని సావిత్రి మరణించిన భర్తను అనుసరించిన వైనాన్నీ, అరుంధతీ పాతివ్రత్యాన్నీ, మార్కండేయ పురాణమే కాక, భారత రామాయణాలు అందించే, అనసూయ పాతివ్రత్యశక్తినీ తెలియని భారతీయులు దాదాపు అరుదనే చెప్పాలి.

ఈ నలుగురు పతివ్రతలు ఏనాడూ తమ భర్తలకు బదులు/ఎదురు చెప్పినవారు కారు. భర్తల అడుగుజాడ నీడజాడలై మెలిగినవారే. ఇతరేతర ఆలోచనలూ, మార్గాలూ కోల్పోయి నిలిచినవారే. తమ తమ కంఠస్వరాలు మూగపోయి, మానసిక వేదనా రాగాలపనలో

> ***ఇంతటి ప్రత్యేకతలు కల్గిన మిథోపోయి నిర్మాణ పద్ధతిని, ఉపయోగించుకున్న స్త్రీవాద కవయిత్రులు ఎందరో ఉన్నారు. స్త్రీవాదం, దళితవాదం, మైనారిటీ వాదం అనేవి ప్రధానమైన వర్తమాన సాహిత్య ధోరణులు. 1980 దశకం నుంచీ స్త్రీవాదం తెలుగు సాహిత్యంలో పట్టిష్టమైన రూపాన్ని పొందుతూ ఉంది.***

రాటుదేలినవారే. వారి అస్తిత్వాలు ఆలోచనా నాస్తికత్వ గుణాలు.

సీత వగైరా, నాటి పతివ్రతలు ఈనాడు వ్యవస్థలో లేకపోవచ్చు. అయినా, సమాజంలో చాలామంది భార్యలు ఈనాడు ఆ దుస్థితిలో ఉన్నారు. నిజానికి కవయిత్రి ఒక నాటి పతివ్రతల మిషతో ఈనాటి భార్యల స్థితిగతులను ఈ ఖండికలో ఖండిస్తూ విశ్లేషించారు.

బి.ఇందిర అనే కవయిత్రి 'అనాదిగా' కవితలో అనాదిగా స్త్రీ అనుభవిస్తున్న ఇదే దుస్థితిని కవిత్వీకరించారు.

"హరిశ్చంద్రుడికి ఇల్లాలినైనా
అమ్ముడుపోక తప్పలేదు
పోగా అది తప్పుకాదట
ముప్పుతిప్పలు తప్పవట"

భర్తల అస్తిత్వం కోసం, పరువు ప్రతిష్టల కోసం తమ తమ అస్తిత్వాలను వదులుకున్న భార్యలూ, తమ తమ జీవితాల్ని త్యాగం చేసుకున్న అర్ధాంగులూ మన ఇతిహాసాల్లో

అనేకమంది ఉన్నారు. యుగాలు గడుస్తున్నా, సమాజం ఎంతగా ఆధునికతను పుంజుకుంటున్నా ఒక నాటి భార్యల కష్టాలూ, కన్నీళ్ళూ ఇప్పటికీ సజీవ రూపాలుగా మార్చుకుని ప్రవహిస్తూనే ఉన్నాయి. భర్తల అవసరాల కోసం అమ్ముడుపోతున్న భార్యలు, బలవుతున్న భార్యలూ ఇంకా సజీవంగా ఉన్నారు. ఇది భారతీయ వైవాహిక వ్యవస్థలో, పురుషాధిపత్య సమాజంలో స్త్రీలపై పురుషులకు సంక్రమించిన అధికారాలకు నిదర్శనం.

పురుషాధిపత్యం తర్వాత స్త్రీవాద తాత్త్విక దృక్పథంలో లక్ష్యాంశంగా ఉన్నది జెండర్ వివక్ష. స్త్రీవాద కవయిత్రులు ఈ అంశాన్ని మిథోపోయి పద్ధతిలో ఏ విధంగా కవిత్వీకరించారో చూద్దాం. సెక్స్‌కూ, జెండర్‌కూ మధ్య ఉన్న స్పష్టమైన భేదాన్ని గుర్తించడం జెండర్ వివక్షతను అర్థం చేసుకోవడానికి ఉపకరించే తొలి దశ. సెక్స్ శరీరానికి సంబంధించింది. జెండరు కుటుంబానికీ, సమాజానికీ సంబంధించింది. సెక్స్ సహజమైనది. జెండర్ కృత్రిమమైనది. ఒక వ్యక్తి ఆడగానో, మగగానో సమాజంలో పెరిగి, అసమానతలు రావడం జెండర్ పరంగానే అని గుర్తించారు. ఈ స్త్రీపురుషుల మధ్య అసమానతలు లేకుండా ఇరువురినీ సమానంగా, ఒక మనిషిలా పెంచడం వల్లనే వీరిమధ్య అసమానతలు తొలగుతాయనేది స్త్రీవాదుల భావన.

సెక్స్, జెండర్‌ల మధ్య వ్యత్యాసాలను స్త్రీవాద కవయిత్రులు ఏ మేరకు గుర్తించారో పరిశీలిద్దాం. ప్రముఖ స్త్రీవాద కవయిత్రి జ్వలిత రచించిన 'అంధత్వం' అనే కవితా ఖండికను చూద్దాం.

"దృతరాష్ట్రునిలా, పుట్టుగుడ్డికాదుగదా మనం
గాంధారిలా ఆపాదించుకున్న అంధత్వం మనది
యిందుకు లింగభేదం లేదు
చూపుకేకాదు మనసుకూ మనకెందుకులే అని ఉపేక్ష"

మహాభారతంలోని గాంధారి, దృతరాష్ట్రునికథ లోక ప్రసిద్ధమే. దృతరాష్ట్రుడు పుట్టుగుడ్డి అని తెలిసినా గాంధారి, అతన్ని వివాహమాడవలసివచ్చింది. ఆడింది. భర్తకు లేని చూపు భార్యకెందుకని తానూ కళ్ళకుగంతలు కట్టుకుని కృత్రిమంగా అంధత్వం ఆపాదించుకుంది. జీవితాంతం ఈ అంధత్వాన్ని కొనసాగించడం గాంధారికి జెండర్ వివక్ష పేరుతో సంఘం విధించిన శిక్ష అంటుంది జ్వలిత. భర్త అడుగుజాడల్లోనే కాదు చూపుమేరల్నీ మోసింది గాంధారి.

తల్లిదండ్రులు ఆడపిల్లల్ని ఎంత అపురూపంగా పెంచుకున్నా, మరెంత ఆణిముత్యంగా చూసుకున్నా, చివరికి ఏ ఆరళ్ళు పెట్టేవాడికో, అధికారాన్ని చెలాయించే వాడికో కట్టబెట్టాల్సిందే అన్న వ్యంగ్యధోరణి కంఠస్వరాన్ని కవిత్వంలో నింపుకుని నినదించిన కవయిత్రి సావిత్రి. ఈమె రచించిన 'అంతా నీకోసమే' ఖండిక అందుకు వేదికైంది.

"ఆరళ్ళుపెట్టే మొగుడికో, అధికార మదాంధుడికో
అప్పగించడానికే అపురూపంగా పెంచుతాం
బతకనేర్వనందుకు పదే పదే విస్కుక్కోవడానికే
చక్కనైనా మాటలతో 'సామాజిక స్పృహ' నేర్పుతాం
వొంటరిని చేసి వొదిలేయడానికే
పదిమందితో కలవమని బలవంతం చేస్తాం

***సెక్స్‌కూ, జెండర్‌కూ మధ్య ఉన్న స్పష్టమైన భేదాన్ని గుర్తించడం జెండర్ వివక్షతను అర్థం చేసుకోవడానికి ఉపకరించే తొలి దశ. సెక్స్ శరీరానికి సంబంధించింది. జెండరు కుటుంబానికీ, సమాజానికీ సంబంధించింది. సెక్స్ సహజమైనది. జెండర్ కృత్రిమమైనది. ఒక వ్యక్తి ఆడగానో, మగగానో సమాజంలో పెరిగి, అసమానతలు రావడం జెండర్ పరంగానే అని గుర్తించారు.***

చివరికి యిజాలను 'కుట్ర'ల్లో యిరికించి, నిజాలను
నిలువునా నిషేధించడానికే
సత్యహరిశ్చంద్రుని అత్యాచారాలను కూడా
ఆదర్శం చేస్తాం"

పురాణేతిహాసాల కాలం నుండీ పురుషాధిపత్య సామాజికవ్యవస్థ స్త్రీకి అలవాటు చేసిన ఒకానొక ధర్మం పాతివ్రత్యం. నాటి నుంచీ నేటి వరకూ భర్తల పట్ల భార్య ఎంత అణకువగా ప్రవర్తించాలి? భర్త ఇష్టాయిష్టాల మేరకు ఎలా నడుచుకోవాలి? ఏయే వేళలో ఏయే సేవలు చేయాలి? పరపురుషుల పట్ల ఎలా ప్రవర్తించాలి? వంటి పన్నాగాలు పతివ్రతలకు ధర్మపన్నాలు. హరిశ్చంద్రుని అత్యాచారాలను సైతం ఆదర్శం చేయడం కవయిత్రి సమతాభావ ఆలోచనకు పరాకష్ట.

జెండర్ వివక్ష పట్ల స్త్రీవాద కవయిత్రుల్లో సైతం పరోక్షంగానో, ప్రత్యక్షంగానో వారి స్వరాలు మార్పు చెందుతున్నాయి. మందరపు హైమవతి 'ద్విపాత్రాభినయం'లో

ఈ మార్పు గుర్తించగలం.

"పతిదేవుని టేబుల్‌పై
కాఫీ కప్పుగా, మీల్స్ కారియర్‌గా
పిల్లల లంచ్ బాక్స్‌లుగా
బహుపాత్రాభినయ పోటీలో
నా చేతులకెప్పుడూ ఫస్ట్ ప్రైజే
నా శరీరమే చేతులుగా మారినా
నా హస్తద్వయమే
కార్తవీర్యార్జుని సహస్ర బాహువులుగా
పరిణమించినా పనిచేసినా
ఆఫీసుకు వెళ్లేంతవరకు నాపని అనంతమే

■ ■ ■

ఆఫీసరు అసురుడు అనేస్తాడు ఆఖరికి
ఆడవాళ్ళకెందుకమ్మా ఉద్యోగాలని
ఆనాటి సీత అభిమానం కాపాడిన భూమాత
మళ్ళీ ప్రత్యక్షమవకూడదూ అనిపిస్తుంది ఆ క్షణం"

ఆడవాళ్ళకెందుకు ఉద్యోగాలనే మాట నేటికీ, సంఘటిత రంగంలో తరచూ వినిపిస్తున్న మాట. తల్లిదండ్రులు, భర్త, ఆఖరికి అధికారులూ ఇంతే. పురుషుల మధ్య నానాటికీ జెండర్ పరమైన వివక్షలూ, బాధలూ కష్టాల నుంచీ, మహిళ బైటపడాలని కొరుకుంటోంది. అందుకే త్రేతాయుగంలోని రామాయణం అంతిమ ఘట్టంలో భూమాత సీతాదేవి అభిమానాన్ని కాపాడినట్లు, నేటి మహిళ కొత్త ఆలోచనకు సిద్ధమౌతోంది. ఈ వాస్తవాన్నే కవయిత్రి భూమాత మళ్ళీ ప్రత్యక్షమవ్వాలని కోరుకోవడం అనే సూచన చేశారు.

స్త్రీవాదతాత్త్విక చింతనలో చాలా ప్రాముఖ్యం కల్గిన అంశం లైంగికత. లైంగిక సంతృప్తి, దాంపత్య జీవితంలో స్త్రీపురుష సంబంధాలు, బిడ్డల్ని కనడం వంటి విషయాల్లో స్త్రీకి సరైన స్వేచ్ఛ లేకపోవడాన్ని స్త్రీవాదులు తీవ్రంగా పరిగణిస్తున్నారు.

వయసుతోనూ, వావివరుసలతోనూ సంబంధం లేకుండా లైంగికదాడుల్ని నిత్యం సంఘం ఎదుర్కుంటున్నదే. అత్యాచారాలు, వేధించడాలు వంటివి అనేకం, స్త్రీ జీవితానికి గ్రహణం పడుతున్నటువంటి అంశాలు. కారణం, స్త్రీకి హృదయం, మనసూ వంటివి లేవు. కేవలం శరీరమే ఉంటుంది. స్వంత ఆలోచనలకూ, ఇష్టాయిష్టాలకూ తావులేని శరీరంలా, పురుషుడు అనుభవించే, ఇతరులకు ఎరవేసే పురుషుని అవసరాలు తీర్చుకోడానికి లైంగికవినియోగ పరికరంలా మిగలడం విచారకరం.

మందరపు హైమవతి 'సంతకాలు చేద్దాం రండి' కవిత ఈ సందర్భంలో ప్రస్తావించుకోదగింది.

"గాయాలు మానినా
మచ్చలు మానవు
వెంటాడే విషాదస్మృతుల్లాగా
ఆనాడు పురాణాల్లో
ఏ మహర్షి తపోభంగాని కైనా
ఓ ఊర్వశీ విలాస దృగంచలం
ఓ మేనకా మనోజ్ఞ భంగిమ
మహేంద్రుని ఆయుధాలు"

దేవలోకంలోని అప్సరసలు ఊర్వశీ, మేనకలు. వీరు ఇంద్రుని చేతిలో కీలుబొమ్మలు. తన పదవికి భంగం, విఘాతం కల్గుతుందన్న భయంతో తపస్సును ఏ మహర్షి చేసినా, తపోభంగం చేయడానికి వీరిని ఎరవేస్తాడు ఇంద్రుడు. ఈ ఎరవేసే తత్త్వం ఇంద్రునితో పోలేదు. నేటి ఆధునిక ఇంద్రుల వరకూ నడిచిందీ, నడుస్తూంది.

కేవలం, శత్రువులను లోబరచుకోవడానికి స్త్రీని లైంగిక ఆయుధంగా వినియోగించుకున్నారటానికి ఇదొక దృష్టాంతం. నాటి పురాణేతిహాసాల్లో కన్పించే ఘట్టాల్లో ఈ నాటికీ స్త్రీజాతిని వెన్నాడుతున్న విషాద స్మృతులని కవయిత్రి అభివర్ణించారు.

భారతీయ సాహిత్యంలో స్త్రీ శరీరం కేవలం భోగవస్తువుగానే వర్ణించబడింది. దీనిని మరోమారు నిర్ధారిస్తూ పాటిబండ్ల రజని 'అబార్షన్ స్టేట్‌మెంట్' రూపంలో ఇచ్చింది.

"నీకు పంచేందుకు రక్తం లేకే కదా
నిన్ను పెంచేందుకు తీరికలేకే కదా

■ ■ ■

రబ్బరుచేతుల ముసుగు నీముఖంపై కప్పి
అభిమన్యుడి శరాల కప్పుజెప్పి
నిస్సహాయులైన పాండువుల్లా రోదిస్తూ
పెథిడ్రిన్ సెడేషన్‌లో నిన్ను పోగొట్టుకుని
పగిలిన జిల్లేడుకాయ తాలూకూ పింజనై సోలిపోతూ
నాలోని అమ్మను పాతిపెట్టుకుని

చెరకు పిప్పినై పారిపోతూ
కంసుడి కత్తిలాంటి ప్లాస్టిక్ బకెట్ మింగిన
ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ముద్దలాంటి నిన్నుచూసి
మళ్ళీ నా పొత్తిళ్ళల్లో పొదువుకోవాలనీ"

ఏయే పరిస్థితుల్లో, ఏయే కారణాల వల్ల ఒక స్త్రీ, గర్భవిచ్ఛిత్తి చేసుకుంటుందో, దీని వెనుక ఏ శక్తులు ఏయే పార్శ్వాలలో పనిచేసి ఉంటాయో కవయిత్రి త్రీడీలో చూపించారు.

అభిమన్యుడి కథ మహాభారతం కావచ్చు. కంసుడి పాత్ర భాగవతం కావచ్చు. అభిమన్యుణ్ణి శరాలకు అప్పజెప్పినట్లుగా, కడుపులోని పిండాన్ని వైద్యులకు అప్పజెప్పి, నిస్సహాయులై రోదిస్తున్న పాండవుల పరిస్థితి, అబార్షన్ చేయించుకున్న తల్లులది. తల్లి ఆధీనంలోనే ఛిద్రమవుతున్న పసిగుడ్డుని, కంసుని కత్తిలాంటి ప్లాస్టిక్ బకెట్ మింగేసిన కుట్రను భారత భావితరానికి కనువిప్పుగా చూపింది.

***కుటుంబాన్ని ఒక సామాజిక యూనిట్‌గా పరిగణించాలన్నది, స్త్రీవాదుల మరో ప్రధానమైన అంశం. ఇంటిపని, వంటపని, బిడ్డలపెంపకం వంటి విషయాలలో కుటుంబ భాగస్వామ్యం ఉండాలన్నది వీరి తాత్త్విక ఆలోచన.***

కుటుంబాన్ని ఒక సామాజిక యూనిట్‌గా పరిగణించాలన్నది, స్త్రీవాదుల మరో ప్రధానమైన అంశం. ఇంటిపని, వంటపని, బిడ్డలపెంపకం వంటి విషయాలలో కుటుంబ భాగస్వామ్యం ఉండాలన్నది వీరి తాత్త్విక ఆలోచన. ఇటువంటి అంశాలలో స్త్రీవాదులు లోతైన కవిత్వ చర్చ చేశారు.

జయప్రభ 'వంటింటి నుంచి వల్లకాటి దాకా' ఖండిక కుటుంబ వ్యవహారాల్లో స్త్రీలు వివక్షకు గురైన అంశాల్ని మిథోపోయి ధోరణిలో గుర్తించింది.

"అందుకే
నా విషయంలో
కర్ణార్జునులిద్దరికీ వైరం లేదు!
నా ముందు నుంచున్న
ధర్మరాజుకీ దుశ్శాసనుడికీ భేదం లేదు!
ఇల్లు సర్దుకునే పిల్లల నెత్తుకునే
పద్మవ్యూహంలో చొరబడి
పోరులోంచి పొయ్యిలోకి
పరిగెడుతుంటాను!
నిరంతరం...
నా శరీరంతో యుద్ధం
ఈ సమాజంతో యుద్ధం
వంటింటి నుంచి వల్లకాటి దాకా"

అనే శీర్షిక, స్త్రీ జీవితంలో రెండు దశల్ని సూచిస్తుంది. మొదటిది వంటిల్లు. రెండోది వల్లకాడు. అంటే చనిపోయే వరకూ సగటు మహిళ చిరునామా వంటిల్లే.

ఇల్లొక పద్మవ్యూహం. అందులోకి ఒక్కసారి ప్రవేశించాక బైటకు రావడం కష్టం. ఇల్లు సర్దుకోవడం-ఇంటిపనినీ, బిడ్డల్ని ఎత్తుకోవడం- బిడ్డల పెంపకాన్ని సూచిస్తున్నాయి. కుటుంబ పని విషయాల్లో పురుషులెవ్వరూ పాలు పంచుకోకపోవడాన్ని ఈ ఖండిక ఖండిస్తోంది. ఇతరేతర విషయాల్లో కర్ణార్జునుల కిద్దరికీ వైరం ఉండొచ్చు. ధర్మరాజుకూ, దుశ్శాసనుడికి భేదం ఉండొచ్చు. కాని స్త్రీల విషయానికొస్తే చక్కటి ఒద్దిక వీరిలో కనిపిస్తుంది. ప్రేమించి పెళ్ళి చేసుకున్న భర్తైనా, ఎన్నో ఉత్తమగుణాలున్న మొగుడైనా వారి అవసరాలన్నీ, పడకగదిలోనే కానీ, పనుల విషయంలో కాదన్నది ఈ ఖండిక వివరిస్తుంది.

ఆధునిక స్త్రీ, ఇప్పుడు పురుషునితో సమానంగా విద్యావంతురాలైంది. పురుషునితో పాటూ వివిధ రకాల ఉద్యోగాల బాధ్యతలను కూడా నిర్వహిస్తోంది. ఈ బాధ్యతల మూలంగా స్త్రీ, ఒక వ్యక్తిగా విజ్ఞానవంతురాలు కావచ్చు గాక, ఉద్యోగినిగా, కుటుంబ ఆదాయాన్ని పెంచొచ్చు గాక, ఇంటి పనుల్లో ఏ మాత్రం వెసులుబాటు, విశ్రాంతి దక్కకపోవడం స్త్రీ జీవితాల్లో మరోవిషాదం అంటూ మందరపు హైమవతి 'ద్విపాత్రాభినయం' ఖండిక ప్రస్తావిస్తుంది.

"బహుపాత్రాభినయ పోటీలో
నాచేతులకెపుడూ ఫస్ట్‌ప్రైజే
నా శరీరమే చేతులుగా మారినా
నా హస్తద్వయమే
కార్తవీర్యార్జుని సహస్ర బాహువులుగా
పరిణమించినా పనిచేసినా
ఆఫీసుకు వెళ్ళేంతవరకు నా పని అనంతమే"

## కవిత

# మట్టి మన ఆకృతి

- అడిగోపుల వెంకటరత్నమ్
9848252946



మట్టి మన మాతృక
మట్టి మన ఆకృతి
మట్టి మన సంస్కృతి
మట్టి మన భూమిక
బొట్టు బొట్టును కూడగట్టి మట్టి
కాలువగా ఏరుగా నదిగా పారిస్తుంది
సముద్రాన సంగమం చేస్తుంది
మట్టి చేతులపై సముద్రం నిలబడి వుంది!
బొట్టు బొట్టును ఇంకగట్టిన మట్టి
భూగర్భ జలాశయాల్లో మదుపు చేసి
మానవాళి భవితకు పంచుతుంది!
మట్టి మౌనంగా
సస్యవిప్లవం సృష్టించి
బంగారు పంట అందిస్తుంది!
నాటిన విత్తుకు
తల్లి పాలను అందించి
మొక్కను చేసి మానుగా మారుతుంది!
దాహార్తి ఐనపుడు
ముఖం నెర్రెలుగా విచ్చుతుంది
దాహం తీరినపుడు
బల్ల బరువుగా నిర్మిత మౌతుంది!
మట్టి వొంట్లో
మనిషి గుండెదాగివుంది
మనిషి మనసులో
మట్టిగొంతు కలసివుంది!
మట్టి ఒక చోట పచ్చని తివాసీ
ఒక చోట ఎర్రని ఎడారి
ఎడారైనందుకు చింతిస్తుంది
సస్యశ్యామలమైనందుకు సంతసిస్తుంది!
నాగలి దున్నాక వొళ్ళంతా
గాయపడ్డ మట్టి ఎలా విలపిస్తుందో
భవనాలకు పునాదులు తవ్వాక
అవయవాలు తెగి ఎలా దు:ఖిస్తుందో
బిడ్డలు పెట్టిన బాధల్ని మరిచి
మట్టి తల్లి మోదం కురిపిస్తుంది!
మట్టి ఒక చోట బంగారం
ఆభరణమై అలంకరిస్తుంది
మట్టి ఒక చోట జగత్సాక్షి
దైవమై దీవెనలు అందిస్తుంది
అంతవరకు అవిశ్రాంతమై
తిరుగాడిన బిడ్డ
దీర్ఘ విశ్రాంతికి జారితే
గర్భంలో ఐక్యం చేసుకుని
తిరిగి మట్టిగా మారుస్తుంది!
మట్టి ఒకచోట యుద్ధభేరీ మోగిస్తుంది
మట్టి ఒకచోట
శాంతి కపోతాన్ని ఎగరేస్తుంది!

---

ఆఫీసుకు వెళ్ళేంత వరకూ స్త్రీలకు ఇంట్లో పని ఓ యుద్ధ వాతావరణం. ఈ వాతావరణాన్ని నెగ్గడం మనిషికున్న రెండు చేతులు సరిపోవు. ఈ పనికి కార్తవీర్యార్జునిలా సహస్ర బాహువులు అవసరం ఏర్పడుతుంది. కనుకే స్త్రీ, తన శరీరాన్నే చేతులుగా మార్చుకుంటుంది.

కార్తవీర్యార్జునుని పాత్ర రామాయణంలోనిది. ఇతడొక క్షత్రియుడు. వరసిద్ధి మూలంగా వేయిచేతులు కావాలని దత్తాత్రేయుని నుండి వరం కోరుకున్నాడు. పొందాడు. కానీ, ఇక్కడ స్త్రీలకు కావలసిన సహస్ర బాహువులు వరసిద్ధి కోసం కాదు పరసిద్ధి కోసం.


ఇంతటి ప్రత్యేకతలు కల్గిన మిథోపోయి నిర్మాణ పద్ధతిని అనుసరించిన స్త్రీవాద కవయిత్రులు ఎందరో ఉన్నారు. పురాణేతిహాసాలపై కవులకూ, కవయిత్రులకూ విశ్వాసం ఉన్నా లేకపోయినా సామాన్య ప్రజలకు ఇతిహాసాల పట్ల ఎనలేని గౌరవప్రత్తులు ఉంటాయి. ఈ మైథాలజికి సంబంధించి పాత్రలు, సన్నివేశాలు, ప్రతీకల పట్ల పాఠకుల హృదయాల్లో కొన్ని భావచిత్రాలు పదిలంగా, పవిత్రంగా ఉంటాయి. ఆధునిక జీవితాన్ని కవిత్వంలో ఆవిష్కరిస్తూ, వాటిని ప్రస్తావించినప్పుడు పాఠకుల్లోని భావచిత్రాలు స్పందిస్తాయి. గులాబీ రేకుల్లా విచ్చుకుంటాయి. కవితల పట్ల పాఠకులకి ఆసక్తి పెరుగుతుంది. విషయం చిరకాలం గుర్తుండటానికి అవకాశం ఉంటుంది. ఈ అవకాశం మూలంగా కవిత్వం పాఠకుల హృదయాల్లోకి నేరుగా ప్రవేశిస్తుంది. పాఠకుల సంఖ్యను పెంచుతుంది.

ఏది ఏమైనప్పటికీ అకాశంలోనూ, సమాజంలోనూ సగభాగం స్త్రీలు కాబట్టి వారికి ఇవ్వవలసిన, దక్కవలసిన హక్కులూ, స్వేచ్ఛలూ ఏ రంగమైనా వారికి దక్కవలసిందే. అప్పుడే సమాజం సమానమవుతుంది. లేకపోతే కుసమాజం అవుతుంది. అది సమ సమజానికి మంచిది కాదనేది స్త్రీవాదుల కవిత్వంలోని తాత్త్విక భావన. ❐

## కవిత

# కలల బేహారి

- తమ్మెర రాధిక
9440626702




**రు**తు సంహారమెప్పుడో జరిగిపోయింది
ఎండల్లో వానలూ
వానా కాలపు వడగాలులూ!
వ్యాపార పవనాలు వీచడం ప్రారంభించాక
నీటినీ నింగినీ
ఆకునీ అంబరాన్ని అమ్ముకు తినడం మరిగాక
ఎడారిలో ఒయాసిస్సుని కలకన్నట్టుగా లేదూ
మనసు!
పక్షులు గూళ్ళు పెట్టడానికి చెట్లున్నాయనెప్పుడో
మర్చేపోయాయి!
ఇళ్ళల్లో వేసిన సీలింగుల్లో సర్దుకు పోతున్నాయి.
ఆదిమ కాలంలో వేసిన ఇంద్ర ధనస్సు
అకాల వర్షానికి వెలిసిపోతూ కనిపించిందాకాశంలో!
పచ్చిక బయలంతా
బరిబాత పిల్లాడిలాగా బురద గుంటలతో ప్రకృతంతా
మారుతోంది!
స్థంభించిపోయిన స్వప్నంలాగా
కరిగిపోతున్న దిగులుగా
తనని తాను కూడగట్టుకుంటూ భూమాత
కెల్లాజ్ చిత్రంలాగా అతుకులతో
దాటకూడని సరిహద్దులని నిర్మిస్తోంది!
సౌకర్యాలే స్వేచ్ఛ అనుకుంటూ
భూ మండలాన్ని ఒంటి చేత్తో దనుమాడే మనిషి
హాలోజన్ లైట్ల వెలుగుల్లో వెండి వెన్నెలను పారేసుకొని
అలజడీ ఆకలి కేకలకే ఆద్యంతం స్వరాలు
కూరుస్తున్నాడు.
ప్రకృతి వనరులతో మార్కెట్ మాయ చేసే
ప్రపంచ బేహారుల వ్యూహంతో
మనుగడ సాగించే మనిషి
తనను తాను కోల్పోయి గ్లోబల్ తుఫానులకు
ఎర అవుతున్నాడు!

---

# నానీలు

తగుళ్ళ గోపాల్
9505056316



**ని**రంతరం రాస్తున్నాను
కవిత్వం
తపస్సు అంటే
ఇదేనా అన్పిస్తుంది

ఈడూ జోడూ
బాగానే కుదిరింది
వరకట్నమే
శాపమయ్యింది

పగలు రాత్రిని
గుర్తించలేకపోతున్నా
మకాం
పట్నానికి మారాక

అమ్మ ప్రేమను
వర్ణించాలని తపన
ఏ పద్యంలోనూ
అది పట్టలేదు

## సంస్మరణ



**అలిశెట్టి ప్రభాకర్**
**12-1-1954 - 12-1-1993**

# గాయాలకు అక్షర లేపనాలు అద్దిన కవి

**- బి. నర్సన్**
**9440128169**

**సూ**ర్యుడు స్వయం ప్రభాకరుడయినట్లే అక్షర సూర్యుడు అలిశెట్టి ప్రభాకర్ కూడా స్వయం ప్రతిభాసంపన్నుడు. సమాజంపై తనకున్న స్పష్టతకు, స్వతహా అబ్బిన కళాకౌశలాన్ని జోడించి తెలుగు కవిత్వంపై తనదైన ముద్రవేసి, అభిమానుల గుండెల్లో మరెవరూ పూడ్చలేని లోటు మిగిల్చి 'మరణం నా చివరి చరణం కాదు' అని చెప్పి మరీ వెళ్లిపోయాడు.

12 జనవరి 1954 నాడు జన్మించిన అలిశెట్టి ప్రభాకర్ భౌతికంగా బతికింది 39 ఏళ్లే. అందులో కవిగా కొనసాగింది 20ఏళ్ళకు పైనే. అంటే లోక జ్ఞానం తెలిసిన నాటినుండి చివరి ఊపిరి వరకు కవిత్వమే జీవిత మనుకొన్న ధన్యజీవి. అమోఘమైన విషయపరిజ్ఞానం. అవగాహన ఆయన సొత్తు. అలుపెరుగని ఆలోచన, ఘర్షణ, సాధన ఆయన అస్త్రాలు. చదువు చూస్తే వదిలేసిన ఇంటర్మీడియట్. చదివిన పుస్తకాలు ఎన్నున్నా సమాజమే ఆయనకు పాఠశాల. తన కెమెరా కళ్ళతో చూసిన దృశ్యాన్ని క్షణాల్లో కవితా చిత్రంగా మార్చడం ఆయనకు ఏకలవ్య విద్య.

ఆయన రాసిన – 'ఒక రూపాయి బిళ్ళుంటే/ విష్ణుచక్రంలా తిప్పుతా/ రెండుంటే/ బండి చక్రాల్లా అమర్చుతా/ లక్షలకు లక్షలుంటే/ మిమ్మల్నంతా/ నా చుట్టూ ప్రదక్షిణ చేయిస్తా!' అన్న కవితా పంక్తులు ఒక అర్థశాస్త్ర పుస్తకానికి ముందు మాటలో తొలిపలుకులుగా వాడబడడం అలిశెట్టి ఆర్థిక అవగాహనకు నిదర్శనం.

1970–80 దశకం తెలుగులో నవకవుల యుగం. ఆనాటి యువతకు నాటి సామాజిక పరిస్థితులు, విద్యలో ముందంజ, పుస్తక పఠనంపై ఆసక్తి కలగలపి సాహితీసృజన వైపు దారి చూపాయి. ఆనాటి వరకు కవిత్వమంటే పాఠ్యపుస్తకాల్లోని పద్యభాగమే. ఆ రోజుల్లో వచ్చే పత్రికల్లోని వచన కవిత్వం వారికి కొత్త రుచులు చూపింది. కవిత్వం భావవ్యక్తీకరణకు ఒక రూపమని, మనమూ ప్రయత్నించవచ్చని భరోసా ఇచ్చింది.

పై ప్రభావానికి లోనైన అలిశెట్టి ప్రభాకర్‌కు లోలోన కొట్టుమిట్టాడుతున్న ప్రతిభకు కొత్తదారి దొరికింది. తోటి మిత్రులు ఎటు వెళ్లినా కవిత్వమే జీవితలక్ష్యంగా చివరి వరకు నిలిచాడు. అది కాల్చినా, కూల్చినా నిబ్బరంగా తట్టుకున్నాడు.

ప్రభాకర్‌పై దినదిన గండంగా బ్రతుకులీడుస్తున్న సామాన్యుల ముద్ర తప్ప మరే కవి ప్రభావం లేదనడానికి అతని అక్షరాలే సాక్ష్యం. ఎంత పుటం పెడితే లోహం అంత మెరుపునిస్తుందన్నట్లు ప్రభాకర్ నిప్పుల కొలిమిలో రగిలి రగిలి కవిత్వాన్ని సృష్టించాడు. సామ్రాజ్యవాదాన్ని, రాజకీయ దాష్టీకాల్ని నిర్ద్వంధంగా తిప్పి కొట్టాడు. వాటిపై రాజీలేని పోరాటం ఆయన కవిత్వంలో ఎక్కువగా కనబడుతుంది.


'ఏ దేశం శిరసుమీద/ మోపిన/ పాదాలైనా/ హోదాలైనా/ సామ్రాజ్య వాదాలే' అని చిన్న పదాలతో సామ్రాజ్యవాదానికి ప్రపంచదేశాల దాసోహాన్ని కళ్లకు కట్టాడు.

'దాహం దాహంగా/ డాలర్ నాలుక చాచిన/ బహుళజాతికుక్కా/ దేశం దేశమంతా/ వాగ్దానాల ఊళపెట్టే/ అరాజకీయాల నక్కా/ రెండూ బహు ప్రమాదకరమైనవి' అని ఏ పాలకుడైనా ఒకటేనని హెచ్చరించాడు.

ప్రభాకర్ మనసునిండా సమాజపు దుష్టరీతులపై పట్టరాని కోపం, శ్రమజీవుల పట్ల వల్లమాలిన సానుభూతి. ఈ రెండూ ఆయన కవితా రథానికి రెండు చక్రాలు. ఇలాంటి

# విశ్వరూపి

- పిట్ట సాంబయ్య
9849674768



**కవీ –**

*స్పందనల సముద్రం*
*ఆవేదన కలిగినపుడు*
*మొత్తం హృదయంగా ద్రవిస్తాడు బాధతో*
*ఆవేశమైతే ఆకాశమంత ఆక్రోశిస్తాడు*
*ఆనందమైతే,*
*అందులో ఆనందంగా ఓలలాడుతాడు*
*సంఘటనలన్నీ తన్మయంగా*
*తనలో సమ్మేళనం చేసుకొని*
*సాహిత్యంగా తన కలం నుండి*
*జాలువారుతాడు*
*అతని హృదయమంతా*
*ఎన్నో – ఎన్నెన్నో*
*ఉద్విఘ్నాల ఉద్వేగాల సంలీనమే కదా!*

*దిక్కు తెలియక సాగే నిశీధి ప్రయాణంలో*
*మార్గం చూపే వేగుచుక్క*
*సమాజపు చౌరస్తాలో నిలబడి*
*వేయికళ్ళతో కాచే వాచ్‌డాగ్*
*ప్రశాంతంగా కనిపించినట్లనిపించినా*
*బడబాగ్నుల కడలి, బద్ధలయ్యే అగ్నిపర్వతం*

*ఆవేదన ఆవేశమైతే*
*అక్షరాలతో వేయి మెరుపులై*
*పిడుగులు కురిపిస్తాడు*
*ఆకాశమంత ఎత్తుకు ఎదిగి*
*అవనియంత కలియుజూసే*
*విశ్వరూపి– చూపున్నవాడు కవి.*

---

దృశ్యం ప్రభాకర్ కంట పడితే చాలు క్షణాల్లో అసంకల్పితంగా కవిత్వంలోకి అనువదింపబడుతుంది. ఓ మిత్రుడిని సాగనంపడానికి జగిత్యాల బస్టాండుకు వచ్చిన ప్రభాకర్‌కు ఎదురుపడిన ఓ దీన స్త్రీ దుస్థితి కవితా వస్తువై ఆయన నోట వెంట జలజలా రాలిపడిన అక్షరాలే వేశ్య కవిత – 'తాను శవమై.../ ఒకరికి వశమై.../ తనువు పుండై.../ ఒకరికి పండై.../ ఎప్పుడూ ఎడారై.../ ఎందరికో ఒయాసిస్సై ఈ కవితకు మరే వ్యాఖ్యానం అవసరంలేదు.

సమాజంలోని ధనిక, పేద వర్గాలను విడదీసి పేదల వైపు నిలబడి, ధనస్వామ్యాన్ని చీల్చి చెండాడుతూ లోకం గుట్టు విప్పి చెప్పడం కూడా ఆయన కవితా లక్షణమే. 'అన్నం మెతుకునీ/ ఆగర్భ శ్రీమంతున్నీ / వేరు చేస్తే/ అసలు శ్రమ విలువేదో/ తేలిపోదూ?' అని సూక్ష్మంలో శ్రమ విలువను తూకం వేస్తాడు' గుడిసెలే/ మేడల్ని/ కడుతాయి/ అయినా/ మేడలే / గుడిసెల్ని/ కొడతాయి' అని వర్గ దృక్పధాన్ని స్థిరీకరిస్తాడు.

ప్రభాకర్ ఆకలి తెలిసిన కవి. 'ఆకాశమంత/ ఆకలితో/ అన్నం మెతుకంత/ చందమామ కంటికి ఆనదు ఆకలి తీరదు'. ఇంకా 'కడుపుమీద/ తడిసిన అగ్గిపుల్లతో గీసినా/ భగ్గున మండితే/అదేరా/ ఆకలి అదేవిధంగా– అందంగా/ తోకాడించే/ కుక్కపిల్లలాంటిది/ కాదు ఆకలి కుట్టిన ఎర్ర తేలు/ మంట లాంటిది ఆకలి అంటాడు. ఆకలిపై ఇలా ఇంత తీవ్రంగా ప్రతిస్పందించిన కవిత్వం మరెక్కడా కానరాదు. 1983లో మకాం హైదరాబాదుకు మార్చిన ప్రభాకర్ తన కవితాచిత్ర ప్రదర్శనల ద్వారా ఆనాటి యువతకు సుపరిచితుడు. ఆరున్నర ఏళ్లు ఆంధ్రజ్యోతి దిన పత్రికలో 'సిటీలైఫ్' అనే కవితా ఖండిక శీర్షికను నిర్వహించిన ప్రభాకర్' నగర జీవితం'లోని సుఖదు:ఖాలను స్వయంగా అనుభవించాడు.

ధూమపానంతో ఊపిరితిత్తుల్లో తిష్టవేసిన క్షయవ్యాధి తిరిగి రాజుకుని ఆయన్ను కబళించే అంతిమ ఘడియల్లో సైతం కవిత్వాన్ని ఆసరా చేసుకొని తన మనోభావాల్ని అందులో పలికించాడు. తన భార్య అయిన 'భాగ్యలక్ష్మి' పేరిట వ్రాసిన కవితలో – 'నాకు బెర్నార్డ్'లు, షేక్స్పియర్‌లు తెలియదు/ తనకు చలం, గురజాడా తెలియదు/ ఇద్దరం ఉత్తపిచ్చివాళ్లం/ కానీ / అడుగంటిన కిరసనాయిల్ స్టౌవ్‌తో/ అన్నం ఎట్లా ఉడికించాలో తనకు తెలుసు/ దగ్గుతెరల నెత్తుటి రెపరెపల ఊపిరితిత్తుల్లో/ కవిత్వమెట్ల రాజేయాలో నాకు తెలుసు' అని రాసుకున్న ధీశాలి ప్రభాకర్.

తెలుగు కవిత్వం కోసం, కవిత్వం ద్వారా సామాన్యుడికి బాసటగా నిలువడం కోసం, వర్గ దృక్పథంపై స్పష్టత కలిగి, దాన్ని ప్రజల్లోకి తన కవితాగానం ద్వారా తీసుకెళ్లడం కోసం తన సర్వస్వాన్ని ఫణంగా పెట్టిన ధైర్యశాలి, త్యాగశీలి, ప్రజాకవి అలిశెట్టి ప్రభాకర్.

**(జనవరి 12వ తేదీ అలిశెట్టి ప్రభాకర్ జయంతి)**

## విశ్లేషణ



**ఇస్మత్ చుగ్తాయ్ (1915 - 1991)**

# ఉర్దూ సాహిత్యంలో ఓ ప్రభంజనం

**- ఉదయమిత్ర**
**99852 03376**

***స్త్రీల జీవితాల్లో సాహిత్యానికి కాలం లేదనుకున్న కాలంలో ఆ సాంప్రదాయాన్ని ఛేదించి, తన రచనల్తో ఆ భ్రమల్ని చెదరగొట్టిందామె. స్త్రీలు సామాజికంగా, సాహిత్యపరంగా శృంఖలాలు తెంచుకోవడానికి ప్రయత్నిస్తున్న కాలంలో వినపడిన ఏకైక గొంతు ఆమెది.***

**ఇ**స్మత్ చుగ్తాయ్ ఉర్దూ సాహిత్యంలోనే ఒక ప్రభంజనం లాగా దూసుకువచ్చి, ప్రపంచ సాహిత్యంపై తనదైన ముద్ర వేసింది. 1930-40లలో భారత దేశంలో స్త్రీలు రచనలు చేయడం అరుదైన విషయం. కాని, స్త్రీల జీవితాల్లో సాహిత్యానికి కాలం లేదనుకున్న కాలంలో ఆ సాంప్రదాయాన్ని ఛేదించి, తన రచనల్తో ఆ భ్రమల్ని చెదరగొట్టిందామె. స్త్రీలు సామాజికంగా, సాహిత్యపరంగా శృంఖలాలు తెంచుకోవడానికి ప్రయత్నిస్తున్న కాలంలో వినపడిన ఏకైక గొంతు ఆమెది. స్త్రీలు కవితలు రాయడం "బౌద్ధిక తిరుగుబోతుతనం" (Intellectual Vagrancy) కింద జమకట్టబడేది. అయినప్పటికీ కొంతమంది బేగల్ యెల్‌ద్రమ్, హజబ్ ఇస్మాయిల్, బేగమ్ నాజర్ సజ్జద్ లాంటి వాళ్ళు రాసారు. అయితే వీళ్ళవన్నీ భావుకత, సంస్కరణలకు సంబంధించిన రచనలే. ఇస్మత్ వచ్చాకనే వుర్దూ సాహిత్యంలో ఓ ప్రభజనం ఏర్పడింది. ఆమె ప్రభావంతో ఆ తర్వాత మరికొంత మంది రచయిత్రులు ఖుత్రులైన్ ఖైదర్, ముంతాజ్ షిరీన్, హజీరా మప్రూర్, రజియా సజ్జద్ జహీర్, సరళాదేవి, సాదిఖా బేగమ్ లాంటి వాళ్ళు వుర్దూ సాహిత్యంలో ప్రసిద్ధులయ్యారు.

ఇస్మత్ అక్క (ప్రేమగ పిల్చుకునే పేరు) తనను తాను తీర్చిదిద్దుకోవడానికి బయటి శక్తుల అవసరం లేకపోయింది. తన ఆశయాల్ని ఆచరణలోకి మార్చడానికి ఆమెకు కావాల్సినంత సంకల్పశక్తి వుండేది. ఇదొక్కటేకాదు - పాత విలువల్ని, పాత సాంప్రదాయాల్ని ధ్వంసం చేయడానికి ఆమెకు వేరే ఏ ఆయుధాలు అవసరం రాలేదు. అత్యంత సహజంగా ఆమె ఎన్నుకున్న మార్గాలే ఆమెలోని స్త్రీ వాదాన్ని బహిర్గతం చేశాయి. ఆమె 'పరదా'ను తీసేసినప్పుడు కూడా పెద్దగా యుద్ధం చేయాల్సిరాలేదు. తన శక్తివంతమైన రచనల ద్వారా మధ్య తరగతి ముస్లిం స్త్రీల 'పరదా'లను చీల్చి చెండాడమేగాక, వాళ్ళ ముచ్చట్లను, అపనిందలను, కోరికలను, ఆకాంక్షలను, ఈర్ష్యా ద్వేషాలను, సంఘర్షణలను, ఆచార సాంప్రదాయాలను, అణిచివేతలను, తిరుగుబాట్లను గొప్పగా చిత్రీకరించినదామె.

మొట్టమొదటగా, ఇస్మత్ చుగ్తాయ్ తన రచనల ద్వారా 'బాగుమతి జుబాన్' (కులీన స్త్రీలకు వాడేమాట) ఉర్దూ కాల్పనిక సాహిత్యంలోనే అడుగుపెట్టింది. ఆమెది అద్భుతమైన శైలి... తన సమాసాలతో, ఉపమానాలతో, శిల్ప చాతుర్యంతో సాహిత్యంలోనే ప్రభంజనలా దూసుకొొచ్చింది. ఆమె సాహిత్యమంతా తన జీవితంలోంచి వచ్చిందే. ఆమెను ప్రసిద్ధ రచయిత్రి జేన్ ఆస్టిన్‌తో పోల్చవచ్చు. ఇద్దరూ

ఉమ్మడి కుటుంబాలలో పుట్టి, పెరిగి తమ కథా వస్తువుల్ని అందులోంచే సేకరించారు.

ఇస్మత్ చుగ్తాయ్... పరదాల మాటున కునారిల్లిపోతున్న తన కుటుంబీకుల జీవితాల్ని నిర్భయంగా ప్రపంచానికి చూపించగల్గింది. ఆమె తనకు తెలిసిన విషయాలపైనే ఎక్కువ దృష్టిపెట్టేది. (ఒక సమిష్టి కుటుంబంలో పెరిగినందువల్ల అత్తగార్లూ, మేనత్తలూ, పిన్నమ్మలు, పెద్దమ్మలు, నౌకర్లు, ఇరుగు పొరుగులు (మొహల్లా వారే)... వీరంతా ఆమె రచనల్లో కనిపిస్తారు... చాలా కథల్లో ఆమె కూడా ఉంటుంది. పాత్రలు ఆమె బంధువులుగా ఉంటారు. అందువల్లనే ఆమె రచనలకు మరింత సహజ పరిమళం అబ్బింది – తాహిరానఖ్వి). ఇస్మత్ రాకముందు ఉర్దూ కల్పనా సాహిత్యంలో ఇదంతా మృగ్యమేనని చెప్పాలి.

ఆమె 1942లో రాసిన మొట్టమొదటి కథ 'లిహాఫ్' (రజాయి)తోనే పెద్ద కల్లోలమే రేగి, కోర్టుదాకా వెళ్ళింది... అసలా కథ చదివి, అదేదో పురుషుడు రాసింది అనుకున్నారట... ఇక ఆ తర్వాత అనేక వాదవివాదాల మధ్యన ఒక లెజెండ్‌గా మారిపోయిందామె.

> ***ఇస్మత్ వ్యక్తిత్వమూ, జీవితమూ, సాహిత్యమూ విడదీయరానివి... ఒకటి తెల్సుకుంటే ఆటోమేటిక్‌గా మిగిలినవి తెల్సివస్తాయి. ఒక ముస్లిం కులీన స్త్రీకి ఇంత నిర్భయంగా, ఇంత శక్తివంతంగా రాసే శక్తి ఎక్కడ్నుంచి వచ్చింది?***

ఆమె కథలన్నీ అనేక భావాల కలపోతగా కనిపిస్తాయి. చాలా విస్తృతంగా రచనలు చేసిందామె... ఆమె కథలు, నవలికలు, నాటికలు, రేడియో నాటికలు, వ్యాసాలతో బాటు, 'కాగజీ హై ఫైరహాన్' (కాగితపు దస్తులు) అనే కథనూ, తేడీల ఖీర్ (వంకరగీత), ఏక్ ఖత్రా ఖూన్ (ఓ రక్తపు చుక్క) అనే నవల్ని కూడా రాసింది. ఆమె తన భర్తతో కలిపి ఐదు సినిమాలకు రచనలు చేసింది. వాళ్ళు కొన్ని సినిమాలు కూడా తీశారు. తన సునిశిత హాస్యంతో, చెండాడే వ్యంగ్యంతో, భాషమీద పట్టుతో, పాఠకుల్ని యిట్టే పట్టేసేది... ఆమె సమకాలికుడైన ప్రసిద్ధ రచయిత కిషన్ చందర్, ఆమె వాక్యాలను 'దూకుడుగా పరుగెత్తే యౌవనాశ్వాల'తో పోల్చాడు... (ఇస్మత్ కథలు వేగంగా పరుగెత్తడమే కాదు... వాక్యాలు, భావచిత్రాలు, రూపకాలంకారాలు, ధ్వనులు, పాత్రలు, సంవేదనలు, అనుభూతులు ఒక తుపానులా ముప్పిరిగొంటాయి –కిషన్ చందర్).

ఇస్మత్ వ్యక్తిత్వమూ, జీవితమూ, సాహిత్యమూ విడదీయరానివి... ఒకటి తెల్సుకుంటే ఆటోమేటిక్‌గా మిగిలినవి తెల్సివస్తాయి. ఒక ముస్లిం కులీన స్త్రీకి ఇంత నిర్భయంగా, ఇంత శక్తివంతంగా రాసే శక్తి ఎక్కడ్నుంచి వచ్చింది? అంటే ఆమె మాటల్లోనే వినాలి – "మేం అందరం నిర్మొహమాటంగా వుంటాం... మా నాన్న, అన్నలు అందరం మేం ఎప్పుడూ వేరుగా కూచోలేదు... మా నాన్న అభ్యుదయ వాది. విశాల హృదయుడు... మా అన్నల్తో సమానంగా చూసేవాడు... నాకెప్పుడూ సిగ్గుపడుతూ ఉండాలనిపించలేదు... ఆ పెంపకం వల్లనే నేనిలా ఉండగల్గుతున్నాను...".

అదీగాక, ఆమె చిన్నప్పట్నుంచీ బాగా ఎమోషనల్ విషయాలపట్ల తీవ్రంగా స్పందించేది, ఘర్షించేది... (కథలు రాసేవాళ్ళకి తీవ్రంగా స్పందించే గుణముండాలని కాళీపట్నం రామారావు గారంటారు)... ఆమె తన ఆత్మకథలోని "క్యారవాన్ దస్ట్" అనే అధ్యాయంలో తనను విపరీతంగా కదిల్చిన రెండు సంఘటనల్ని చెప్పుకొచ్చింది – "హృదయం లేని మనిషొకడు, ఓ నల్ల పిల్లను కట్టె విరిగేదాక కొట్టాడు, అది నా గొంతులో ముళ్ళబంతిలా నిల్చిపోయింది... రెండోది పసివాడైన అలీఅస్గర్ గొంతులో బాణం దించడం... ఈ రెండు దృశ్యాలు నన్ను జీవితకాలం వెంటాడేవి" మొహర్రం సందర్భంగా జరిగిన సంస్మరణ సభలో ఆమె అలా అస్గర్ గొంతులో బాణం గుచ్చుకున్న సందర్భాన్ని ప్రస్తావించినప్పుడు, తట్టుకోలేక గట్టిగా ఏడ్వడం మొదలుబెట్టిందట – సంతాపం తెలిపే స్త్రీలు ఆశ్చర్యపోయారట. "బాణం... బాణం... అంటూ తను నిద్రపోదు... ఎదుటివాళ్ళను నిద్రపోనీదు..." అంటూ వాళ్ళమ్మ కొట్టిందట...

ఇస్మత్‌లోని తిరుగుబాటు ధోరణి, తన జీవితం నుండి వచ్చిందేగాని, ఆమె మరే సిద్ధాంతమూ పెద్దగా చదువుకోలేదు... ఆమె తనచుట్టూ పరిస్థితుల్ని నిశితంగా గమనించేది. స్త్రీలు మాట్లాడుకుంటుంటే వినడం, చిన్నప్పుడు మంచంకింద దాగుండి వినడం, నౌకర్లతో మాట్లాడటం, నిజజీవితంలోని కథల్ని సేకరించడం వంటివి చేసేది (ఆగ్రాలో మా ఇంటి చాకలి నాథూరాం మా మిత్రుడు... అతను

# గజల్

**వే**ల మాటల గోల ఏల పండించి చూపాక వడ్ల గింజ
ప్రజల నుండి ఎదిగిరాని పాలకుండొక పొల్లు గింజ.

వర్గ అంతరం పెంచిపోసి ఉగ్రవాదం పైన పోర?!
మెలుకువలో ఉన్న కపటిని మేలుకొలుపాక పిచ్చి వింత.

లౌకికత్వం తనదుగుణమని లోక మంతట చాటింప?!
మూక ఉన్మాదం మత్తు గుచ్చి మతం మౌఢ్యం కల్లు సంత.

నోటి ముందరి కూడు తీసి నొసట నామం పెట్టినట్టు
జనం భూమి నులిమిలాగి ధనం బలిమికి అప్పగింత

సాద సీదను మెట్లుజేసి రాజ్య పీఠం అక్రమింత
దేశ సత్తువ ఒడిసిపిండి డబ్బు పరుపున పవ్వళింత.

## గజళ్ళు

- సిరా
9866087709




మద్యపానం హానికరమని చట్టబద్ధపు హెచ్చరింప?
గొంతుబట్టి తాగబెట్టి 'సిరా' వృద్ధియంటు కళ్ళగంత!

---

స్వయంగా బట్టలు పట్టుకెళ్ళడానికి వచ్చి గొంతుకు కూర్చొని గంటలకొద్దీ కబుర్లు చెప్పేవాడు. ఏ పుస్తకంలో దొరకని ఎన్నో కథల్ని అతన్నుంచి విన్నాను. వణికే ముసలి కంఠంలో ఆ కథల్ని పాడి వినిపించేవాడు. పాడుతూ తనవెండి వుంగరం వున్న వేలితో తలుపుమీద దరువు వేసేవాడు. అయిదు రూపాయలూ, దారి ఖర్చులకు అదనంగా ఇంకొక రూపాయి యిస్తే మమ్మల్ని తన కథల్తో నాలుగైదు గంటలు అలరించేవాడు – ఇస్మత్)... ఆమెకు తనమీద తనకు ఎంత నమ్మకమంటే, తానెవరితోనైనా ఐదు నిమిషాలు మాట్లాడితే – వారి జీవిత కథను పట్టేస్తానని ధీమాగా చెబుతుందామె. అందుకేనేమో, సుప్రసిద్ధ విమర్శకుడు పుజెయిత్ జాఫ్రీ, ఆమె రచనల్ని పెయింటింగ్‌తోగాక, ఫోటోగ్రఫీతో పోల్చుతాడు. అంత సహజంగా, అంత ప్రస్ఫుటంగా, అంత భావస్ఫోరకంగా వుంటాయన్నమాట...

తన ఆత్మకథ 'కాగితపు దుస్తులు' అనే సమాసాన్ని గాలిబ్‌రానన 'దీవాన్'లోని మొదటి పద్యంనుండి సేకరించినట్లు చెబుతుందామె. ఆమె తాను బతికున్న కాలంలోనే తన వివాదాస్పద కథ "లిహాఫ్" ద్వారా ఓ పెద్ద లెజెండ్‌గా మారిపోయింది. అయితే ఆమె ఈ విషయాన్ని ఒప్పుకోదు...

"కథ చూపించు, చెప్పకు" అని చార్లెస్ డికెన్స్ చెప్పినట్లు, ఇస్మత్ చుగ్తాయ్ కూడా తాను కథ రాస్తున్నప్పుడు ఎదురుగా పాఠకులున్నట్లే ఊహించుకుంటుందట..." ప్రాచీన కాలంలోని మౌఖిక కథకులవలెనే, నేను కూడా నా పాఠకులు ముందున్నట్లు. నేను వాళ్ళలో మాట్లాడుతున్నట్లు వూహించుకుంటాను...".

ఉర్దూ సాహిత్యంలోకి ఖుర్రతులైన్ హైదర్ ఆదునిక రచయిత్రిగా ప్రవేశించినపుడు, ఇస్మత్, "పూమ్ పూమ్ డార్లింగ్" అనే వ్యాసం రాసింది. ఇది ఉన్నత వర్గాల స్త్రీలను తీవ్రంగా విమర్శిస్తూ రాసిన వ్యాసం. ఆ తర్వాత చాలా కాలానికి, ఖుర్రతులైన్ హైదర్, ఇస్మత్ గురించి రాస్తూ ఆమెను "లేడీ చెంఘీజ్‌ఖాన్"గా పోల్చింది... "వుర్దూ సాహిత్యపు యుద్ధ రంగంలో ఇస్మత్ ఒక యోధురాలు... ఓ గొప్ప అశ్వారూఢురాలు... బాణం ఎప్పుడూ గురితప్పని విలుగత్తె..." అందామె.

ఇస్మత్ అక్క, హైదర్ అక్కలుగా ప్రేమగా పిలువబడే ఇస్మత్ చుగ్తాయ్, ఖుర్రతులైన్ హైదర్ మరికొంత మంది సాహితీకారులు పటిష్టమైన స్తంభాలుగా వుర్దూ సాహిత్యం గొప్పగా విరాజిల్లుతోంది....

*(ది హిందూ, ఆగస్టు 23, 2015 ప్రేరణతో)*

కథ

# పెళ్లి కాని పిల్ల

- భవానీ ఫణి
9441555402



"వోవ్, విజిల్స్.... హాట్స్ ఆఫ్ మిస్ స్వాతీ "

"ఇంక చాలు తల్లీ, మునగ చెట్టెక్కించింది. అవతల నాకు చాలా పనుంది."

"స్నాతకం పీటల మీద ప్రమిదలు అడుగుతున్నారు . ఆడపెళ్లి వారిని అడిగి తీసుకురా స్వాతీ "

"ఇప్పుడే చెప్పాను విన్నీ, తెస్తున్నారు"

ఆ రంగురంగుల పువ్వులు సాయంకాలపు ఆకాశాన్ని తీసుకొచ్చి గోడల మీద పరిచి పెట్టినట్టుగా ఉన్నాయి . రెపరెపలు , గలగలలు ,కలగా పులగమై కలిసిపోతున్న కబుర్లు, నవ్వులు, మధ్య మధ్యలో అరుపులు, అన్నీ కలిసి తుఫాను సమయంలో వరద బీభత్సాన్ని గుర్తు చేస్తున్నాయి. ఇంకా బాగా చెప్పాలంటే జడ్జి గారు రావడానికి ముందు కోర్టు వాతావరణంలా ఉంది అక్కడంతా . కానీ ఇక్కడ పడే శిక్ష మాత్రం ఎవరికైనా ఎప్పుడైనా జీవిత ఖైదే . ఆ ఊహకి స్వాతి పెదవుల మీద చిన్నపాటి చిరునవ్వు కదలాడింది .

"హే స్వాతీ, ఏంటి స్మైలింగ్ ? నీ శారీ మీద ఎంబ్రాయిడరీ సూపరుంది . ఎక్కడ చేయించావు? ఈజీగా ఫోర్ ఫైవ్ థౌజండ్ ఛార్జ్ చేసుంటారు "

"అంత లేదు బాబూ, నేనే చేసుకున్నాను "

"స్వాతీ , భోజనాల ఏర్పాట్లు పూర్తయ్యాయో లేదో చూడమ్మా , పెద్దాళ్లు ఎంత సేపు ఉంటారు ?"

"పెట్టేస్తున్నారు బాబాయ్ , తీసుకెళ్లండి అమ్మమ్మగార్నీ వాళ్ళనీ"

"స్వాతీ.......... ఇక్కడ మంచి నీళ్లు లేవు చూడు . విడిదింట్లో కనీసం మంచినీళ్లు కూడా పెట్టకుండా ఇవేం మర్యాదలో!"

"చెప్పాను పెదనాన్నా, పంపిస్తున్నారు. అయినా వెళ్లి భోజనం చేసి రండి. పెట్టేసారు"

"ఏంటే! నన్నిక్కడ కూర్చోబెట్టి వెళ్ళిపోయావ్ ,పెళ్లి పెట్టి సర్దింది నువ్వు , నాకేమీ కనిపించట్లేదు . పంతులు గారు ఉత్తర జంధ్యాలు అడుగుతున్నారు చూడు"

"ఇదిగో ఇక్కడే ఉన్నాయక్కా , ఇవ్వాయనకి"

"అమ్మా , పెళ్లికొడుకు మేనమామల్ని పెట్టుబడి బట్టలు సిద్ధం చేసుకోమనండి , పిలవగానే రావాలి ,అసలే

ఆలస్యమైపోయింది"

"రెడీగానే ఉన్నారు గురువుగారూ , మీరు చెప్పడమే లేటు"

"ముప్ఫై ఏళ్లు పైనుండవూ ఆ అమ్మాయికి, ఇంకా పెళ్లి సంబంధం ఏమీ కుదిరినట్టు లేదు"

ఈసారి తన గురించే , కానీ తనతో కాదు కాబట్టి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. మనసులోని భావాల నీడని మొహం మీద పడనివ్వకుండా పెదాలు బిగపట్టింది స్వాతి.

"రంగు తక్కువ కదొదినా, పెద్దగా చదువుకోలేదు , పై పెచ్చు ప్రసాదమూర్తి గారు పాపం కట్నాలు కూడా ఎక్కువ ఇచ్చుకోలేరు. ఏమిటో , ఈ రోజుల్లో అందరూ పెళ్లికూతుళ్ల కోసం వెతుక్కుంటుంటే ఇక్కడ ఈ పిల్లకి కుదరడం లేదు . " ప్రశ్న ఎవరికో వాళ్ళనుండి సమాధానం వచ్చింది.



■ ■ ■

"చిన్నత్తయ్యగారూ, మొత్తానికి అంతా సవ్యంగా జరిగిపోయింది . ఈ రోజుల్లో మగ పిల్లాడి పెళ్లి చెయ్యడం కూడా పెద్ద గండమే అనిపిస్తోంది . అయినా ఆడపెళ్లివారు దర్జాగా బాగానే ఉన్నారు, చీర అంచైనా నలక్కుండా. మనకే హైరానా అంతా" అంది భారతి.

"అవునే , దేవుడి దయ వల్ల గొప్పగా జరిగింది" స్వాతి తల్లి సమాధానం .

"చూసారా , ఆడపెళ్లివారి ముస్తాబులు! మన వాళ్లంతా ఒకటే నవ్వులు , గుసగుసలు. నా కోడలు కూడా అలాగే తయారవుతుందేమో , మనకేమో అలాంటివి అలవాటు లేదు . నలుగురిలో సిగ్గు చేటు. "

"మనింటికి వచ్చేపిల్ల కదా, మెల్లగా మన పద్ధతులు తెలుసుకుని వ్యవహరిస్తుందిలే . అంత కంగారు పడకు"

"అలా జరిగితే మంచిదే . మా మావగారు లేకపోయినా చిన్న మావయ్య గారు పెద్ద దిక్కుగా నిలబడి దగ్గరుండి అన్నీ చూసుకోబట్టి , ఏ ఇబ్బందీ లేకుండా ఒడ్డున పడ్డాం . మీరూ, స్వాతీ కూడా ముందే వచ్చి సాయం చెయ్యకపోతే చాలా కష్టమయ్యేది"

దాందేముందిలేమ్మా , ఏమన్నా దుంగలెత్తామా, దూలాలెత్తామా! అయినా దానికెప్పుడో పెళ్లి యోగం" నిట్టూర్చిందావిడ .

"మొన్న ఏదో సంబంధం వచ్చినట్టుందిగా . ఏమైంది?"

ఏమవుతుంది . ఇన్ని రోజులూ పిల్లో, జాతకమో , కట్నాలో నచ్చలేదన్న వాళ్ళే అందరూ. ఇప్పుడు వీళ్లు చేసుకుంటామంటే అది ఒప్పుకోవడం లేదు."

"అదేమిటండీ!"

"ఏమోనమ్మా, అది చెబితేగా తెలిసేది "

"వాళ్ళ అన్నయ్యతో చెప్పిద్దాం లెండి . ఆయన చెప్తే తను తప్పకుండా వింటుంది."

"ఏం వినడమో , దాని పెంకితనం నీకేం తెల్సు. అలా ఎండలో పడి బట్టలు ఉతక్కే అంటే వినదు . నలుపు నలుపంటున్నారన్న కోపమో ఏమో ఎండనకా వాననకా ఇష్టమొచ్చినట్టు కష్టపడి ఇంకా నల్లబడిపోయింది . మనసులో ఏముందో చెప్పదు. అలా అలుపూ సొలుపూ అనకుండా పని చేసుకుంటూ పోవడమే."

తెల్లని కవర్లోంచి తీసిన రెండు పచ్చ కాగితాల్ని అప్పటివరకు పేర్చిన మిగతా నోట్ల మీద పెట్టబోతున్న స్వాతి, పక్క గదిలోంచి వినిపిస్తున్న మాటలకి ఒక్క క్షణం ఆగింది . ఎక్కడ చూసినా తన గురించి చర్చే . చివరికి అమ్మ కూడా తన గురించి ఇలా .... పాపం ఆవిడ మాత్రం ఏం చేస్తుంది . పెళ్లి కాని ఆడపిల్ల గుండెల మీద కుంపటి అన్నారుగా .

మెల్లగా ముఖం మీద చెమట తుడుచుకుంది . గిన్నెలు తోమీ తోమీ కరుదు కట్టిన చేతులు గరుగ్గా తగిలాయి . అవి కూడా తన మనసులాగే ఎప్పుడో మోటబారిపోయాయి . అమ్మ ఏమంది! మనసులో ఏముందో చెప్పదా? ఏమని చెబుతుంది . అగ్ని పర్వతంలాంటి తన మనసు బ్రద్దలైతే, ఏళ్ల తరబడి పేరుకుపోయిన ఆవేశం తాలుకూ సెగనైనా తట్టుకోగలరా వీళ్లు ? ఎక్కడికెళ్లినా అందరికీ తన పెళ్లి గొడవే. పెళ్లెప్పుడు చేస్తున్నారు ? ఇంకా కుదరలేదా అంటూ సవాలక్ష ప్రశ్నలు . అయినా పెళ్లి కాకపోతే చచ్చిపోతామా ? ఇటు పెళ్లికొడుకులకీ , వాళ్ల తల్లి తండ్రులకీ లెక్కలేనన్ని గొంతెమ్మ కోరికలు . అయినా మొన్న వచ్చిన సంబంధం

చేసుకోమని ఎలా చెబుతున్నారు ? పెళ్లి చేసి అమ్మాయిని ఇంట్లోంచి పంపేస్తే చాలు . దానికి తినడానికి ఉన్నా లేకపోయినా పర్వాలేదు . కూతురి మీద ప్రేమ కంటే కుటుంబ గౌరవమే ఎక్కువగా మరి .

తను చేసుకోదు . చేసుకోకుండా సుఖంగా బ్రతికి చూపిస్తుంది . స్వాతి విసురుగా మరో కవర్ తెరిచింది.

ఎలా బ్రతుకుంది సుఖంగా ! చిన్నప్పటి నుండీ తనని చదువు కంటే ఇంట్లో పనులే ఎక్కువగా ఆకర్షించాయి. అయినా వీళ్లు చదివించే ఇంతోటి డిగ్రీకీ ఉద్యోగం మాత్రం వచ్చి ఉండేదా? పోనీ వంటలో, కుట్లో అల్లికలో సంపాదనా మార్గంగా చేసుకుందామంటే , తమ కుటుంబానికి ఉన్న గౌరవ మర్యాదలు ఒప్పుకోవు.



"ఏమ్మా, అందరూ తేలికపడ్డారు, నువ్వు మాత్రం విశ్రాంతి తీసుకోవా ?" ఎప్పుడొచ్చాడో రవీంద్ర ఎదురుగా నిలబడి ఉన్నాడు .

"లేదన్నయ్యా, చదివింపులకి వచ్చిన డబ్బు లెక్క చూస్తున్నాను."

"చూసుకోవచ్చులేమ్మా , కాస్త రెస్ట్ తీసుకో . పెళ్లి పనుల్లో మాకంటే నువ్వే ఎక్కువ అలిసిపోయావు "అని నవ్వాడు.

"అన్నట్టు ఈయన మీ భారతొదిన మేనమామగారికి బావమరిది. నీకు తెలీదులే. ఎప్పుడో మా పెళ్లికొచ్చారు. మళ్ళీ ఇప్పుడే రావడం. చాలా దూరం నుండి వచ్చారు. రెండు రోజులు ఇక్కడ ఉండి వెళ్తారు".

స్వాతి అప్పుడు గమనించింది ఒక ముసలాయన గుమ్మం దగ్గర నిలబడి ఉండటం.

"మా బాబాయ్ గారి అమ్మాయి" అంటూ తనని పరిచయం చేసాడు. నిజానికి స్వాతి తాతగారు, రవీంద్ర తాతగారు అన్నదమ్ములు. చుట్టరికం కొంచెం దూరమే అయినా వాళ్ల కుటుంబానికీ, తమ కుటుంబానికీ బాగా కలిసిపోవడం వల్ల, రాకపోకలు ఎక్కువ కావడం వల్ల, తనకంటే చాలా పెద్దవాడైనా రవీంద్ర ఆమెకి సొంత అన్నలాగే అనిపిస్తాడు.

ఆ ముసలాయన తన వైపే పట్టి పట్టి చూస్తుండటం ఇబ్బందిగా అనిపించింది స్వాతికి . ఎక్కడో చూసినట్టుంది ఆయన్ని. ఎందుకలా చూస్తున్నారు? తను ఆయనకి ముందే తెలుసా ?

నమస్కారం చేసి కవర్లు, పుస్తకం తీసుకుని బయటకి వచ్చేసింది . ఆయన్ని ఎక్కడ చూసిందో ఎంత ఆలోచించినా గుర్తురావడం లేదు.

■ ■ ■

మరుసటి రోజుకి ఇల్లంతా ప్రశాంతంగా ఉంది. ఎక్కడి చుట్టాలు అక్కడికి వెళ్ళిపోయినట్టున్నారు. స్వాతీ వాళ్ల ప్రయాణం కూడా ఈరోజే. వచ్చి అప్పుడే పది రోజులైపోతోంది . ఇల్లంతా బూజులు పట్టిపోయి ఉంటుంది. నాల్రోజులు శుభ్రం చేసే పని సరిపోతుంది అనుకుంది లేచీ లేవగానే. ఆమె స్నానం చేసి వచ్చేసరికి తల్లి, భారతొదిన కాఫీలు పెడుతున్నారు.

"లేచావా ? అలసట తీరిందా ?" అంది భారతి కాఫీ గ్లాసు అందిస్తూ. స్వాతి నవ్వి ఊరుకుంది. మనసులో ఇంకా ముందరి రోజు తల్లికీ వదినకీ మధ్య జరిగిన సంభాషణే మెదులుతోంది.

"చూడు స్వాతీ, అజయ్ ఏమో వాళ్లతో పాటు హైదరాబాద్ రమ్మంటున్నాడు. కొత్త కాపురం కదా. అంతా రెడీ చేసుకున్నాక, టిక్కెట్లవీ బుక్ చేసుకున్నాక ఈ సమస్య వచ్చి పడింది."

"ఏమైంది వదినా ?"

"మా చుట్టాలాయన ఒక ముసలాయన వచ్చారు కదా. ఆయనకి కాలు బెణికింది. రాత్రి బాత్రూంలో కొద్దిగా జారారట. పెద్ద దెబ్బ కాదు గానీ నడవలేకపోతున్నారు. ఈ టైంలో ప్రయాణం చెయ్యలేరేమో, ఆయన ఉండి పోతే మేమెలా వెళ్లగలం! పోనీ ఇలా ఊరు వెళ్తున్నామని చెబ్దామంటే బాగోదేమో అని చూస్తున్నాను."

స్వాతి ఏమీ మాట్లాడలేదు. ఆయన తన వైపు పరీక్షగా చూడటం గుర్తొచ్చింది. ఇంతకుముందు ఎక్కడ చూసానా అనే ఆలోచన మొదలైంది మళ్ళీ.

"అజయ్ పెళ్లి కోసం ఇంత కష్టపడ్డావు. ఇంకో చిన్న సాయం చేసి పెడతావా ?ఇంట్లో ఎవరూ ఉండటం లేదు. ఆ ముసలాయనకి సాయంగా నాలుగు రోజులు ఉంటావా? తగ్గిపోతే ఆయనే వెళ్లిపోతారు. లేదంటే ఆదివారం మళ్ళీ

"మేం వచ్చేస్తాం." అంది భారతి. స్వాతి సందేహంగా తల్లి వైపు చూసింది.

"మేం ఈ రోజు బయల్దేరిపోతాం. ఊళ్ళో నాన్నగారికి పనులున్నాయి. నువ్వు ఆలోచించు మరి" అందావిడ. ఆవిడ అంత తొందరగా స్వాతికి సలహాలు చెప్పదు. చెప్పిందిగా తనెంత పెంకిదో!

స్వాతికి ఉండాలని లేదు . ఆ ముసలాయన వెనక ఉన్న రహస్యం ఏమిటో అర్థం కావట్లేదు . ఏదో ఉంది మొత్తానికి . ఆయన చూపుల్ని బట్టి అలానే అనిపిస్తోంది . కానీ తప్పేలా లేదు .

"సరే , వదినా " అంది నవ్వడానికి ప్రయత్నిస్తూ .



సాయంత్రమయ్యేసరికి ఇల్లంతా ఒక్కసారిగా ఖాళీ అయిపోయింది . ఇంట్లో స్వాతీ , ఆ ముసలాయనే మిగిలారు . ఆమెకి ఇంటి మీద దృష్టి మళ్ళి పోయింది . ఏమిటో బెంగగా ఉంది . తల్లి ఎంతవరకు చేసుకోగలదో! ఆవిడ చాకలి పద్దు చూసి కూడా చాలా కాలం అయిపోయి ఉంటుంది . చాలా ఏళ్లనుండి ఇంటి బాధ్యత అంతా తన చేతుల్లోనే ఉంది. తల్లిని వంట పని తప్ప మరేమీ చెయ్యనివ్వదు . అప్పటివరకు ఆవిడ పడిన కష్టం చాలు . అక్కల పెళ్లిళ్లకి ముందు కూడా ఇంటి పనంతా తనే చూసుకునేది. వాళ్ల పెళ్లిళ్లకి బట్టలు కొనడం దగ్గర్నించీ సారె తయారు చేయించడం వరకూ అన్నీ తనే చక్కబెట్టింది. చిన్న పిల్లైనా ఎంత వ్యవహారదక్షతో అని చూసినవాళ్లంతా ఆశ్చర్యపోవడమే. ఏం లాభం! అప్పుడు మెచ్చుకున్నవాళ్లే ఇప్పుడు వెనకాల చెవులు కొరుక్కుంటున్నారు . ఎదురుగా జాలి వొలకబోస్తున్నారు. పెళ్లి కాకపోవడం అంత పెద్ద నేరమా ! ఎక్కడికెళ్లినా ఎన్ని జతల కళ్లు తనని శల్య పరీక్ష చేస్తూ ఉంటాయో! అప్పుడు హఠాత్తుగా గుర్తొచ్చింది స్వాతికి. ఆ ముసలాయన అజయ్ పెళ్లిలో కూడా తనని అలా పట్టి పట్టి చూస్తూనే ఉన్నారు. రెండు మూడు సార్లు గమనించినా పెద్దాయన కదా, కళ్లు సరిగా కనబడక తెలిసినవాళ్ల కోసం చూస్తున్నారేమో అనుకుని పెద్దగా పట్టించుకోలేదు.

ఇప్పుడు ఇక ఇంట్లో తనూ, ఆయనా తప్ప ఎవరూ లేరు. ఎదురుపడక తప్పదు అనుకుంటూ కాఫీ తీసుకుని ఆయనున్న గదిలోకి వెళ్ళింది. పడుకుని ఉన్నాయన. అలికిడికి కళ్లు తెరిచి తన వైపు చూసారు.

"ఎలా ఉందండీ మీకు కాలు నెప్పి" అంది మెల్లగా. బాగానే ఉందన్నట్టుగా తలూపారు. ఏదో చెప్పాలని ఉన్నా, చెప్పలేకపోతున్నట్టుగా ఉంది ఆయన ముఖం.

"రాత్రి భోజనానికి ఏం చెయ్యమంటారు?"

"నీతో మాట్లాడాలి . పదినిమిషాలు అలా కూర్చుంటావా అమ్మా ?" అన్నారు. ఆ మాటలు ఎక్కడో నూతిలోంచి వచ్చినట్టుగా ఉన్నాయి.

స్వాతికి ఒక్కసారిగా ఆయన మీద జాలి కలిగింది . పెద్ద వయసు , పైగా ఒక్కాయన ఇంత దూరం ఎందుకొచ్చారో! ఇక్కడ ఇలా ఇబ్బంది పడుతున్నారు .

"చెప్పండి " అంది ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంటూ .

"ఇలా అడుగుతున్నానని తప్పుగా అనుకోవద్దు . నేను చెప్పేది నీకు నచ్చకపోతే ఏదో ముసలాడు, చాదస్తం అనుకుని వదిలెయ్యి " స్వాతి ఏమీ మాట్లాడలేదు . ఏం చెప్తాడీయన!!

"నా భార్య చాలా ఏళ్ళ క్రితం కాలం చేసిందమ్మా, అప్పటినించీ నేనే పిల్లల్ని జాగ్రత్తగా పెంచి పెద్ద చేసాను. ఇద్దరు ఆడపిల్లల పెళ్లిళ్లు కూడా చేశాను. ఒక్కడే కొడుకు. గొప్ప చెప్పుకోవడం కాదు గానీ వాడు ఆణిముత్యం. ప్రింటింగ్ ప్రెస్ పెట్టాడు విశాఖపట్నంలో. బాగానే నడుస్తోంది. కొత్తగా ఈ మధ్యనే అవేవో కార్టన్‌లో ఏవో అంటారుగా , అట్టపెట్టెలు చేస్తారు, ఆ ఫాక్టరీ కూడా పెట్టాడు. అమ్మాయిలు పెళ్లిళ్లయి వెళ్ళిపోయిన దగ్గర్నించి, పని వాళ్లు చేస్తే నాకు ఇష్టం ఉండదని ఇంట్లోపని, వంటపని అంతా వాడే చేస్తాడు" అని ఆగాడాయన.

స్వాతి తల దించుకుని వింటోంది. కొంపతీసి వాళ్లబ్బాయిని పెళ్లి చేసుకోమంటారా! అయినా తన పిచ్చి గానీ అంత మంచి స్థితిలో ఉన్న కొడుక్కి, రంగు తక్కువైన, చదువు లేని తనలాంటి అమ్మాయిని ఎందుకు అడుగుతారు! నాజూగ్గా ఉండి, ముఖం కళగానే ఉంటుందని కొందరన్నా అది పెద్ద లెక్కలోకి రాదు.

"నాలుగేళ్ళ క్రితం కుక్కరు పేలి వాడి ముఖం చేతులు కాలిపోయాయి. అప్పటివరకు పిల్లనిస్తామని పోటీ పడిన

వాళ్లంతా మొహం చాటేసారు. ఎవరైనా వచ్చినా, వాడి ముఖం మీద కాలిన మచ్చలు చూసి సంబంధం చెప్పకుండానే వెళ్లిపోతున్నారు. లేకపోతే ఈ పాటికి మనవడ్ని ఎత్తుకుని ఆడిస్తూ ఉండేవాడిని" వణుకుతున్న ఆయన చేతి మీద రాలి పడిన ఒక కన్నీటి చుక్క స్వాతి దృష్టిని దాటిపోలేదు.

"ఒకళ్లో ఇద్దరో చేసుకుంటామన్నా మా ఆస్తి చూసే తప్ప వాడిని సరిగ్గా చూసుకుంటారన్న నమ్మకం నాకు లేదు. ఈ పెళ్లిలో నిన్ను చూసిన దగ్గర నుండీ నువ్వే నా కోడలివైతే బాగుండునని అనిపించింది . మీ పెద్దవాళ్లనే అడగచ్చు . కానీ వాళ్లు నీ అభిప్రాయం కనుక్కుంటారో లేదో అని సందేహం." ఆయన గొంతులో వినిపించిన తడబాటుకి తలెత్తి చూసింది.

ఏదో తప్పు చేసి దొరికిపోయిన వాడిలా ముఖం పెట్టారాయన. "నీ దగ్గర అబద్ధం ఎందుకులేమ్మా, మా వాడి గురించి తెలిసాక, కనీసం అమ్మాయి అభిప్రాయం అడగనైనా అడక్కుండానే పెద్దవాళ్లే వద్దని చెప్పేస్తున్నారు. నువ్వు చూస్తే తెలివైన పిల్లలా ఉన్నావు. మంచీ చెడూ బాగా అలోచించి నిర్ణయం తీసుకోగలవని అనిపించింది. అందుకే నేరుగా నిన్నే అడిగేద్దామని నిర్ణయించుకున్నాను. అసలు ఈ వయసులో కూడా ఓపిక లేకపోయినా నేను పెళ్లిళ్లకి అందుకే వస్తానమ్మా, ఎక్కడో అక్కడ, మంచి పిల్ల కనిపించకపోతుందా అని. నిన్ను చూసాకా ఇక ఎలాగైనా నీతో మాట్లాడాకే వెళ్లాలని గట్టిగా అనుకున్నాను. అందుకే కాలు నెప్పి సాకు చెప్పి ఉండిపోయాను. ఇక్కడ కుదరకపోతే ఏదో వంకతో మీ ఇంటికి వచ్చైనా నీతో మాట్లాడి ఉండేవాడిని " కొడుకు పెళ్లి కోసం ఆయన పడుతున్న ఆరాటానికి స్వాతి కళ్లలో నీళ్లు తిరిగినంత పనైంది .

"తొందరేమీ లేదమ్మా , మెల్లగా ఆలోచించు . మా వాడిని కూడా చూడు . నీకిష్టమై మనస్ఫూర్తిగా చేసుకోవాలని అనిపిస్తేనే ముందుకెళ్దాం . ముఖం మీద మచ్చలున్నాయని తప్ప వాడి మనసు మాత్రం చందమామ కన్నా తెల్లనమ్మా . ఆ విషయంలో నేను నీకు హామీ ఇస్తున్నాను . నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాడు . ఆడ దిక్కు లేని సంసారం . నీ లాంటి అమ్మాయి మా ఇంట్లో దీపం పెడితే బాగుంటుందని అడుగుతున్నాను" కాఫీ గ్లాసు చేతిలోకి తీసుకుంటూ అన్నారాయన .

స్వాతికి ఏం సమాధానం చెప్పాలో అర్థం కాలేదు . పెద్దాయన అంతగా ప్రాధేయపడుతుంటే ఏదో ఇబ్బందిగా ఉంది . మెల్లగా గొంతు పెగుల్చుకుని చెప్పింది .

"సరేనండీ , ఆలోచించుకుని చెప్తాను ."

"కాఫీ బాగుందమ్మా, ఫిల్టరు కాఫీనా? ఇటువంటి కాఫీ తాగి ఎన్ని రోజులైందో! రోజు మా వాడిచ్చే పాల కషాయం తాగీ తాగీ దీని అసలు రుచే మర్చిపోయినట్టున్నాను. " ఆయన ముఖంలో కనిపించిన సంబరానికీ , ఆ మాటలు అన్న పద్ధతికీ నవ్వకుండా ఉండలేకపోయింది స్వాతి.

■ ■ ■

తను చెప్పిన విషయం విని భారతొదిన నిర్ఘాంతపోయింది .

" స్వాతీ, బాగా అలోచించుకున్నావా? నేను చూడలేదు గానీ అతని ముఖం కాలిపోయి ఉంటుందని విన్నాను. కనీసం అబ్బాయిని చూడనైనా చూడకుండా ......."

"నాకంతా తెలుసొదినా, ఆయన చెప్పారు. నువ్వు అన్నయ్యతోనూ, నాన్నగారితోనూ మాట్లాడి ముహూర్తాలు పెట్టించమను. నాకిష్టమే"

అవును. తనకిష్టమే. ఈ నాలుగు రోజులూ ఆయనతో పెరిగిన సాన్నిహిత్యం వల్ల మాటల మధ్యలో వాళ్ళ కుటుంబం గురించీ, అబ్బాయి గురించీ బాగానే తెలుసుకుంది. కష్టం సుఖం తెలిసిన మనుషులు వాళ్లంతా. ఆడపిల్లని గౌరవించగలరనే అనిపిస్తోంది. ఆ ఇంట్లో తను సుఖపడుతుందని నమ్మకం ఏర్పడింది. పెళ్ళి చేసుకోబోయే ఏ అమ్మాయికైనా అంత కంటే ఏం కావాలి . అక్కడ తను స్వేచ్ఛగా, భద్రంగా ఉండగలనన్న నమ్మకం తప్ప. భద్రంగా అంటే? ఆర్ధికంగానా? అంతరాత్మ వెక్కిరించింది. కొన్ని విషయాలు ఆలోచించకుండా, తర్కించుకోకుండా ఉంటేనే మంచిది. తను నిర్ణయం తీసేసుకుంది. ఇక హరిహర బ్రహ్మాదులు దిగి వచ్చినా దాన్ని మార్చలేరు. తన ఇంట్లో వాళ్లు మార్చే ప్రయత్నం కూడా చెయ్యరు. తన పెంకితనం గురించి వాళ్ళకి తెలుసుగా. కానీ ఈ విషయం ఆ ముసలాయనకి అదే తనకి కాబోయే మామగారికి ఎలా తెలిసిందో మరి!!

❐

## కవిత

# కవి కన్నెర్ర చేస్తే

- శివకోటి నాగరాజు
8374100234



కంటికి కనిపించని గాలి
నిన్ను తాకి ఎంతదూరమైనా
ప్రయాణిస్తుంది.
ఆకాశంలో ఎగిరే పక్షులు,
జోడికట్టి, స్వేచ్ఛగా ఎంతదూరమైన
ప్రయాణిస్తాయ్.
రెక్కలు తెగిన కాకి నేలకు ఒరిగినా
కాకులు గుంపులు, గుంపులు
చేరుతాయి.
మాటలు రాని, మూగజీవులు
క్రమశిక్షణ పాటిస్తాయి.
నీవు మనిషిగా పుట్టిన ఈ లోకములో
నీ చుట్టూ ఒక వ్యవస్థ వుంది.
నీకు తెలియకుండా ఏర్పడుతుంది.
నీవు సంఘములో నాయకుడిగా
చలామణి అయి.
పదవి అనే అహంకారముతో
నీతి నిజాయితిని మరచావు
వివేకము నేర్పని
చదువుకు విలువ లేదు.

అభివృద్ధి పేరుతో
భవిష్యత్తును కొల్లగొట్టడాన్ని
ప్రతిఘటించే రోజులువస్తాయి.
నా మనసుకు కలిగిన ఆవేదనలో
నా కన్నీటి బిందువు సిరా అయితే
నా భావాలను అక్షరాలుగా వ్రాసిన
నా పదాలు జగన్నాధ రథ చక్రాలుగా
కథలుగా.
గాలి తరంగాల మధ్య పయనిస్తాయ్
నిద్రపోతున్న సమాజమా
కళ్ళు తెరచి చూడు.

ఎక్కడ చూసినా కవి రాసిన పదాలు
కనిపిస్తాయి
కవి అన్నవాడు మౌనం వహిస్తే
ఈ సమాజము బ్రతికి ఉన్న
జీవత్సవంగా మిగులుతుంది.
నా గళము వెనుక ఉన్నది ప్రజాశక్తి
రేపదే వెలుగుకు పునాది.

# హైకూలు

- మల్లారెడ్డి మురళీమోహన్
8861184899

చినుకులు
కొలను ఉపరితలంపై
నీటి వృత్తాలు గీస్తున్నాయి



స్వప్నం
నా నిద్రలో
మేలుకొంది.

శిఖరాలు
తొడిగాయి
ముబ్బుటుంగరాలని.

వర్షం
ప్రకృతి కాన్వాస్‌పై
నీటి స్ట్రోక్స్

అలల భుజాలపైకెక్కి
ఊరేగుతోంది
ఏటిలోని పడవ


పంచదార పోగు
చీమల వంతెన
విరిగిపోయింది.

గాలిపటాలు
ఎగరేస్తున్నాయి
పసి హృదయాల్ని.

పక్షుల గుంపు
ఆకాశంలో
వల కదులుతోంది.

నీడ నడుస్తోంది
శరీరమే
పునాదిగా.

కరెంటు తీగపై
పిచ్చుకలు
దారానికి గుచ్చిన ముత్యాల్లా.




# మాలపల్లి అభ్యుదయ మహాకావ్యమేనా? ఉన్నవ మొదటి అభ్యుదయ కవి అవుతాడా?

- అంపశయ్య నవీన్
9492879210

***"మాలపల్లి అభ్యుదయ మహాకావ్యం" అన్న వ్యాసంలో 'మాలపల్లి' నవలలో ఉన్న రెండు గీతాలను ఆధారం చేసుకొని మాలపల్లిని రచించిన ఉన్నవ లక్ష్మీనారాయణే తెలుగులో మొదటి అభ్యుదయ కవి అనీ, అందరూ అనుకుంటున్నట్టుగా శ్రీశ్రీ కాదనీ ఒక బలమైన వాదాన్ని వినిపించటానికి ప్రయత్నించాడు.***

కవిగా ప్రసిద్ధుడయిన అనుమాండ్ల భూమయ్య విమర్శకుడిగా కూడా కృషి చేశాడు. ఆ కృషికి ఫలితమే "మాలపల్లి అభ్యుదయ మహాకావ్యం" అన్న రచన. "ప్రజల మనిషి" నవలలో కథానాయకుడు కంఠీరవం కాదు అని వాదిస్తూ వెలవరించిన రచన, మొదలైనవి ఉన్నాయి.

ప్రతి విమర్శకుడిలోనూ ఇదివరకెవరూ చెప్పని ఒక కొత్త విషయం చెప్పాలన్న అభినివేశం ఉంటుంది. భూమయ్యలో కూడా ఇది కాస్త బలంగానే ఉన్నట్టనిపిస్తుంది.

"మాలపల్లి అభ్యుదయ మహాకావ్యం" అన్న వ్యాసంలో 'మాలపల్లి' నవలలో ఉన్న రెండు గీతాలను ఆధారం చేసుకొని మాలపల్లిని రచించిన ఉన్నవ లక్ష్మీనారాయణే తెలుగులో మొదటి అభ్యుదయ కవి అనీ, అందరూ అనుకుంటున్నట్టుగా శ్రీశ్రీ కాదనీ ఒక బలమైన వాదాన్ని వినిపించటానికి ప్రయత్నించాడు.

ఉన్నవను మొదటి అభ్యుదయ కవి అనీ, మాలపల్లిని అభ్యుదయ మహాకావ్యం అనీ నిరూపించటానికి ఆయనకు లభించిన ఆధారాలు ఆ రెండు గీతాలు: ఒకటి: మాలపల్లి 200వ పేజీలో ఉన్న 'చరమగీతం' అనే గీతమైతే రెండవది మాలపల్లి 369, 70, 71వ పేజీల్లో ఉన్న 'సమతాధర్మం' అనే గీతం. (గీతం అనడం కంటే దీన్ని 'బుర్రకథ' అని చెప్పడం సమంజసం)

668 పేజీల పర్యంతం సాగిన 'మాలపల్లి' నవల తెలుగు నవలా సాహిత్యంలో వెలువడిన చాలా గొప్ప నవలల్లో ఒకటని విమర్శకులు నిర్ణయించారు. ఈ నవలలో ఎన్నో పాత్రలున్నాయి. ఈ రెండు గీతాలే కాదు... ఇంకెన్నో గీతాలున్నాయి. నవలలోని ఆయా సందర్భాలను బట్టి ఈ గీతాలను ఉన్నవ ఈ నవలలో ప్రవేశపెట్టాడు. నవలలో చాలాచోట్ల ఎన్నో పాటలు, భజనలు తత్వాలు ఉన్నప్పటికీ భూమయ్య దృష్టి ఈ రెండు గీతాల మీదికే వెళ్లింది. ఎందుకుంటే ఆయన వాదనకు ఇవి అనుకూలంగా ఉన్నాయి కాబట్టి.

భూమయ్యగారు గమనించాల్సిన ఒక ముఖ్య విషయమేమిటంటే 'మాలపల్లి' కావ్యం కాదు నవల. నవల అనేది వచన ప్రక్రియ. కావ్యం కవితా ప్రక్రియ. అయితే నవల పరిధి ఎంత విశాలమైనదంటే నవలలో ఎక్కడో ఒకచోట కవిత్వం ఉండొచ్చు. నాటకం ఉండొచ్చు. వ్యాసం కూడా ఉండొచ్చు. పాటలూ ఉండొచ్చు. ఇలా అన్ని సాహిత్య ప్రక్రియల్ని తనలో ఇమిడ్చుకోగల శక్తి నవలా ప్రక్రియకుంటుంది. అయినప్పటికీ నవల ప్రధానంగా వచన ప్రక్రియే అనడంలో సందేహం లేదు. కేవలం రెండు గీతాలను ఆధారంగా చేసుకొని, మాలపల్లిని మహాకావ్యం అనకూడదు. 'మహానవల' అనండి.

నవలలో అనేక పాత్రలుంటాయి. ఆ పాత్రలు వెలిబుచ్చే భావాలను, అభిప్రాయాలను రచయిత భావాలే, రచయిత

అభిప్రాయాలే అనుకోకూడదు. మొత్తమ్మీద నవల యేం చెప్పిందో, నవలలో కనిపించిన నవలాకారుడి దృక్పథం యేమిటో అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాలి తప్ప కొన్ని పాత్రలు వెలిబుచ్చిన అభిప్రాయాల ఆధారంగానే రచయిత దృష్టి ఇదీ అని నిర్ణయించకూడదు.

భూమయ్యగారు ఉన్నవను మొదటి అభ్యుదయ కవి అని నిరూపించటానికి ఆధారమైన ఆ రెండు గీతాలు నవలలో యే సందర్భంలో చోటు చేసుకున్నాయో చూద్దాం. మాలపల్లిలో ఉన్నవ చాలా పాత్రల్ని సృష్టించాడు. వాటిల్లో ముఖ్యమైనవి...

రామదాసు – మాల కులానికి చెందినవాడు.

అతనికి ముగ్గురు కూమారులు. వెంకటదాసు, సంగదాసు, రంగదాసు, ఒక కూతురు జ్యోతి. భార్య మాలక్ష్మి. ఈ కుటుంబానికి వ్యవసాయమే జీవనాధారం.

***మొత్తమ్మీద నవల యేం చెప్పిందో, నవలలో కనిపించిన నవలాకారుడి దృక్పథం యేమిటో అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాలి తప్ప కొన్ని పాత్రలు వెలిబుచ్చిన అభిప్రాయాల ఆధారంగానే రచయిత దృష్టి ఇదీ అని నిర్ణయించ కూడదు.***

సంగదాసు చౌదరయ్య అనే భూస్వామి దగ్గర జీతగాడుగా పనిచేస్తుంటాడు. బడా భూస్వాముల్లో ఉండే లక్షణాలన్నీ చౌదరయ్యలో ఉంటాయి.

సంగదాసేమో మాలల సాంఘిక, ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచాలని కలలుగంటున్నాడు. చౌదరయ్య తన దగ్గర పనిచేసే వాళ్లపట్ల చాలా కఠినంగా వ్యవహరిస్తుంటాడు. చౌదరయ్య కొడుకు రామానాయుడు మంచివాడు. సంగదాసు అభిప్రాయాలతో – ముఖ్యంగా మాలల పరిస్థితిని మెరుగుపరచాలన్న భావంతో రామానాయుడు ఏకీభవిస్తాడు. సంగదాసుతో కలిసి బెజవాడలో జరిగిన పంచమోద్యమ సభకు రామానాయుడు వెళ్ళాడు. తన కొడుకును సంగదాసు చెడగొడ్తున్నాడన్న ఆగ్రహంతో చౌదరయ్య సంగదాసును తీవ్రంగా కొట్టి చంపేస్తాడు.

సంగదాసు మరణానికి చింతిస్తూ అతని పేరుమీద మాలలు స్థాపించుకున్న 'సంగపీఠం' వారు ఒక సంతాపసభను జరుపుకున్న సందర్భంగా అనేక తత్త్వాలను, కీర్తనలను, గీతాలను మాలలు పాడుకుంటారు. వాటిల్లో "గుణము కుదరదు ఏమి సీతారామయ్య తండ్రీ", బ్రహ్మంబేదో తెలుపండయ్యా – బ్రాహ్మలు మీరయితే", ఈ జన్మమిక దుర్లభమురా" లాంటి తత్త్వాలను పాడుకుంటారు. అప్పుడే అప్పాదాసు అనే మాల తను రచించిన భూమయ్యగారు ఉదహరించిన మొదటి గీతాన్ని చరమగీతం – పాడ్తాడు.

ఈ గీతాలలో మాలలు అనుభవించే కష్టాలను, వివక్షను పాడటం జరుగుతుంది. మాలలు దీన్ని 'యాల' అనే సంగీత రూపంలో పాడుకుంటారని కూడా రచయిత సూచించాడు. ఈ 'యాల' అనే గీతం సుదీర్ఘంగా సంగదాసును అడ్రస్ చేస్తూ మాలల కష్టాలను చెబుతూ సాగుతుంది.

ఉండానిల్లా – పండానేలా
పండపోయా సుండానయ్యా –
అండాలేక మాలాలెండేరు ఓ సంగబావా! దండనుండా వనుకునేరు.
చేతమంటే కూలీలేదు – పోదామంటే నావీ లేదు – బిచ్చమంటే మాలీగాదురా
ఓ సంగదేవా – దేవుడికే జాలిలేదురా....

ఇలా ఈ గీతం సుదీర్ఘంగా సంగదాసును అడ్రస్ చేస్తూ మాలల కష్టాలను చెబుతూ సాగుతుంది. (పూర్తిగా కోట్ చెయ్యలేదు.)

రెండవగీతం – రామదాసు కొడుకుల్లో ఒకడైన వెంకటదాసు – తన అన్న సంగదాసును చౌదరయ్య చంపేసి ఎలాంటి శిక్ష పడకుండా తప్పించుకోవడంతో – భూస్వామ్య సమాజం మీద ద్వేషంతో, ఆ సమాజాన్ని శిక్షించాలన్న పట్టుదలతో తక్కెళ్ళ జగ్గడుగా (ఇవ్వాళ్టి నక్సలైట్‌గా), మారి ధనికులను దోచి పేదలకు పంచుతుంటాడు. తక్కెళ్ళ జగ్గడు తను స్థాపించిన సంస్థలో పనిచేస్తున్న వాళ్ళకు 'సంతానుల'ని పేరు పెడ్తాడు. ఒక రోజు ఒక రైలులో కొందరు సంతానులు, కొందరు పోలీసులు ప్రయాణం చేస్తుంటారు. ఆ రైలులో ఇద్దరు జంగాలు బిచ్చం అడుక్కుంటూ తక్కెళ్ళ జగ్గని పాటల్ని బుర్రకథ రూపంలో పాడుతూ ప్రయాణీకుల్ని బిచ్చం అడుక్కుంటుంటారు. ఆ పాటే భూమయ్యగారు ఉదహరించిన రెండో పాట.

"రామరామ శ్రీరామా రామా రామా రామా రఘురామ!
తక్కెళ్ళ జగ్గని ధర్మబోధలు – తలపున వినరండి

ఆదికాలమున అందరుజనులు – అన్నదమ్ములుండి
నదులు వనంబులు నానామృగములు – నాల్గు సంద్రములును.... (ఈ పాటను పూర్తిగా కోట్ చెయ్యలేదు)

ఈ బుర్రకథ పాట ఇలా దీర్ఘంగా సాగుతుంది. ఈ భూమీమీద మానవులు పుట్టిన ప్రారంభ దశలో ప్రకృతిలోని వనరులన్నీ ఉమ్మడి ఆస్తులేననీ, తర్వాతే ఆస్తిపరమైన హెచ్చుతగ్గులు యేర్పడ్డాయనీ, కులవ్యవస్థ ఆవిర్భవించిందనీ, అగ్రకులాలు, నిమ్నకులాలు యేర్పడ్డాయనీ, అగ్రకులాలు వారు నిమ్నకులాల వారిని అణిచేశారని, వారిని శ్రమజీవులుగా మార్చేశారనీ, శ్రమజీవులంతా యేకమై అగ్రవర్ణాలవారితో పోరాడితే తప్ప వారికి విముక్తి లేదని – ఇలా సాగుతుందీ బుర్రకథ.

మొదటి గీతం పంచములైన మాలల కష్టాలను భూస్వాముల దౌర్జన్యానికి బలయిపోయిన సంగదాసుకు చెప్పుకుంటున్నట్టుగా పాడుకోవడం – రెండవ గీతాన్ని తక్కెళ్ళ జగ్గని ఫీలానఫీని బోధిస్తున్నట్లుగా పాడుకోవడం జరిగింది.

మొదటిగీతం పంచములైన మాలల్ని గూర్చినది. అస్పృశ్యతకు వ్యతిరేకంగా గాంధీగారు స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా 20లలో, 30లో పెద్ద ఉద్యమాన్ని నడిపారు. ఆ ఉద్యమం కారణంగానే ఇలాంటి పాటలెన్నో ఆ రోజుల్లో పాడుకున్నారు. దీనికి అభ్యుదయోద్యమానికి పెద్ద సంబంధమేమీలేదు.

రెండవది – సమతాగీతంలో తక్కెళ్ళ జగ్గడి బోధలున్నాయి. ఈ గీతంలో అభ్యుదయోద్యమ భావాలు కనిపిస్తాయన్న భూమయ్యగారి విశ్లేషణ కరెక్టే. అప్పటికే రష్యాలో సోషలిస్టు విప్లవం సంభవించింది. దాంతో మార్క్సు భావాలు ప్రపంచమంతా వ్యాపించాయి. తక్కెళ్ళజగ్గడి లాంటి తిరుగుబాటుదారులు – లేక విప్లవకారులకు ఈ మార్క్సిస్టు భావాల్లా కనిపించే భావాలుండటంతో ఆశ్చర్యమేమీ లేదు. సమాజంలో అగ్రవర్ణాలవారి పీడనను అనుభవించిన వాళ్ళకు విప్లవభావాలు చాలా సహజంగా వచ్చేస్తాయి. అందుకు మార్క్సిజమే చదువుకోవలసిన అవసరం లేదు. మార్క్సిజంతో ఎలాంటి పరిచయం లేని మార్క్సిస్టులూ ఉండటంలో ఆశ్చర్యం లేదు. తక్కెళ్ల జగ్గడు మార్క్సిజం చదువుకోని మార్క్సిస్టు. ఈ సమతాగీతం అనే ఒక్క గీతం ఆధారంగా ఉన్నవను మొదటి అభ్యుదయ కవి అని సూత్రీకరించటం కొత్తగా యేదో చెప్పాలన్న అత్యుత్సాహమే తప్ప సహేతుకమైనది కాదు.

**_అసలు ఉన్నవ లక్ష్మీనారాయణ కవి కాదు. గొప్ప నవలాకారుడు. నవల వచన ప్రక్రియ. నవలలో ఎక్కడో అక్కడ రైలులో బిచ్చగాళ్ళు పాడుకునే పాటలో మార్క్సిస్టు భావాలు ధ్వనించటం కేవలం యాధృచ్ఛికమే. అది ఒక పాత్ర దృక్కోణమే, అంటే తక్కెళ్ళ జగ్గడి దృక్కోణం._**

అసలు ఉన్నవ లక్ష్మీనారాయణ కవి కాదు. గొప్ప నవలాకారుడు. నవల వచన ప్రక్రియ. నవలలో ఎక్కడో అక్కడ రైలులో బిచ్చగాళ్ళు పాడుకునే పాటలో మార్క్సిస్టు భావాలు ధ్వనించటం కేవలం యాధృచ్ఛికమే. అది ఒక పాత్ర దృక్కోణమే, అంటే తక్కెళ్ళ జగ్గడి దృక్కోణం. ఆ పాటలో కనిపించింది. అదే రచయిత దృక్కోణమే కావలసిన అవసరం లేదు. ఉన్నవ లక్ష్మినారాయణకు మార్క్సిస్టు అవగాహన ఉండొచ్చు. అంతమాత్రాన ఆయనను అభ్యుదయ కవి అని నిర్ధారించకూడదు. ఒక నవలాకారుడు సృష్టించే అనేక పాత్రల దృక్కోణాలను చిత్రించటానికి ఆ నవలాకారుడికి ఎన్నో సిద్ధాంతాలు తెలిసుండాలి. కానీ అతడు నమ్మే సిద్ధాంతమేమిటో నవలంతా చదివాక మాత్రమే తెలుస్తుంది.

'సాహిత్యంలో దృక్పథాలు' అనే గొప్ప విమర్శాగ్రంథం రచించిన ఆర్.ఎస్. సుదర్శనం గారు "మాలపల్లి"లో వ్యక్తమైన ఉన్నవ లక్ష్మినారాయణ దృక్పధమేమిటో ఇలా చెప్పారు.

"ఈ శతాబ్ది రాజకీయాల్లో గాంధీజీ ఎలా విశిష్టవ్యక్తో, అలాగే తెలుగు నవ్యసాహిత్యంలో మాలపల్లి కూడా ఒక విశిష్ట రచన. కాల్పనికోద్యమం తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేస్తున్న రోజుల్లో 'మాలపల్లి' పుట్టింది. కానీ మాలపల్లి కాల్పనికోద్యమానికి చెందిన రచన కాదు. ఆ ఉద్యమం తర్వాత హేతువాదం, అభ్యుదయ సాహిత్యోద్యమమూ, మానవతావాదం సాహిత్యంలో ప్రాముఖ్యం వహించాయి. 'మాలపల్లి' నవలలో పీడితవర్గం వారి చరిత్ర, సమాజంలోని బాధ, ఆర్తి, దురన్యాయం చిత్రించబడినా దాన్ని అభ్యుదయ రచనగా ఒక ముద్ర వెయ్యటానికి వీల్లేదు. కాల్పనికోద్యమం తాలూకు రచనల్లో భాసించిన ఆధ్యాత్మికత, కామరహిత స్త్రీ పురుష ప్రేమ వంటివి మాలపల్లిలో కనిపించినా అవి కూడా విశిష్టంగానే

ఉన్నాయి. మాలపల్లి యొక్క ప్రత్యేకతకు ఒక కారణం తోస్తుంది. తెలుగులో నడిచిన నవ్య సాహిత్యోద్యమాలు రెండింటిలోనూ సంప్రదాయాన్ని సమర్థించటమో, త్రోసిరాజనడమో లేక కొత్తదైన విదేశీయతను తెచ్చి పెట్టుకోవడమో అనే మూడు మార్గాలు స్పష్టంగా కనిపిస్తాయి. పాతకొత్తల మేలు కలయికగా మానవత్వం మీద అఖండమైన విశ్వాసంతో మానవధర్మం పరిమాణాన్ని ఉపలక్షించే నిండుతనం, ఏకాగ్రత ఎప్పుడో అరుదుగా గాని కనిపించదు. సంప్రదాయాన్ని సమర్థించటంలో ముందుచూపు లేదు. దాన్ని త్రోసిరాజనడంలో నిర్మూలించటమే తప్ప నిర్మాణం చేసే దృష్టిలేదు. విదేశీయతను తెచ్చిపెట్టుకోవడంలో దానికి వర్తమాన దేశీయ సామాజిక జీవన స్వరూపంతో అసలు పొంతన కుదరదు. అలా కాకుండా సంప్రదాయంలోని మేలుకోళ్ళను విచక్షించి, వ్యక్తికి సమాజానికి గల సంబంధాన్ని అవగాహన చేసుకొని, నిత్యనూతనమైన జీవన స్వరూపాన్ని ఆశించిన మానవ సమాజం పరిణామానికి తగినట్టుగా దిద్ది తీర్చే దృక్పథం మాలపల్లి నవలలో కనిపిస్తుంది. గాంధీగారి దృక్పథమే మాలపల్లి నవల"

***మాలపల్లిలో ఉన్నది "గాంధీయిజం" అని ఆర్.ఎస్. సుదర్శనం గారు తేల్చారు. ఆ నవలను జాగ్రత్తగా చదివిన ఎవరికైన అందులో ఉన్నది గాంధీయిజమేనని అర్థమౌతున్నది. సమాజంలో మార్పు అహింస ద్వారానే, ప్రజాస్వామ్య బద్ధంగానే జరగాలని ఉన్నవవారు ఈ నవలలో తేల్చారు.***

మాలపల్లిలో ఉన్నది "గాంధీయిజం" అని ఆర్.ఎస్. సుదర్శనం గారు తేల్చారు. ఆ నవలను జాగ్రత్తగా చదివిన ఎవరికైన అందులో ఉన్నది గాంధీయిజమేనని అర్థమౌతున్నది. సమాజంలో మార్పు అహింస ద్వారానే, ప్రజాస్వామ్య బద్ధంగానే జరగాలని ఉన్నవవారు ఈ నవలలో తేల్చారు. తక్కెళ్ళ జగ్గనిలాంటి వాళ్లు తాత్కాలిక ఆవేశంతో హింసాత్మక మార్గాన్ని ఎన్నుకున్నప్పటికీ ఆ మార్గం విజయవంతమైనదని రచయిత చెప్పలేదు. తక్కెళ్ళ జగ్గడు పశ్చాత్తాపపడి చనిపోతాడు. మాలల అభ్యున్నతికి సంగదాసు సూచించిన మార్గాన్నే అందరూ ఎన్నుకుంటారు. అందుకే ఈ నవలకు సంగవిజయం అనే మరో పేరు కూడా ఉంది.

మాలల అభ్యున్నతికి కవి ఎంచుకున్న మార్గంలోని దశలు రెండు – ఒకటి మాలల స్వప్రయత్నం – రెండు అగ్రవర్ణాల సహకారం"ఈ మాటలు రాసింది భూమయ్యగారే – అంటే మాలల అభ్యున్నతికి గాంధీగారు సూచించిన మార్గమే సరి అయినదని భూమయ్యగారే చెబుతున్నారు. కాబట్టి మాలపల్లిని అభ్యుదయ మహాకావ్యం అనడంగానీ, ఉన్నవను మొదటి అభ్యుదయ కవి అనడంగానీ పొరపాటని భూమయ్యగారు గ్రహించాలి.

అందరూ అనుకున్నట్టుగా శ్రీశ్రీ మొదటి అభ్యుదయ కవి కాదని వాదించటం కూడా పెద్ద పొరపాటే. అభ్యుదయ కవిత్వాన్ని ఒక ఉద్యమంగా స్వీకరించినవాడు శ్రీశ్రీ. 1930లలో అమెరికాతో సహా ప్రపంచంలోని పెట్టుబడిదారి దేశాలన్నీ ఆర్థికమాంద్యం అనే ఒక మహా ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొని అకస్మాత్తుగా షేర్ మార్కెట్లలలో షేర్ల ధరలు పడిపోవటంతో పెద్దపెద్ద వ్యాపార సంస్థలన్నీ మూతబడ్డాయి. భయంకరమైన నిరుద్యోగం – "అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని'' అన్నట్లుగా ధరలు పడిపోవటంతో వ్యాపారస్తులు సరుకుల్ని అమ్మడం మానేశారు. ఈ ఆర్థికమాంద్యం కారణంగా పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలన్నీ కుప్పకూలిపోయే పరిస్థితి యేర్పడింది. ఇలాంటి పరిస్థితుల్లో సోషలిస్టు ఆర్థిక వ్యవస్థను స్థాపించుకున్న సోవియట్ రష్యా మాత్రం ఇట్లాంటి ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోకుండా క్షేమంగా ఉండిపోయింది. అప్పుడు ప్రపంచ మేధావులంతా అన్ని దేశాల్లోనూ రానున్నది సోషలిజమే అనుకున్న. ఈ పరిణామంలోంచే అభ్యుదయ రచయితల సంఘాలు, అభ్యుదయ రచయితలు ఉద్భవించారు.

పెట్టుబడిదారీ దేశాల్లో ఆర్థికమాంధ్యం లాంటి సంక్షోభాలు యేర్పడతాయని కార్ల్‌మార్క్స్ చెప్పిన మాట నిజమయిందనుకున్నారు.

లండన్‌లో 30లలో ప్రొగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్ యేర్పడటం, వాళ్ళు ప్రకటించిన మానిఫెస్టోను శ్రీశ్రీ చదవడం జరిగింది. అప్పట్నుంచే ఒక స్పష్టమైన అభ్యుదయ దృక్పథంతో – మార్క్స్ ఊహించిన సోషలిస్టు సమాజం యేర్పడుతుందనీ, శ్రామికుల రాజ్యం వస్తుందని ఆర్థిక వ్యత్యాసాలు లేని సమసమాజం స్థాపించబడ్తుందని,

పెట్టుబడిదారులు శ్రామికుల శ్రమను దోచుకోవడం అంతమైపోతుందని – ఇలాంటి స్పష్టమైన అవగాహనతో శ్రీశ్రీ కవిత్వం రాయడం మొదలెట్టాడు. కాబట్టి తెలుగు సాహిత్యంలో అభ్యుదయోద్యమాన్ని ప్రారంభించిన ఘనత శ్రీశ్రీకే దక్కుతుంది. శ్రీశ్రీ ప్రారంభించిన ఈ ఉద్యమం ఎందరో అతని సమకాలికులను , తర్వాతి తరం వారిని గాఢంగా ప్రభావితం చేసింది. 30లలోను, 40లలోనూ, 50లలోనూ శ్రీశ్రీ ప్రభావానికి లోను కాని తెలుగు కవులు చాలా తక్కువ. ఇంత ప్రభావాన్ని కల్గించిన శ్రీశ్రీని అభ్యుదయ కవిత్వానికి ఆద్యుడు కాదు అనడం సాహసమే.

ఉన్నవ తన నవలలో సందర్భాన్ని బట్టి ప్రవేశపెట్టిన రెండు గీతాల ఆధారంగా – వాటిల్లో అభ్యుదయ భావాలుండవచ్చు గాక – ఉన్నవనే మొదటి అభ్యుదయ కవిగా నిర్ధారించటం అందరూ చెప్పిన దాన్ని కాకుండా కొత్తగా యేదో చెప్పాలన్న అత్యుత్సాహమే కారణం. మాలపల్లిలోని ఈ రెండు గీతాల ఆధారంగా 'మాలపల్లి'ని అభ్యుదయ మహాకావ్యం అనడం పొరపాటు, 'మాలపల్లి' నవల – నవల ప్రధానంగా వచన ప్రక్రియ అని ముందే చెప్పాను.

ఆ రెండు గీతాల్లో అభ్యుదయ భావాలున్న మాట నిజమే. కానీ ఉన్నవ వారు అభ్యుదయ కవిత్వాన్నొక ఉద్యమంగా చేపట్టలేదు. ఆయన రాసిన ఆ రెండు గీతాలు ఆయన సమకాలీక కవులపై గాని, తర్వాతి తరం కవులపై గానీ ఎలాంటి ప్రభావాన్ని కల్గించలేదు.

ఈ రెండు గీతాలకు శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానంలోని గీతాలకు పోలికే లేదు. శ్రీశ్రీ రచించిన కవిత్వం భావాల విషయంలోనూ, ఆ భావాల్ని భాషలోకి అభివ్యక్తం చేసిన విషయంలోనూ ప్రపంచ స్థాయిలో నిల్వగల గొప్ప కవిత్వం. మాలపల్లి ఒక గొప్ప నవల. ఉన్నవ వారు మహాత్మాగాంధీ సిద్ధాంతాల్ని నమ్మి ఆచరించిన వాడు. సీరియస్‌గా ఆలోచిస్తే భూమయ్యగార్కి కూడా తను చేసిన సూత్రీకరణ సహేతుకమైనది కాదని అర్థమవుతుంది.

మాలపల్లి నవలలో తక్కెళ్ళ జగ్గని పాత్రకు రచయిత తక్కువ ప్రాధాన్యమే ఇచ్చాడు. సంగదాసు, రామదాసు పాత్రలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాడు. ఎందుకంటే వీరిద్దరూ గాంధీగారి సిద్ధాంతాలకు ప్రతినిధులు. ఆర్.ఎస్. సుదర్శనం గారన్నట్టు తక్కెళ్ళ జగ్గని పాత్రకూ, అతడు చేసిన తిరుగుబాటుకు రచయిత తక్కువ ప్రాధాన్యత ఇవ్వడానికి కారణం అవి గాంధీ దృక్పథానికి విరుద్ధం కావడమే!

సంగదాసు గాంధీ గారి నీడలా కనిపిస్తాడు. చౌదరయ్య వల్ల తనకు ప్రమాదం ఉందని తెలిసి కూడా కూలీల తరపున అతడు చేస్తున్న సత్యాగ్రహం లాంటి పోరాటాన్ని ఆపడు.

"ధర్మ విజయమెప్పుడూ బలి గోరుతుంది. సోక్రటీసు విషం గ్రహించాడు. క్రీస్తు శిలువనెక్కాడు. పశువధ లేనిదే యజ్ఞం లేదు. పశువులన్నింటికంటే ఉత్తమమైనది స్వార్థపశువు" అంటాడు సంగదాసు. ప్రమాదాన్నెరిగి కూడా జంకలేదు. ఆత్మత్యాగం చేశాడు. "గాంధీగారి అంతిమ త్యాగంలోని పరమార్థం ఇదే కదా" అంటాడు ఆర్.ఎస్. సుదర్శనం సంగదాసు ఆత్మత్యాగాన్ని గూర్చి. (సాహిత్యంలో దృక్పథాలు. పేజీ 69)

'మాలపల్లి' నవలకు "సంగ విజయము"నే మరో ఉపశీర్షిక కూడా ఉంది. సంగదాసు యే సిద్ధాంతాలనైతే, యే పోరాట విధానాలనైతే అనుసరించాడో అవి విజయవంతమయ్యాయని రచయిత చెప్పదల్చుకున్నాడు. అంటే గాంధీగారి విధానాలనే అనుసరించిన సంగదాసు చనిపోయి కూడా విజయం సాధించాడని రచయిత చెప్పదల్చుకున్నాడు. నవల పరమార్థం గాంధీయిజం అయినప్పుడు తక్కెళ్ళ జగ్గన్ని కీర్తిస్తూ బిచ్చగాళ్ళు పాడుకున్న ఒక పాట (బుర్రకథ) ఆధారంగా ఉన్నవ లక్ష్మి నారాయణను మొదటి అభ్యుదయ కవి అనీ, మాలపల్లిని అభ్యుదయ మహాకావ్యం అనడం యేమాత్రం కూడా సమంజసంగా లేదు. విమర్శకుడిగా భూమయ్య గారిలో ఎవరూ చెప్పని విషయాన్ని చెప్పాలన్న కోరిక బలంగానే ఉంది 'ప్రజల మనిషి' నవలను గూర్చి రాస్తూ ఆ నవలలోని కథానాయకుడు అందరూ అనుకుంటున్నట్టుగా కంఠీరవం కాదని, కొమురయ్య అనే పాత్రే ఆ నవలలో కథానాయకుడని ఒక సూత్రీకరణ చేశాడు. ఆ సూత్రీకరణకు కొంత బలం ఉంది. కానీ ఉన్నవ వారిని మొదటి అభ్యుదయ కవి అనటానికీ, మాలపల్లిని అభ్యుదయ మహాకావ్యం అనటానికి ఆయన చూపించిన ఆధారాలు చాలా బలహీనమైనవి. ❐

## నచ్చిన రచన




# సామాజిక చలనంతో 'చలించే' కవి


- వెల్దండి శ్రీధర్
**9866977741**

సామాజిక పరిణామ క్రమంలో జీవితం గత రెండు దశాబ్దాల నుండి మరింత విధ్వంసానికి గురవుతోంది. దేశంలోని ఏ ప్రాంతంలోనైనా అవే స్థితిగతులు అవే సంక్షోభాలు. అవే గాయాలు భారతదేశం నిండా పర్చుకొని ఉన్నాయి. సకలాన్ని ధ్వంసం చేస్తోన్న వర్తమాన పరిస్థితితో చీకటి ఊడలు మనిషి మూలాల్లోకి దిగిపోతున్నాయి. అది తెలంగాణ అయినా, ఉత్తరాంధ్ర అయినా, రాయలసీమ అయినా ఇవే సంకీర్ణ దృశ్యాలు కనిపిస్తాయి. వర్తమాన జీవితం అనేక సంక్షోభాల జీవన గ్రంథమైపోయింది. లెక్కలేని గాయాల సంకలనమైపోయింది. ఇక్కడే కవిత్వం దుఃఖమయమవుతోంది. ధిక్కారమవుతోంది. ఉద్యమం రూపుదాల్చుతోంది. ఇలాంటి పూర్వ రంగాన్నంతా మనసు పొరల్లో ఇంకించుకొని కవిగా నెత్తుటి దారుల మీదుగా ప్రయాణం మొదలు పెట్టిన కవి సిరికి స్వామినాయుడు. కాలం కనికట్టుకు మట్టి కలలు ముక్కలయిన చప్పుడును లీలగా వినిపిస్తున్న అతని కవితా సంపుటే 'మంటి దివ్వ'. ఇందులోని ప్రతీ కవిత సమాజ నగ్న చిత్రాన్ని విప్పి చెప్పడానికి విశ్వ ప్రయత్నం చేస్తుంది. ప్రపంచీకరణ, ఆర్థిక సరళీకరణ, ప్రవేటీకరణ భూగోళం మూల మూలలకు చొచ్చుకొని పోయిన తర్వాత సమాజం కూలిపోతున్న విధం రోజు రోజుకు మనిషి జీవితం కుదేలవుతున్న తీరు దీని కోసం సగటు మనిషి ఆరాట పోరాటాలు ప్రతి పుట నిండా అక్షర రూపం దాల్చి నిలబడ్డాయి ఈ సంపుటిలో.

*యీ నాగావళీ నదీ తీరం మీద*
*బతుకు పాట పాడి పల్లె పట్టులేవనడిగాడతడు*
*బీళ్లుగా మారిన పంటపొలాల మీద నడుస్తూ..*
*అభివృద్ధి తిరుగుడు గుమ్మిలో పడి – అవి*
*ఎండుటాకుల్లా కొట్టుకుపోయాయన్నారు వాళ్లు*
*వొట్టిపోయిన వనకాబడి గడ్డమీద నడుస్తూ...*

ప్రపంచీకరణ ఇనుప పాదానికి నలిగిపోని రంగమేది? పల్లెలన్నీ ఇవాళ పత్ర హరితాన్ని కోల్పోయిన చెట్ల మాదిరి నిల్చున్నాయి. తాడు లేకుండా ఉరివేయబడిన పల్లెలు దేశంనిండా కనిపిస్తాయి. మొండి గోడలు, కూలిన మిద్దెలు, మట్టి దిబ్బలు, పిచ్చిమొక్కలు, తవ్వకాల్లో బయల్పడ్డ పురానాగరికతలా, నిశ్శబ్ద శ్మశనాల్లా, ఆయుధం లేకుండానే హత్యకు గురైన రక్తపాతం జరగకుండానే ఉసురు తీయబడిన పల్లెలు అడుగడుగునా కనిపిస్తాయి. పొదుగు నుండి పెయ్యను లాగేసినట్టు, మట్టి నుండి మొక్కను దూరం చేశాక కుక్కమూతి పిందెల్లా పుట్టికొచ్చిన కర్మాగారాలు కాలుష్యాన్నీ కక్కుతాయి. పల్లె దువ్వారానికి కట్టుకున్న పచ్చ తోరణం తెగిపోయాక బతుకు మండుతున్న యిటుక బట్టీలా భగ్గుమంటుంది. సెజ్‌లు, ఇండస్ట్రీయల్ కారిడార్లు, రైతు నమ్ముకున్న నేలను ఎలా దొర్లించుకుపోతున్నాయో, సామాన్యున్ని కన్నీటి మడుగులో ముంచేసి రాజ్యం చేసుకుంటున్న రహస్యపు ఒప్పందాలను, దానిలోని మార్మికతను గుండె మంటతో వెలిగిస్తాడు కవి.

ఒక దృక్పథం ఉన్న కవి, కవిత్వాన్ని ప్రజల పక్షం చేసే కవి, తన ప్రాంతంపై మమకారం ఉన్న కవి ఏ దేశంలోనైనా ఇలానే రాస్తాడు. ఇలానే స్పందిస్తాడు. సమాజం అన్నా, మనిషన్నా, కన్నీటి ఉప్పదనమన్నా, విలువ తెలిసిన కవులు ఈ విధంగానే రాస్తారనేదానికి ఈ కవిత్వం నిదర్శనం.



సిరికి స్వామినాయుడు

"యిపుడు పల్లె నడి వీధిలో విచ్చుకున్న / వేయిరేకుల వెలుగు పువ్వు రంగస్థలం లేదు/ హరికథల్లేవు / బుర్రకథల్లేవు భాగోతాల్లేవు / బుడబుక్కల నాదాల్లేవు/చెక్కభజనల్లేవు సన్నాయి రాగాల్లేవు/ కోలాటాల్లేవు కొమ్మ దాసరి పాటల్లేవు/తుళ్లిపడే సెలయేటి పాటలాంటి పల్లెమీద/రంగు రంగుల పొగమంచు కమ్ముకుంటోందిప్పుడు"

ప్రపంచం ఇవాళ ఒక టీవీ లేని ఇల్లును కలగంటోంది. బాల్యం తన చేపల్లాంటి కళ్లను టీవీ స్క్రీన్‌కు అతికించి అందులోనే చేపలా ఈదులాడుతోంది. బుల్లి తెరమీద ఆరేసిన అందాల చుట్టూ తిరుగుతూ చొంగ కార్చుకుంటోంది. సీరియల్స్ అంతమయ్యేలోపు వృద్ధాప్యం తన బతుకును చాలిస్తోంది. సమస్త మానవ జాతి చేతనత్వం ఉడిగిపోయి చెదలు పట్టిన మాడులా తయారవుతోంది. కేబుల్ కుట్రకు జీవితమే బలవుతోంది. అందుకే మనిషి ఓ నిరసన పతాకమై ఎగరాలిపుడు అంటాడు కవి. ఈ కవితా సంపుటి నిండా జీవిత చిత్ర లిపి పరుచుకొని ఉంటుంది. కష్టజీవి స్వేదం నుంచి ఇంద్రధనుసు విరిసినట్లు అంతా ఒక వర్ణ సంచయం కనిపిస్తుంది. కొత్త లిపినేదో చదువుతున్నట్లు మనసంతా బరువుగా మూల్గుతుంది. ఒక్కో కవిత చదువుతున్నప్పుడు దేహంలోని అనేక జీవ గ్రంధులు ఉత్తేజితమై అంతా ఒక మానవత్వపు రసాయనం విడుదలై ఏవో మనిషి తనపు వేర్లను మనసు మూలల్లో నాటుతుంది. వస్తువేదైనా అందులో ఒక మానవతా దృష్టి కోణం తొంగి చూస్తుంది. పవర్ ప్లాంట్లకు నిరసనగా విరుచుకుపడినా, హామీల నీటి బుడగల మీద రంగు రంగుల కలల్ని ఆవిష్కరించి ప్రజల బతుకుల్ని కొల్లగొట్టుకుపోతున్న ఏదో ఋతువు మంత్ర కవాటాల్ని తెరిచి చూపినా, నిర్వాసితులకు కవిత్వపు గుడాల్ని వేసినా, సముద్రతీరం మీద తడారని శోకానికి దోసిలిపట్టినా, అడవిని కాపాడుకునేందుకు బరిసె పట్టిన యోధుని గురించి చెప్పినా, మట్టి మగ్గం మీద ఆకుపచ్చని నేత నేసే రైతును చిత్రించినా స్వామి నాయుడు కలం నడిచే శిల్పం వేరే విధంగా ఉంటుంది. కొల్లగొట్టడం నేరమైతే బాల్యాన్ని కొల్లగొట్టడం కూడా నేరమేనని తూనీగల్లాంటి బాల్యాన్ని తరగతి గదుల్లో బంధిస్తావెందుకని నిలదీస్తాడు. వేయి శిశిరాల్ని మోస్తున్న ముసలి సత్రపు ఊసులన్నీ గుండెకు వినిపించి మనసంతా రక్తపు వర్ణం వెదజల్లుతాడు. యాసిడ్ దాడికి గురైన యువతి పక్షాన నిలబడి సానుభూతి వర్షమై కురుస్తాడు. తార్రోడ్డు కాన్వాసుపై బతుకు బొమ్మను గీసి, శవం మీద చల్లిన చిల్లర ఏరుకునే భిక్షగాడిగా మారిన కళాకారుడికి నూరు రూకల ఆత్మవిశ్వాసమవుతాడు. కామందు కొరడా దెబ్బలకు గజ గజ వణికే బాలకార్మికుడి గాయాలపై ఉమ్మితడి అవుతాడు. భూమినంతా గుంజుకొని రాజ్యం ఒక రైతులేని రాజ్యాన్ని కలగంటున్నప్పుడు తుపాకీ మొనకు పూసిన ఎర్రమందారమవుతాడు. సెజ్ డేగ రెక్కల కింద నలిగి నేల ఎద్దుపుండైనప్పుడు మట్టికి మరణం లేదంటూ, మనిషై మళ్లీ నడిచొస్తుందని ఆశావాదాన్ని వినిపిస్తాడు. మెతుకువేటలో బతుకు చేత పట్టుకొని నగరపు మురికివాడకు వలస పోతున్న పల్లెకు ఆశ్రయమవుతాడు. 'మంటిదివ్వె' చదివాక మనసు జ్వర పీడితమవుతుంది. ఒక యుద్ధానంతర భీభత్స దృశ్యం కనులముందు కదలాడుతుంది. నిప్పు కణికలనే అక్షరాలుగా మార్చి ప్రతీ పుటలో పేర్చినట్టుగా కవిత్వపు సెగ తాకి దేహం పక్కకు జరుగుతుంది. ఒక సామాజిక బాధ్యతతో కూలిపోయిన కుల వృత్తుల గురించి, రైతు తన చేనులోనే మృత్యువును కౌగిలించుకున్నప్పుడు దుఃఖపు రూపుదాల్చిన రైతు భార్య గురించి పొగిలి పొగిలి ఏడ్చే కవి. చివరాఖరికి ఇతడు ఒక కళింగాంధ్ర కవే కాదు. సామాజిక చలన సూత్రాలను అర్థం చేసుకున్న కవి. నాగలికి కవిత్వపు ఖడ్గాన్ని నూరి గుండె గోడలకు అనేక నెత్తుటి మరకల్ని శాశ్వతంగా అంటించే కవి. ఈ కవిత్వపు ఆసరాతో నేలమాళిగలోకి వానపాములా వెళ్లిపోతాం. కల్లోలమైన మనసుతో ఒక నిర్వాసిత గుడారాన్ని చేరుకుంటాం.

"ప్రతి రోజూ నాకొక నాగలి ఎదురొస్తే బావుణ్ణు
మట్టి నుదుట ఎవరైనా పచ్చని బొట్టు దిద్దితే బావుణ్ణు
భూగోళం మీద
మట్టి మనిషి విశ్వరూపం కన్పిస్తే బావుణ్ణు"

❐

## కవిత

### ప్రశ్న

- మామిడిశెట్టి శ్రీనివాసరావు
9573347744



సంశయాల సందిగ్ధతల నడుమ
వింటి నుండి వెలువడిన బాణంలా దూసుకొస్తుంది
నిశ్చల మదిలో ఆలోచనల ప్రకంపనలు
జవాబు కొరకు అన్ని వైపులా అన్వేషణ
రాతి యుగం నుంచి ఆధునిక యుగం వరకు
మానవ జీవనం పయనంలో
వ్రేలు పట్టుకుని నడిపించింది ఈ ప్రశ్నలే
ఖగోళ రహస్యాలు, భూగోళ విశేషాలు
గణిత సూత్రాలు, జనన సిత్రాలు
గుట్టు రట్టు చేసింది ఈ ప్రశ్నల పరంపరే!
ప్రశ్న జిజ్ఞాసకు మూలం
జిజ్ఞానం ఆవిష్కరణలకు నెలవు
ఆవిష్కరణలు అభివృద్ధికి కొలవు
చెట్టు నుండి పండు కిందికే
ఎందుకు పడుతుందన్న ప్రశ్న
గురుత్వాకర్షణ సిద్ధాంతానికి దారి చూపింది
మట్టి ముద్ద (మనిషి) మహోన్నత శిఖరంలా మారడంలో
ప్రశ్నల పాత్ర ప్రశంసనీయం

### సాహితి వ్యవసాయం

- ఎస్.వి.రమేష్ కుమార్
9491520740



తీరిక వేళల్లో
ఆలోచనా తెమ్మెరలు నను పలకరించేవేళ
నా కాగితపు సాహితీ క్షేత్రంలో
వ్యవసాయం చేయడం నాకెంతో ఇష్టం!

మనసనే ఆలోచనల గాదెలో
మేలిమి విత్తనాలు వెతికిపట్టి
కలమనే హలంతో అక్షరాలచాళ్ళు వేసి
ఆలోచనా విత్తనాలు నాటడం
నాకెంతో ఇష్టం!

లేలేత మొలకలకు తేటతెలుగు నీళ్లుపెట్టి
అనవసరపు కలుపు తీసి
భావమనెడి ఎరువువేసి
కవితా మొక్కలు పెంచడం నాకెంతో ఇష్టం!

ఆ మొక్కలు పెరిగి
ఏపైన వృక్షాలై
సుగంధ పుష్పాలు పూస్తే
తియ్యటి పళ్ళు కాస్తే
పదిమందికి పంచడం
నాకెంతో ఇష్టం!

చల్లని సాయంత్రాల్లో
నా కవితావృక్షాల నీడలో
అలసిన మనసును
అరబెట్టుకుంటూ
జ్ఞాపకాలు నెమరేసుకోవడం
నాకెంతో ఇష్టం!!

### నానీలు

- ఆర్. బాలకృష్ణ
9440143488



సప్త వర్ణాలను
ఏకవర్ణంగా ప్రసరిస్తాడు
సూర్యునికి లేదు
వర్ణ వివక్షత

ఇండియా
సముద్రంలోకి జారిపోకుండా
హిమాలయాలే
పేపర్ వెయిట్

రాత్రింబగళ్ళ తెరపై
ఎన్నో వర్ణచిత్రాలు
సూర్యచంద్రులే
దివిటీలు

లయగా
చినుకు శబ్దం
వర్షాకాలమంతా
సంగీత కచేరియే

సూర్యుడికి రాత్రి,
చంద్రుడికి పగలు
విశ్రాంతి
మరి అమ్మకి?

హిమాలయాల్లోనైనా
కన్నీరు
ఘనీభవించదు
ప్రవహిస్తూనే వుంటుంది.

కథ

# కరువు

- మేరెడ్డి యాదగిరిరెడ్డి
9949415796



## కరువు

### భీకరమైన కరువు

చినుకు జాడలేదు. నెర్రెలు బాసిన నేలతల్లి. కార్తె కార్తెకు వానకోసం రైతన్నల ఎదురు చూపులు. నిర్మలమైన ఆకాశం. మైదానం లాంటి భూమి ఎక్కడా పచ్చటిగడ్డి పరకలేదు. ఎండిన వాగులు, వంకలు, చెరువులు, కుంటల్లో చుక్కనీరు లేదు. గుక్కెడు నీళ్ళకోసం వురుకులు పరుగులు గత రెండేండ్లుగా అరాకొరా వానలు, ఆగిఆగిపోస్తున్న బోరు బావులు గడ్డి మొలచిన పెద్దబావులు.

అరకొర చినుకులు మొలకెత్తీ మొలకెత్తని విత్తనాలు, కుండలు, బిందెలతో మొలకలు తడుపుతున్న బక్క రైతులు, ట్రాక్టర్ల ట్యాంకర్లుతో నీళ్ళు పోయిస్తున్న పెద్ద రైతులు.

తినడానికి తిండి లేదు. తాగడానికి నీళ్ళు లేవు. పశు వులకు మేతలేదు. వలసలు పోతున్న జనం కళేబాలకు పశు వులను తోలుతున్న రైతన్నలు. అప్పులు వడ్డీలు పెరిగి రైతుల ఆత్మహత్యలు. ప్రతిరోజూ ఏదో ఒక చోట చావుడప్పు మోగుతూనే ఉంది.

నాయకుల మాటలు నీటి మీది రాతలు. శుష్క వాగ్ధానాలు శూన్యహస్తాలు, ఋణమాఫీలు, సబ్సీడీలు, పంట నష్టపరిహారాలు ఎడారిలో ఎండమావులు. పేదరైతుకు అందని సాయం.

బక్క చిక్కిన రైతు బక్కయ్య. ఎముకలపోగు బక్కయ్య. కరువుతో విలవిల లాడుతున్న బక్కయ్య. ఒకప్పుడు ఎద్దు యవసంతో బాగబతికిన వాడె. అప్పు చేసి రెండెకరాల పొలంలో నాలుగు బోర్లు వేసి చుక్క నీరు రాక బికారిగా మారాడు. అప్పులకు ఎకరం భూమి అమ్మగా మరో ఎకరం భూమి అప్పు కింద తాకట్టులో వుంది. మేకలు మేపుకుంటూ కాలం వెళ్ళదీస్తున్న బక్కయ్య.

పేరుకుదగ్గట్టే బక్కపల్చని మనిషి బక్కయ్య ఫ్లోరిన్ నీళ్ళతో వంకర పోయినకాళ్ళు. అప్పుల మూటతో వంగిపోయిన నడుము. ఆకలితో లోపలికి పీక్కుపోయిన కడుపు. బాణాల్లా వంగిన బరెంక బొక్కలు. పీక్కుపోయిన ముఖం. నెరిసిన గడ్డం. చెవికి పోగు. మోకాళ్ళవరకు దోవతి. సగం చినిగిన బనియను. తలకు రుమాలు, కాళ్ళకు అరిగిన

చెప్పులు చేతిలో కర్ర. నేటి సగటు రైతు ప్రతిబింబం బక్కయ్య.

బక్కయ్య భార్య బక్కమ్మ. రెండు నెలలుగా ఒకటేకడుపు నొప్పి. చిన్నా చితకా ఎన్ని హాస్పిటళ్ళ చుట్టూ తిరిగినా తగ్గని మాయదారి నొప్పి. ఉన్న నాలుగు తల్లి మేకల నమ్మి బక్కమ్మను పట్నంలో పెద్ద హాస్పిటల్‌లో చేర్పించాడు బక్కయ్య. ఇక కార్పోరేట్ హాస్పిటల్ వారు తమ తడాఖా చూపించారు. రక్తం, మూత్ర పరీక్షలు, ఎక్స్‌రేలు, స్కానింగ్‌లు, ఎం.ఆర్.ఐ. తమదగ్గర వున్న పరీక్షలన్నీ చేయించారు. మొత్తం మేకలమ్మిన ముప్పయి వేలు పరీక్షల పేరుమీద వసూలు చేశారు. కడుపులో గడ్డ వుంది. ఇంకా ముప్పయి వేలు తెస్తే అర్జంటుగా ఆపరేషన్ చేయాలన్నారు డాక్టరు. లేకుంటే బతకదన్నాడు.




అప్పు కోసం ఊరంతా తిరిగాడు. ఎక్కడా అప్పు పుట్టలేదు. షావుకారు చిన మల్లయ్య దగ్గర తన ఎకరం భూమి తాకట్టులో వుంది. గతంలో చేసిన రెండు లక్షల అప్పుల వడ్డీతో నాలుగు లక్షలయింది. “ఇగో బక్కయ్య నీ ఎకరం అమ్మినా నా నాలుగులక్షల బాకీ తీరదు. ఏం చూసి నీకు అప్పివ్వమంటావు. ఎద్దాయవసమా! ఏముంది నీ దగ్గర” మల్లయ్య మాటలతో వెనుదిరిగాడు బక్కయ్య. నాలుగు తల్లి మేకలమ్మగా వాటి పిల్లలు నాలుగు మేకపోతులున్నాయి. ఇక వాటినీ అమ్ముదామని ఇంటిదారి పట్టాడు బక్కయ్య. ఇంతకంటే డబ్బులు దొరికే మార్గం లేదనుకున్నాడు.

రెండు రోజులుగా మేతసరిగా లేక ఆకలితో ఆవురావురుమంటున్న మేకపోతులు అరిచి అరిచి ఎనుగుదూకి బయటపడ్డాయి ఒకదాని వెంట ఒకటి. మేతకోసం వూరంతా తిరిగాయి. కరువు మూలంగా ఎక్కడా పచ్చటి చెట్లు కానరాక తిరిగి తిరిగి పోలీస్ స్టేషన్ ముందాగాయి.

స్టేషన్ లోపల పచ్చటి చెట్లు చూసే సరికి వాటికి ప్రాణం లేచివచ్చినట్లయింది. నోరూరింది రకరకాల పూలచెట్లు. గులాబి, నందివర్ధనం, లిల్లీ, బంతి, చేమంతి. పచ్చటి గడ్డి కనుల విందుగా వున్నాయి.

స్టేషన్ లోపల అటు ఇటూ ఆదుర్దాగా తిరుగుతున్న యస్.ఐ. పుల్లయ్య నిన్న వచ్చిన మేసేజ్‌తో గాబరాపడిపోయాడు. రేంజ్ ఐ.జి. శశిధర్ ధత్తా ఇన్స్‌పెక్షన్‌కు వస్తున్నాడని వార్త తెలిసినప్పటి నుండి ఈ గండం ఎలాగట్టెక్కాలా అని ఎడతెగని ఆలోచన, ఆందోళన. గుబురు మీసాలు, బట్టతల లావుపాటి పొట్ట. గంభీరమైన ముఖం, తాగినవాడిలా ఎర్రటి కండ్లు, చేతిలో లాఠీ నెత్తిమీదటోపి బూట్లు టకటకలాడిస్తూ అటూ ఇటూ పచార్లు. రోజుకు ఓ పదిసార్లయినా మీసాలు మెలివేస్తుంటాడు. అందరూ మీసాల పుల్లయ్య అంటారు.

కరువు కరువు. వర్షాలు లేక జనాలకు కరువు. మామూళ్ళు రాక స్టేషనుకు కరువు. గత రెండు నెలలుగా స్టేషన్‌కు వచ్చే నెల వారి మామూళ్లు బందయ్యాయి. పైవాళ్ళకు పంపే మామూళ్ళు తప్పడంలేదు. ఇసుక దందానుండి లక్ష, గుడుంబా బెల్టుషాపుల నుండి లక్ష, బొగ్గుబట్టీల నుండి ఓ లక్ష ఠంచనుగా నెల నెల అందేవి. పై వాళ్ళకు ఓ లక్ష పంపగా తనకు ఎటు లేదన్నా అన్ని ఖర్చులు పోను ఓ లకారం మిగిలేది. మామూళ్ళ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగేది.

కొత్త యస్.పి. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్. వచ్చిన రెండు నెలల నుండి అన్ని దందాలమీద ఉక్కుపాదం మోపి దడదడ లాడిస్తున్నాడు. ఎవరిమాట వినని మొండిఘటం. తనపనే తనది. రాజకీయ నాయకులు చెప్పి చెప్పి విసిగిపోయారు. యస్.ఐ. పుల్లయ్యకు ఇన్స్‌పెక్షన్ టెన్షన్ బి.పి. పెరిగింది. ఎటులేదన్నా ఓ ముప్పయి వేలన్నా కావాలి. ఘనంగా డిన్నర్ పార్టీ ఏర్పాటు చేయాలి. వెంటవున్న వాళ్ళకు తృణమోపణమో ముట్టచెప్పాలి. ఎలా ఎలా ఇవే ఆలోచనలు. నాలుగు దిట్టంగా బలిసిన మేకపోతులు ఆవురావురుమంటూ స్టేషన్ లోపల పచ్చటి చెట్ల మీద పడ్డాయి. యస్.ఐ. చూపులు వాటి మీద పడ్డాయి. కరువులో కురుస్తున్న కుంభవృష్టిలా తనపాలిట కల్పతరువులా వచ్చిన మేకపోతులను చూసి యస్.ఐ ముఖం వెయ్యివోల్టుల బల్బులా వెలిగిపోయింది. ఇన్స్పెక్షన్ గండం గట్టెక్కొచ్చనుకున్నాడు.

బయటకు వెళ్ళగొట్టె ప్రయత్నంలో సెంట్రీ, కానిస్టేబుళ్ళ “ఏయ్ సెంట్రీ 201, 203 ఏంజేస్తున్నారు. గేటు మూయండి వాటిని పట్టుకుని లాకప్ సెల్‌లో పెట్టండి” ఆజ్ఞ జారీ చేశాడు యస్.ఐ పుల్లయ్య.

మేకలు బయటకు తోలే ప్రయత్నంలో ఉన్న కానిస్టేబుళ్ళ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. అయోమయంలో

పడ్డారు. గతంలో ఎన్నోసార్లు వచ్చిన మేకలను బయటకు పంపారు. "దోపిడీ దొంగలు, రౌడీలు క్రిమినల్స్ పెట్టే లాకప్‌లో మేకలను పెట్టమంటాడేంటి?" ఈ యస్.ఐ.కి మెంటలెక్కలేదు గదా" అర్ధంగాక కానిస్టేబుళ్ళు నిలువు గుడ్లేసి నిలబడ్డారు.

"ఏయ్ మీకే చెప్పేది అపురూపంగా పెంచుకున్న చెట్లు తింటుంటే అలా చూస్తారేంటి. వాటిని పట్టుకుని మూతులు, కాళ్ళు కట్టి లాకప్‌లో పడేయండి" గట్టిగా అరిచాడు యస్.ఐ. ఏలాగో తంటాలుపడి నాలుగు మేకపోతులు పట్టుకని లాకప్‌లో వేశారు కానిస్టేబుళ్ళు.

దొడ్లో మేకపోతులు లేకపోయేసరికి ఆదరాబాదరాగా ఊరంతా గాలించాడు బక్కయ్య. కనబడ్డ




వాళ్ళనల్లా అడిగాడు. చివరకు చాకలి మంగమ్మ చెప్పింది. తాత నీ మేకపోతులు పోలీస్ స్టేషన్‌ముందు అగుపడ్డాయి. బక్కయ్యకు ప్రాణం లేచి వచ్చినట్లయింది.

భయం భయంగా చేతికర్ర పొడుచుకుంటూ అడుగులో అడుగు వేసుకుంటూ పోలీస్‌స్టేషను లోపలికి వెళ్ళాడు బక్కయ్య. సెల్లో ఎవరితోనో మాట్లాడుతున్నాడు యస్ఐ.

బక్కయ్యను చూసేసరికి కానిస్టేబుల్ వెంకటేశానికి మేకపోతులు బక్కయ్యవని గుర్తుకువచ్చింది. గతంలో రెండు మూడుసార్లు లోనికి వస్తే తోలుకెళ్ళాడు.

"సార్‌సార్ బక్కయ్య.... మేకలు..." బక్కయ్యను చూపిస్తూ అన్నాడు వెంకటేశం.

"నోర్మ్సుకో చుప్..." గద్దించాడు యస్.ఐ.

"దండం దొరా" కర్ర కింద పెట్టి రెండు చేతులు జోడించాడు బక్కయ్య. చూసినా చూడనట్లు సెల్‌తో ఎవరితోనో మాట్లాడుతున్న యస్.ఐ.

"దొరా"

''ఏందిరా! బక్కయ్యా మల్లేం దొంగతనం చేసినవురా? గొర్లాబర్లా పోయినేటిసంగతి గుర్తులేదురా" యస్.ఐ. పులిలా గర్జించాడు. గతం గుర్తుకు వచ్చి బక్కయ్య మేకలా వణికిపోయాడు.

పోయిన సంవత్సరం ఎవరిదో పాలిచ్చే బర్రె దారి తప్పి బక్కయ్య దొడ్లోకి వస్తే ఓ నెలరోజులు మేతమేపి పాలు పిండుకున్నాడు. తర్వాత ఆ బర్రె సొంతదారుడు వస్తే బర్రెను అప్పగించాడు. విషయం సర్పంచ్ ద్వారా తెల్సుకున్న యస్.ఐ. స్టేషన్‌లో పెట్టి ముసలోడని చూడకుండా దొంగతనం నేరం మోపి చిత్రహింసలు పెట్టి ఐదు వేలు వసూలు చేసి సర్పంచ్ తను చెరిసగం పంచుకున్నారు.

"అదేంలేదు దొరా! నా మేకపోతులు పోయినయి. పొద్దటినుండి వూరంతా తిరిగిన. ఎక్కడ కన్పడలే. చాకలి మంగమ్మ స్టేషను ముందట కన్పడ్డయని చెప్పింది సామి. ఇటొచ్చినయేమోనని వచ్చినాదొరా" చేతులు నలుపుతూ అన్నాడు బక్కయ్య.

"మేకపోతులేంది పోలీసు స్టేషనుకు వచ్చుడేందిరా! మేమేమన్నా పనిలేక నీ మేకలకాస్తేందుకున్నాంరా! నకరాలు చేస్తున్నావురా నడువు నడువు బయటకు నడువు"

''అదిగాదు దొరా మాముసల్దాని పానం బాగలేదు. రెండు నెలల నుంచి ఒకటే కడుపు నొప్పి. ఎన్ని దవాఖానాలు తిప్పిన పానం బాగ్గాలే. నాలుగు తల్లిమేకలమ్మి పట్నంల దవాఖానాల వేసిన. ముప్పయివేలు కట్టుకున్నారు. ఇంకా ముప్పయి వేలు తెస్తే ఆపరేషన్ చేస్తమంటున్నారు. మేకపోతులు అమ్ముదమని వచ్చిన దొరా" బక్కయ్య కండ్లలో నీల్లు తిరిగినయి. యస్.ఐ. పుల్లయ్య కాల్లు పట్టుకున్నాడు. అనుకొని సంఘటనతో యస్.ఐ షాకయ్యాడు. తనగుట్టు రట్టవుతుందేమోనని అసహనంగా కోపంతో "దొంగనాకొడుకా నీ మేకలు నాదగ్గరెందుకుంటాయిరా" కాలు విదిలించాడు. చేప్పేది నీకుగాదు నడువు బయటకు నడువు. కోపంతో రొప్పుతూ అన్నాడు. ఆయన మాటలతో స్టేషన్ మారుమోగింది.

ఆ వూపుకు కింద పడబోయిన బక్కయ్యను కానిస్టేబుల్ వెంకటేశం వొడిసి పట్టుకున్నాడు. బండలమీద పడితే తలపగిలేది. వెంకటేశం చేసిన పనికి యస్.ఐ. కోపం నశాలానికెక్కింది. చేతిలో లాఠీతో టేబుల్‌మీద టకటక కొడుతూ వెంకటేశం వైపు గుర్రుగా చూశాడు. పండ్లు పటపటకొరికాడు.

"ఒరేయి వెంకటేశం తీసుకపో వాన్ని బయటకు తీసుకుపో" గట్టిగా అరిచాడు యస్.ఐ.

"ఒరేయి వెంకటేశం నీ కెన్నిసార్లు చెప్పాలిరా!

అక్కర్లేని విషయాలు నీకెందుకురా! పోలీసోడికి దయాదాక్షిణ్యం, జాలి న్యాయం, అన్యాయం, నీతి, నిజాయితి, వున్నోడు, లేనోడు బీదా, బిక్కి సెంటిమెంట్లు పనికిరావురా! రఫ్ ఎండ్ స్టఫ్‌గా వుంటేనే మన మీ వుద్యోగం చేస్తాం". "చూడు నిన్నా మొన్నా మహబూబ్‌నగర్‌లో ఆ యస్.ఐ. గాడు ఇసుక మాఫియా వాళ్ళు యిచ్చిన మామూళ్ళు బుద్ధిగా తీసుకుని నౌకరి చేసుకోక దేశాన్ని నేనే వుద్ధరిస్తానని చివరకు వురిపెట్టుకుని చచ్చి పెండ్లాం పిల్లలకు కరువయ్యాడు."



"ఇంకా నువ్వు చదువుకునే టప్పటి యూనివర్సిటీ నక్సలైట్ పోరల సోపతి బుద్ధులు మరచి పోలేదురా. బుద్ధిగా వుండు నీ వింకా రెగ్యులర్‌కాలేదు. నీ సర్వీసు రెగ్యులర్‌కు నేనే కాన్ఫిడెన్షియల్ రిపోర్టు రాయాలి తెల్సిందా! ఇంకోసారి స్టేషన్ విషయాల్లో జోక్యం చేసుకుంటే ఇంటి దారి పడతావు జాగ్రత్త" బెదిరిస్తూనే భగవద్గీతలో శ్రీకృష్ణుడిలా హితబోధ చేశాడు యస్.ఐ.

వెంకటేశం పేదకుంటుంబం నుండి వచ్చినవాడు. చిన్నప్పుడే తండ్రి చనిపోతె తల్లి కూలినాలి చేసి పి.జి దాకా చదివించింది. ఉద్యోగాన్వేషణలో తిరిగి తిరిగి విసిగి పోలీసు వుద్యోగంలో చేరిపోయాడు.

వచ్చిన కొత్తలో జయపాల్‌రెడ్డి దొర కరెంటు మోటరు దొంగతనం కేసులో ఫకీరయ్యనే ముసలోన్ని స్టేషన్‌లో పెట్టి చితకబాదుతుంటే వళ్లంతా దద్దుర్లు వచ్చాయి. "వాడు చచ్చేటట్టున్నాడు. సార్ వాడికేం తెలియదంటున్నాడు. విడిచి పెడదామా" అన్నాడు. అదీగాక రెండు మూడు కేసుల్లో అమాయకులను హింసిస్తుంటే వాల్లతరపున వకాల్తాపుచ్చుకొని మాట్లాడాడు వెంకటేశం.

"ఒరేయి నీవు స్టేషనుకు పనికిరావుగాని బుద్ధిగా మా ఇంటి దగ్గర అమ్మగారు చెప్పిన పనులు చేసుకోపో" అని తన ఇంటి దగ్గర డ్యూటీ వేశాడు. ఇన్‌స్పెక్షన్ వుందని ఆరు నెలలకు ఇప్పుడు మళ్ళీ స్టేషనుకు పిలిపించాడు. "మేకలు జాగ్రత్త" అని కండ్లతో హెడ్‌కు సైగచేసి బైక్‌స్టార్ట్ చేసుకుని బయటపట్టాడు యస్.ఐ. పుల్లయ్య.

"లంచాలు మేసిమేసి వీడికి పొట్ట పెరిగింది. తాగితాగి బుర్రమొద్దుబారిపోయింది. పాపం బక్కయ్య లాంటి వాళ్ళపాపం తగులకపోదు. పేదోల్ల పొట్టగొట్టే వీడు బాగుపడడు. శవాలమీద పేలాలు వేరుకతినే వీడిది ఓ బతుకేనా" మనస్సులో తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టుకున్నాడు వెంకటేశం.. బక్కయ్యను బయటకు తీసుకవచ్చి టీ తాపించి వందరూపాయలు చేతిలో పెట్టి పంపించాడు వెంకటేశం.

అనుకున్న సమయానికి రేంజి ఐ.జి. శశిధర్ దత్తా మందీ మార్భలంతో అట్టహాసంగా వచ్చాడు. స్టేషన్ రికార్డులన్నీ పరిశీలించాడు. కేసులన్ని రివ్యూచేశాడు. క్రైంరేట్, కోర్టుకు పంపిన కేసుల పట్ల సంతృప్తిగా తలవూపాడు.

ఆ తర్వాత వసందైన విందు ఘుమఘుమలాడే మటన్ బిర్యానీ విదేశీ మద్యం బాటిల్లతో అందరికి ఘనమైన విందుపార్టీ. గ్లాసుల గలలు. బిర్యానీ ప్లేట్లు ఖాళీలయ్యాయి. పొట్టలుబ్బేవరకు తిని తాగారు.

రేంజి ఐ.జి తోపాటు పక్కపక్క యస్.ఐ.లు యం.ఆర్.ఓ... యం.డి ఓ... సర్పంచ్ యం.పి.టి.సి., జడ్.పి.టి.సిలు విందుకు హాజరయ్యారు. బిర్యానీ బాగుందని ముఖ్యంగా అందులోని మేకపోతు ముక్కలు మరీ బాగున్నాయని ఐ.జి దొరవారు తెగమెచ్చుకున్నారు. వచ్చిన సర్పంచ్ తదితర ప్రజాప్రతినిధులంతా యస్.ఐ.ని ఆకాశానికెత్తారు. ఇటువంటి యస్.ఐ.ని గతంలో చూడలేదని శాంతి భద్రతలు బాగున్నాయని, పేదవారికి స్టేషన్‌లో న్యాయం జరుగుతుందని తెగమెచ్చుకున్నారు. ఐ.జి.గారు తృప్తిగా తూలుతూ కారు దగ్గరకు నడిచారు.

అక్కడ పట్నంలో పెద్ద కార్పోరేటు హాస్పిటల్ వారు చావుబతుకుల మధ్య పొట్టవుబ్బి గుడ్లు తేలేసిన బక్కమ్మను అనుకున్న సమయానికి డబ్బులు కట్టలేదని ట్రీట్‌మెంట్ బంద్‌చేసి బజారుపడవేసిన హాస్పిటల్ సిబ్బంది. మేకపోతుల జాడతెలువక ఎక్కడా అప్పు పుట్టక వట్టి చేతులతో వచ్చిన బక్కయ్య. అపస్మారక స్థితిలో బజారులో పడివున్న బక్కమ్మను చూసి బోరున విలపించాడు. ఏడుస్తూ భార్య పక్కన కూలబడ్డాడు.

❐

## కవిత

# ఇంత దూరం గడిచాక

- డా॥ సి. భవానీదేవి
9866847000



రకరకాల మలుపులు తిరుగుతూ
దూరదూరాల స్టేషన్లలో ఆగుతూ
అందరిలాగే నాది కూడా
గమ్యం తెలీని నిరంతర రైలు ప్రయాణం!

ఎప్పుడు ఈ రైలెక్కానో నాకే గుర్తులేదు
ఈ ప్రయాణానికి నాకీ టికెట్‌ను
కొనిచ్చింది అమ్మా నాన్నే!
వాళ్ళు కూడా కొంత దూరందాకా
నాతో ప్రయాణిస్తూనే కన్పించారు
కానీ హఠాత్తుగా ఏదో స్టేషన్లో
నన్నేకాకిని చేసి నిశ్శబ్దంగా దిగిపోయారు

కొంతదూరం గడిచాక
ఎవరెవరో ప్రయాణీకులు రైలెక్కారు
స్నేహితులు.. కుటుంబసభ్యులు.. ఎందరో
జీవితమంత ప్రేమని దోసిళ్ళ నిండా పోశారు
అనుకోకుండా శాశ్వత శూన్యాన్ని మిగిల్చి
కొంతమంది మౌనగాయాలతో

మరికొందరు వీరమరణం పొందినవాళ్ళల్లా
ఎప్పుడు దిగిపోయారో కూడా తెలీకుండా
కాలాన్ని కన్నీళ్ళతో రగిలిస్తూ వెళ్ళిపోయారు

కరిగిపోయిన స్వప్న జ్వలనాలు
విచిత్రానుభూతులు, హలోలు, వీడ్కోళ్ళు

అన్నీ మోసుకుంటే వెళ్ళే కర్మయోగి రైలు
ప్రేమ.. సేవ.. మానవీయ విలువలతో
ఈ బాధ్యతాయుత ప్రయాణాన్ని
సుఖవంతంగా నిర్వర్తిస్తామని
సహ ప్రయాణీకులందరికీ భరోసా ఇస్తాంగానీ
ఇంతకీ.. ఈ అగమ్య గమ్యయానంలో
నేనెక్కడ దిగిపోతానో నాకే తెలీదు గదా!

అందుకే..
వీలయినంత హాయిగా అందరితో గడిపేస్తూ
క్షమిస్తూ చేయూతనిస్తూ సాగిపోతున్నాను
నేను కూర్చున్న సీటు ఖాళీ చేయాల్సి వచ్చినప్పుడు
నా తర్వాత కూడా ప్రయాణించే వాళ్ళందరికీ
నా గురించిన అందమైన స్మృతుల పుష్పగుచ్ఛాన్ని
అందించి పోవాలనుకుంటున్నాను.

ఇంతకాలపు ఆలోచనల్ని కలబోసుకుంటూ
కలిసిమెలిసి ప్రయాణించిన వాళ్ళందరికీ
తడికళ్ళతో...
తుది ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నాను

నేను దిగే స్టేషన్ ఎప్పుడొస్తుందో
నాకే తెలీదు కాబట్టి
ఇంత దూరం గడిచాక
నా మనసు మాటల్ని పంచుకోకుండా దిగిపోతే
ఇంతటి నా ప్రయాణమూ అసంపూర్ణమే కదా!

# గురజాడ శతవర్ధంతి కార్యక్రమాలు

**కె. రమాదేవి**



**అనంతపురంలో నవంబరు 30న వివిధ సంఘాల ఆధ్వర్యంలో గురజాడ శతవర్ధంతి ర్యాలీ, గురజాడ దేశభక్తి గేయాలాపన, సభలో పాల్గొన్న ప్రముఖ రచయిత సింగమనేని నారాయణ, మహిళా సంఘాల ప్రతినిధులు, వివిధ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు**

**నూ**ట యాభయ్యవ జయంతిని ఘనంగా నిర్వహించుకున్న ఆంధ్రరాష్ట్రం నూరవ శత వర్ధంతి సందర్భంగా గురజాడకు మహోన్నత నివాళి సమర్పించింది. ఆధునిక స్త్రీ చరిత్ర లిఖిస్తుందన్న దూరదృష్టిని, అసమానతలు లేని సమాజావిష్కరణను కలలుగన్న గురజాడ అడుగుజాడలలో అడుగు కలిపేందుకు చిన్నారుల నుండి తలపండిన కవిశ్రేష్ఠుల వరకు ముందుకు వచ్చారు.

ఆర్థిక విధానాలలో వచ్చిన మార్పులు మహిళా జీవితాలను ఆగం చేస్తున్నాయి. సాంస్కృతిక క్షీణత అడుగడుగునా సాక్షాత్కరిస్తుంది. ఢిల్లీలో ఉద్యోగిని, హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ యువతి, ఏలూరులో 7 ఏళ్ళ పసికందు, తిరుపతిలో కన్నకొడుకే తాగుబోతై కన్నుగానని కామంతో తల్లిని బలిగొన్నాడు. మహిళలపై ఇంటా బయటా హింస పెరిగిన నేపథ్యంలో "గురజాడ స్ఫూర్తితో మహిళలపై హింసను ప్రతిఘటిద్దాం" అన్న పిలుపుతో ఐద్వా విస్తృత కార్యక్రమాలను నిర్వహించింది.

గురజాడ జయంతి సెప్టెంబరు 21న మొదలుపెట్టి నవంబరు 30 వరకు అవిఘ్నంగా పాఠశాలల్లో, విద్యాలయాల్లో ఆయా ప్రాంతాలలో సభలు, సాహితీగోష్ఠులు, గీతాలాపన తదితర కార్యక్రమాలలో పిల్లలు పెద్దలు పాల్గొన్నారు. కార్యక్రమాల నిర్వహణ కోసం 24 సంఘాలు 10మంది మేధావులతో కలసి ఐక్యవేదిక ఏర్పడింది. గురజాడ రచనలన్నింటా స్త్రీల సమస్యలను సృజించారు. ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా, సమస్యలను అధిగమించే ప్రయత్నం చేసిన అతివలుగా, అన్యాయాలను ప్రతిఘటించే వ్యక్తులుగా, మానవతా మూర్తులుగా చిత్రీకరించారు. ప్రస్తుత నేపథ్యంలో స్త్రీల సమస్యలను ప్రస్తావిస్తూ గురజాడ రచనలలో స్త్రీ పాత్రల విశ్లేషణతో వచ్చిన లబ్ధ ప్రతిష్ఠులైన రచయితల వ్యాసాలను "దార్శనికుడు గురజాడ" పేరుతో ప్రచురించింది. ఈ సంకలనం మంచి ఆదరణ పొందింది.

సెప్టెంబరు '21' న ఆయా పాఠశాలల్లో గీతాలాపన చేశారు. ప్రతిజ్ఞా కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయనగరం జిల్లాల్లో మహిళా సంఘం, ఉపాధ్యాయ సంఘాలు అత్యధిక పాఠశాలల్లో గీతాలాపన చేసి గురజాడకు ఘన నివాళి అర్పించారు. రాష్ట్రవ్యాపితంగా ప్రతి జిల్లాలోనూ సెమినార్లు నిర్వహించి విద్యార్థులలో గురజాడ నవ్యమార్గాన్ని చర్చనీయాంశం చెయ్యగలిగాం. తదనంతరం ఏర్పడిన ఐక్యవేదిక కాలేజీలలో సెమినార్లు, సదస్సులు నిర్వహించాలని, స్కూళ్లల్లో గీతాలాపన చెయ్యాలని, వ్యాసరచన, వక్తృత్వ మరియు పాటల పోటీలు నిర్వహించాలని, 20 నుండి 30 వరకు ప్రదర్శనలు, సభలు నిర్వహించాలని కార్యాచరణ రూపొందించుకున్నాం.

అనంతపూర్‌లో ఐద్వా, ఎస్ఎఫ్ఐ, సాహితీ స్రవంతి కలిసి ప్రత్యేకంగా కవులు, రచయితలను ఆహ్వానించారు. వారి ఆధ్వర్యంలో ఆగస్టు 22న 4 విభాగాలుగా రోజంతా గురజాడ రచనల్లోని విశిష్టత ప్రస్తుత సమాజానికి కూడా ఏవిధంగా అవసరమో ఆసక్తికరమైన చర్చ జరిగింది. అనేకమంది కవులు, రచయితలు పాల్గొన్న ఈ సభలో సింగమనేని ఆధ్వర్యంలో రాచపాళెం, డా॥ శ్రీదేవి, సంజీవమ్మ లాంటి అనేకమంది పెద్దలు పాల్గొనడం సాహితీ అభిమానులతో పాటు అభ్యుదయ

మేధావులకు కూడా ఉత్సాహాన్ని కలిగించింది.

తిరుపతి పట్టణంలో జయంతి రోజున 2,500 మంది విద్యార్థులతో బహిరంగంగా దేశభక్తి గీతాన్ని ఆలపించి శతవర్ధంతి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మహిళా రచయితలను తిరుపతి పట్టణంలో వివిధ రంగాలలో ప్రముఖులుగా ఉన్న మహిళలను, ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్, తెలుగు అధ్యాపకులు, వివిధ సంఘాలను కలుపుకుని ఐక్యవేదిక ఏర్పడింది. దాదాపు నెల రోజులు పాటు ఆయా విద్యాలయాల్లో విద్యార్థులకు, పోటీలు, సభలు ఏర్పాటు చేశారు. వదిలిపెట్టని వర్షాలు ఆటంకం కల్గించినా తిరుపతిలోని మహతి స్టేడియం వేలాదిమంది విద్యార్థులు సభకు హాజరై అపూర్వ సన్నివేశాన్ని ఆవిష్కరించారు. పుత్తడి బొమ్మ పూర్ణమ్మ నృత్యాభినయంతో ప్రారంభమైన సభ ఆద్యంతము ఆసక్తిగా సాగింది. కొలకలూరి మధు జ్యోతి గారు ప్రారంభించిన ఈ సభలో తెలుగు భాషా సమితి అధ్యక్షులు శ్రీదేవి, ప్రముఖ వైద్యులు ప్రశాంతి, కళాశాల కరస్పాండెంట్ సుచరిత మరెందరో ప్రముఖులు ఈ సభలలో భాగస్వాములయ్యారు. ప్రజానాట్యమండలి, యువజన సంఘం, ఐద్వాతో పాటు ఈ సభలు జయప్రదం చేయటానికి కృషి చేశారు.

సాహితీ స్రవంతి ప్రత్యేక చొరవతో శ్రీకాకుళంలో అత్యంత ఉత్సాహపూరితంగ ఉత్తరాంధ్ర ప్రముఖులందర్నీ భాగస్వాములను చేసి డేలాంగ్ సభను బ్రహ్మాండంగా నిర్వహించారు. గురజాడ మనవరాలు... ఆధ్వర్యంలో ఏర్పడిన వేదిక ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా వ్యాపితంగా కార్యక్రమాలు నిర్వహించడమేగాక 25నుండి 30వ తేదీ వరకు విజయనగరంలో వివిధ కార్యక్రమాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన సభలో పాల్గొన్న మంత్రివర్యులు పల్లె రఘునాథరెడ్డి గారు గురజాడ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటిస్తుందని హామీ ఇచ్చారు.

విశాఖ నగరంలో 169 సంఘాలు కలిసి నవంబరు 29న ఆంధ్రా యూనివర్శిటీలో సభను అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఉత్తరాంధ్ర ప్రముఖులే గాక రాష్ట్రంలోని ప్రముఖులంతా పాల్గొన్నారు. ప్రముఖ రచయిత్రి ఒల్గా, తెలకపల్లి రవి, జగద్ధాత్రి, అరసం, విరసం ప్రముఖులు, మేడిపల్లి రవికుమార్, కుప్పం యూనివర్శిటీ నుండి శ్రీదేవి తదితరులందరూ పాల్గొని అనేక అంశాలను చర్చనీయాంశం చేయడమే గాక నిరంతరం ఉత్తేజపరచే ప్రజాశక్తి బుక్ హౌస్ ప్రచురించిన గురజాడ రచనలు ఆవిష్కరణలు జరిగాయి. ప్రజానాట్యమండలి ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. గురజాడ పుట్టిన రాయవరం నుండి, గురజాడ కేంద్రంగా మారిన రాజాం వరకు ఆంధ్రరాష్ట్రంలో అన్ని ప్రాంతాలలో జరుపుకోవడమేగాక ఈ శతవర్ధంతిని ఢిల్లీలోని ఆంధ్రాభవన్‌లో కూడా జరుపుకుని సంపూర్ణత్వాన్ని సమకూర్చుకున్నాం.

ప్రజాస్వామిక రచయిత్రుల సంఘం కార్యదర్శి కె.ఎన్. మల్లీశ్వరి, కథా సాహితి ఎడిటర్, వాసిరెడ్డి నవీన్, సింగమనేని తదితర పెద్దలు, వివిధ రంగాలలోని ప్రముఖులు, అన్ని మహిళా సంఘాలు ఈ కార్యక్రమాలన్నింటా భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన కథల పోటీలలో 36 మంది రచయితలు తమ రచనలను పంపించారు. జయంతి సందర్భంగా 26 కాలేజీలు 8,500 మంది సెమినార్లలో పాల్గొనగా నవంబరు 30 వరకు 460 విద్యాసంస్థలలో లక్షమందికి పైగా విద్యార్థులు ర్యాలీలలో, గీతాలాపనలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమాలలో పాల్గొన్న సాంప్రదాయ వాదులనుకున్న వారు కూడా గురజాడ నవ్య మార్గమే నేటి మార్గమని అదే భారతీయ సాంప్రదాయమని నొక్కి వక్కాణించారు. వామపక్ష ఉద్యమాభిమానులందరూ మనస్ఫూర్తిగా ఈ కార్యక్రమాలలో వివిధ రూపాలలో భాగస్వాములయ్యారు. గురజాడను 'టార్చ్‌లైట్' గా, 'మార్గదర్శి' గా ముందుకు సాగాలనే భావన అన్ని చోట్లా వ్యక్తమయింది. గురజాడ రచనలను పాఠ్యాంశాలలో భాగంగా ఉండాలని ఆకాంక్షించారు. జాతీయగీతం గానే కాదు అంతర్జాతీయ గీతంగా ఉండదగిన దేశ భక్తి గీతాన్ని రాష్ట్ర గీతంగా నైనా ప్రకటించాలన్న కోర్కె బలపడింది.

ఐద్వా కృషిని అందరూ అభినందించటమే గాక ఆయా కళాశాలలోని మహిళా అధ్యయన వేదికలలో ఐద్వా భాగస్వామిగా ఉండాలని కోరారు. ఐద్వా కార్యాచరణకు తమ కలం తోడుగా ఉంటుందని తద్వారా కులం, మతం, ఆడ మగా లాంటి అసమానతలను అధిగమించి "ఎల్లలోకంబొక్క ఇల్లై" సమభాగంగా ముందుకడుగు వేద్దామని ఎందరో సాహితీ మిత్రులు ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలి. మహోన్నత రచనల అమృత ఫలాల్ని అందుకోవాలని ఐద్వా ఆకాంక్షిస్తూ ఈ మహత్తర కృషిలో భాగస్వాములైన అందరికీ నమస్సుమాంజలి.

## నివేదిక

# మహాకవికి నీరాజనం

- నూనెల శ్రీనివాసరావు
9492970231




విశాఖలో నవంబర్ 29న జరిగిన గురజాడ శతవర్ధంతి సభలో గురజాడ రచనలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

వట్టిమాటలు కట్టి పెట్టోయ్, గట్టిమేలు తలపెట్టవోయ్” అన్న గురజాడ సూక్తులకు భిన్నంగా ప్రధాని నరేంద్ర మోడీ వ్యవరిస్తున్నారని సాహితీస్రవంతి రాష్ట్రఅధ్యక్షులు తెలకపల్లి రవి అన్నారు. శతాధిక సాహిత్య, సాంస్కృతిక, కళా సామాజిక సంస్థల అధ్వర్యంలో విశాఖలో నవంబర్ 29న ఆంధ్ర విశ్వవిద్యాలయం అంబేద్కర్ అసెంబ్లీహాలులో జరిగిన గురజాడ శతవర్ధంతి సభలో ‘గురజాడ – అధునిక భావాలు’ సదస్సుకు అధ్యక్షత వహిస్తూ ఆయన మాట్లాడారు. మానవ జీవితంలో దేనికైనా కొలబద్ద కన్యాశుల్కమన్నారు. గతంలోని మంచిని తీసుకుంటూ భవిష్యత్‌లో అడుగులు వేయాలనేది గురజాడ సూక్తని తెలిపారు. ఈ సదస్సు ప్రారంభంలో మాజీ వైస్ ఛాన్సలర్ కె.వి.రమణతో పాటు పలువురు ప్రముఖులు గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సదస్సులో శాసనమండలి సభ్యులు ఎం.వి.ఎస్ శర్మ, ఓల్గా, మోతుకూరు నరహరి, మేడిపల్లి రవికూమార్ మాట్లాడారు. అనంతరం గురజాడ రచనలు కన్యాశుల్కం, దిద్దుబాటు కథానికలు, దేశభక్తి గేయాలు, ఆవంత్స సోమసుందర్ రచన ‘ఆధునిక సాహిత్య వైతాళికుడు గురజాడ, తెలకపల్లి రవి రచన గురజాడ యుగస్వరం, పెన్నేపల్లి గోపాలకృష్ణ రచన మధురవాణి ఊహాత్మక ఆత్మకథ, మందలపర్తి కిశోర్ రచన కన్యాశుల్కం పలుకుబడి తదితర పుస్తకాలను ఆవిష్కరించారు. గురజాడ శతవర్ధంతిని పురస్కరించుకుని సాహిత్య ప్రస్థానం మాసపత్రిక వెలువరించిన ‘గురజాడ ప్రత్యేక సంచిక’ను కూడ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకులు తుషార్ రూపొందించిన “మహాకవి – గురజాడ” యానిమేషన్ చిత్రం ట్రైలర్‌ను ప్రదర్శించారు. సభకు హాజరైన ప్రసిద్ధ ప్రజా గాయకుడు వంగపండు “తుమ్మెద తుమ్మెద” అంటూ గురజాడపై పాడిన గేయం అందరిలో ఉత్తేజం నింపింది.

మధ్యాహ్నం భోజనం విరామం తరువాత రెండవ సదస్సు “గురజాడ రచనలు – సమకాలీనత” అట్టాడ అప్పలనాయుడు సభాధ్యక్షతన జరిగింది. ప్రొ॥ చందు సుబ్బారావు, చాగంటి తులసి, రామతీర్థ ప్రసంగించారు. మూడవ సదస్సుగా “గురజాడ రచనలు మహిళలు” కె. రమాదేవి సభాధ్యక్షతన జరిగింది. కృష్ణాబాయి, జగద్ధాత్రి, అయ్యగారి సీతారత్నం, కిన్నెర శ్రీదేవి ఉపన్యసించారు.

చివరిగా నాల్గవ సదస్సులో సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. గురజాడగీతం బాలె, దిద్దుబాటు స్కిట్, పుత్తడిబొమ్మ పూర్ణమ్మ రూపకం, గురజాడ బాట నృత్యం, డామిట్ కథ అడ్డం తిరిగింది రూపకం ఒకటి తరువాత మరొకటి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. సభికుల హర్షధ్వానాలతో ఆ ప్రాంగణం దద్దరిల్లేట్లు కళారూపాలు ప్రదర్శించారు.

ఏయూ అసెంబ్లీహాలు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రముఖ రచయితల ఫొటో ఎగ్జిబిషన్‌ను రచయిత్రి చాగంటి తులసి ప్రారంభించారు. ప్రజాశక్తి బుక్‌హౌస్



నిర్వహించిన పుస్తక ప్రదర్శనను ప్రముఖ రచయిత్రి ఓల్గా ప్రారంభించారు. విశాఖపట్నంలో కనీవిని ఎరుగనిరీతిలో జరిగిన ఈ సభను దాదాపు నూటా అరవై తొమ్మిది సంస్థలు కలసి నిర్వహించాయి. అందులో ఉత్తరాంధ్రలోని సాహిత్య, సాంస్కృతిక, కళా సంఘాలతో పాటు మహిళా సంఘాలు ఐద్వా మొదలైనవి కీలక పాత్ర పోషించడం విశేషం. ప్రజానాట్యమండలి నాయకులు వై.అప్పారావు, ఐద్వానాయకురాలు ప్రభావతి, సాహితీ స్రవంతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వొరప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్, విశాఖ కార్యదర్శి నూనెల శ్రీనివాసరావు, అధ్యక్షులు ఏ.వి.రమణారావు, గౌరవాధ్యక్షులు ఎన్.రమణాచలం, సభ్యులు శివకోటి నాగరాజు, చంద్రికారాణి సభా ఏర్పాట్లను నిర్వహించారు. సభ విజయవంతంగా ముగిసింది.

**సభలో ప్రముఖుల ప్రసంగాలు క్లుప్తంగా :**

గురజాడ అంటే ఇప్పటి ప్రభుత్వాలకు సైతం భయం. రాజధాని అంటే చంద్రబాబు 'మట్టి' అనే సమాధానం చెబుతున్నారు. దేశమంటే మట్టికాదోయ్ మనుషులోయ్ అని గురజాడ చెప్పారు. దేశాన్నయినా, రాజధానినైనా మనుషులుగా చంద్రబాబు గుర్తించాలి. ప్రపంచ భాషలలో ముఖ్యమైనది తెలుగు భాషకు ప్రాచీన హోదాతో పాటు బోధన భాషగా, పరిశోధన భాషగా గుర్తించాలి. గురజాడ జన్మస్థలం ఎస్.రాయవరం, అలాగే గురజాడ నివాస ప్రాంతం విజయనగరాన్ని పర్యాటక కేంద్రాలుగా గుర్తించాలి. గురజాడ వ్యవహారిక భాష ఉద్యమం చేయకుంటే సంస్కృతమే చదువుకోవాల్సిన దుస్థితి మనకెదురయ్యేది. తెలుగుపై ప్రభుత్వమే ఇప్పుడు కొత్త దాడి చేస్తుంది. ఇంగ్లీషులోనే పాఠాలు చెబుతామని, అదేదో పెద్ద ఎచీవ్‌మెంట్‌లా ప్రకటన చేస్తోంది. తెలుగును ఓ మృతభాషగా మార్చేందుకు జరుగుతున్న దాడిని గుర్తించాలి

**– ఎం.వి.ఎస్ శర్మ,** శాసన మండలి సభ్యులు

దేశాన్ని ప్రేమించమని ఎవరూ గురజాడ కంటే ముందు చెప్పలేదు. గతంలోని అంశాలకు భిన్నంగా భవిష్యత్‌లో వేసే అడుగును ఆయన కోరుకున్నారు. గతంలో వున్న ఫ్యూడల్ వ్యవస్థను అధిగమించడం ఆధునిక, మేథ్స్‌లో పరిష్కారాలకు సూత్రాలున్నట్లే, సాహిత్యంలో సంక్లిష్టతలకు గురజాడ రచనలు పరిష్కారాలు, సాహిత్య వారసత్వాన్ని అందించడంలో ఆయన మూలపురుషుడు, చాలా తక్కువ రచనలు చేసి ఎక్కువ మంది మన్ననలను ఎక్కువ కాలం పొందిన మహనీయుడు సమాజం ఆయనకు బిడ్డలాంటిది. తాను చెప్పాలనుకున్నదంతా నాటకాల ద్వారా చెప్పాడు.

**– మేడిపల్లి రవికుమార్,** ఎస్.వి. యూనివర్సిటీ ప్రొఫెసర్

గురజాడ సాహిత్యంలో అన్ని ప్రక్రియల్లో అసమ్మతిని వినిపించారు. విష సంస్కృతిని అంతం చేయాలన్నారు. కన్యాశుల్కంలో మధురవాణి పాత్ర, పూర్ణమ్మ, కన్యక ఇలా అన్ని పాత్రలు తమ అసమ్మతిని తెలియజేస్తాయి. గురజాడ

సాహిత్యం సామాజిక అవసరం. బ్రిటీష్ ప్రభుత్వం వితంతు పునర్వివాహం చట్టం చేసి బాల్య వివాహం చేసుకోవచ్చని వదిలేసింది. బాల్య వివాహాల రద్దుకు చట్టం చేయలేదని తన అసమ్మతిని కన్యాశుల్కంలో తన పాత్రల ద్వారా తెలియజేశారు. కన్యక పాత్ర అగ్గిలోకి దూకి నిరసన తెలియజేస్తుంది. అసమ్మతిని ప్రకటించేదే ఆధునిక స్త్రీ. స్త్రీలే సమాజాన్ని మారుస్తారు, సంస్కరిస్తారని ముందుగా చెప్పిన మహాకవి గురజాడ. **- ఓల్గా,** ప్రముఖ రచయిత్రి

సర్వేపల్లి రాధాకృష్ణన్ మగవాడి గురించి ఓ మాట అన్నారు. మగాడు సగం పశువు, సగం పిల్లాడు అని, పశువును మచ్చిక చేసేది, బిడ్డకు శిక్షణ ఇచ్చేది మహిళే. అ మగాడ్ని సంస్కరించేది మహిళే. కట్టుబొట్టులో అధునికత వైపు అడుగులు వేస్తున్నాం, ఆధునికత గురించి వందేళ్ళ క్రితమే చెప్పిన మహనీయుడు గురజాడ, గిడుగు, కందుకూరి, గురజాడను, త్రిమూర్తులుగా పిలిచేవారు.

**- మోతుకూరి నరహరి,** రచయిత

గురజాడది అంతర్జాతీయ స్థాయి. గురజాడ గురించి లోతైన పరిశోధనలు నేడు అవసరం, అయన స్ఫూర్తిని నిలబెట్టినప్పుడే సాంస్కృతిక స్థాయి ఒక మెట్టు పైకెళుతుంది.

**- మందలపర్తి కిశోర్,** జర్నలిస్టు

'దేశమును ప్రేమించుమన్నా' అన్న గీతం గురజాడలోని అంతర్జాతీయతను సూచిస్తుంది. భారతీయతే మతం అని నేటి ప్రధాని చెబుతున్నారు. దేశంలో భారతీయతను మతంగా స్వీకరించేవారున్నారా? కథా కావ్యాల్లో ఆఖరి వాడిగా, ఆధునిక కవుల్లో తొలివాడిగా గురజాడ మిగిలిపోయారు.

**- రామతీర్థ,** విమర్శకులు

దేశమును ప్రేమించుమన్నా గీతం ప్రతీ సభలోను పాడే సాంప్రదాయాన్ని కమ్యూనిస్టు పార్టీ మాత్రమే తీసుకుంది. రాజావారి సంస్థానంలో ఉంటూనే స్త్రీల పట్ల రాజులకుండే నైజాన్ని కన్యక కావ్యం ద్వారా చెప్పిన ఘనుడు గురజాడ. మేధావులతో పాటు సామాన్యులందరికీ గురజాడ చేరువ అయితే సమాజంలో మార్పులు వస్తాయి.

**- కృష్ణబాయి,** విరసం

కులాన్ని వదిలేశారు కాబట్టే గురజాడ బ్రాహ్మణత్వాన్ని విమర్శించగలిగారు. ఆడ-మగ మధ్య లైంగిక సంబంధాలనే ప్రస్తుతం చూస్తున్నారు అలాకాకుండా స్నేహాన్ని చూడగలిగేంత చైతన్యం రావాల్సి ఉంది. వేశ్యల్లో మానవత్వాన్ని చూపించిన ఘనత గురజాడకే దక్కింది.

**- అయ్యగారి సీతారత్నం,** ఎవిఎస్ కాలేజి లెక్చరర్

సమాజాన్ని మార్చే సెన్సివిటీ మహిళల్లోనే ఉందని కన్యాశుల్కం ద్వారా గురజాడ చెప్పారు. ఆ నాటకంలో మధురవాణి అనే పాత్రను ఆధునిక మహిళగా చూపించడం అందులో భాగమే. **- జగద్ధాత్రి,** కవయిత్రి

గురజాడ శతవర్ధంతి ఇంత పెద్దఎత్తున జరగడం చాలా సంతోషం. గురజాడ భావాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్ళవలసిన అవసరం ఈ రోజు మరింతగా పెరిగింది.

**- ప్రొ॥ చందు సుబ్బారావు,** విమర్శకులు



**కడపలో డిసెంబర్ 18న సాహిత్య ప్రస్థానం గురజాడ శతవర్ధంతి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో సాహితీస్రవంతి కడప జిల్లా కన్వీనర్ మస్తాన్ వలి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తవ్వా సురేష్‌రెడ్డి, రాయలసీమ మహాసభ జిల్లా అధ్యక్షుడు ఖలందర్, మహమ్మద్, మోహన్ రెడ్డి, సూర్కళ, రవిశంకర్,**



**డిసెంబర్ 18న హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో 2015 సంవత్సరానికి 'పూలండోయ్ పూల్' కవితా సంపుటికి ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు అందుకుంటున్న డా॥ ప్రసాదమూర్తి. చిత్రంలో శీలావీర్రాజు , దేవీప్రియ తదితరులు**

## నివేదిక

# సాహితీస్రవంతి శ్రీకాకుళం జనకవనం

చింతాడ రామారావు (సిరా)
9866087709




శ్రీకాకుళంలో నవంబర్ 22న సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జరిగిన జనకవనం

జనకవనానికో, కవితల పోటీకో లేదా ఏదేనీ కల్పిత సందర్భానికో అప్పటికప్పుడు ఏదో ఒకటి రాసి తెచ్చి వేదికనెక్కి చదివేస్తే కవిత్వం కాజాలదని, రచనా వ్యాసంగమనేది నిరంతరం కొనసాగిస్తూ ఉండాలని, అందుకు సాహిత్యకారుడు సమాజాన్ని , సాహిత్యాన్ని లోతుగా అధ్యయనం చెయ్యాలని ప్రముఖ కవి డా॥ కె. శివారెడ్డి అన్న మాటలు సాహిత్యోద్యమకారులను ఆలోచింపజేసాయి. నవంబర్ 22 న బాపూజీ కళామందిరం శ్రీకాకుళంలో మహాకవి గురజాడ అప్పారావు శత వర్ధంతి సందర్భంగా 'సాహితీ స్రవంతి' శ్రీకాకుళం జిల్లా శాఖ అధ్వర్యంలో జరిగిన జనకవనం ప్రారంభ సభలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. వర్తమానంలో ప్రజల జీవన విధానంలో చోటు చేసుకున్న సంక్లిష్టతలను పరిశీలించాలని, శిల్పి శిల్పం చెక్కినట్లు భావ స్పందనను చిక్కగా చక్కగా అల్లి కవితను తీర్చిదిద్దాలని, కవిత్వం అతి జాగరూకతగా ఒకటికి పదిమార్లు చూసుకొని ప్రజల మధ్యకు పంపాలని ఉద్బోదించారు.

కాలంతోపాటు నడిచేవాడు మనిషి, కాలం కన్నా ముందుండేవాడు మనీషి, కాలాన్ని శాసించేవాడు యుగకర్త గురజాడ అప్పారావు మూడోరకం వాడని సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు తెలకపల్లి రవి అన్నారు. 'దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్' అంటే కేవలం భౌగోళిక స్వరూపం మాత్రమే దేశం కాదని మనుషులతో కూడినదే దేశమని అన్న అప్పారావు పలుకులు శాశ్వత సత్యాలన్నారు. నేటి కార్పొరేట్ అనుకూల పాలకులు ప్రజల నుండి భూములు లాగేసి మట్టినుండి మనిషిని వేరు చేస్తున్న వైనాన్ని నూటయాభై ఏళ్ళ క్రింద ఆ మహాకవి పసిగట్టాడో ఏమో అంతటి సత్యాన్ని వెలువరించాడని అన్నాడు. ఉత్తరాంధ్ర అంటే ఉత్తమాంధ్ర, ఉజ్వలాంధ్ర, ఉత్తేజాంధ్ర, ఉద్యమాంధ్ర అని, చిక్కోలు అంటే పాలకులను చీకాకు పెడుతూ దిశానిర్దేశం చేసేదని శ్రీకాకుళాన్ని కొనియాడారు. శ్రీకాకుళ సాయుధపోరాట కాలం నుండి ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించి ప్రజలను చైతన్యవంతుల్ని చేయడంలో అలుపెరుగని కృషి సలుపుతున్న కామ్రేడ్ చౌదరి తేజేశ్వరరావు సభకు హజరుకావడం ముదావహమని అన్నారు.

డా॥ బి.ఆర్. అంబేద్కర్ విశ్వ విద్యాలయం ఉపకులపతి హనుమంతు లజపతిరాయ్ మాట్లాడుతూ "వట్టి మాటలు కట్టి పెట్టోయ్ గట్టిమేల్ తలపెట్టవోయ్" అన్న గురజాడ కవిత్వం యువత ఆకళింపజేసుకోవాలని, ఆయన బోధనలు ఆధారం చేసుకొని తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు.

రాజోద్యోగియై యుండి రాజరికాన్ని ప్రశ్నించి, సనాతన కులంలో పుట్టి అందలి అవలక్షణాలు ఎండగట్టి సామాజిక రుగ్మతలు పారద్రోలడానికి నాటకం, కవిత్వం కథ, గల్పిక వంటి ప్రక్రియలను అత్యంత సమర్థవంతంగా, అత్యుత్తమంగా నిర్వహించినవాడు గురజాడ అని, అందుకే అతను మహాకవి అయినాడని విమర్శకులు డా॥ రామతీర్థ పేర్కొన్నారు. సాహితీ స్రవంతి శ్రీకాకుళం జిల్లా కన్వీనర్ చింతాడ రామారావు (సిరా) అధ్యక్షతను జరిగిన ఈ సభలో కథారచయిత అట్టాడ అప్పలనాయుడు స్వాగతోపన్యాసం చేసారు. ఈ సందర్భంగా



బెందాళం కృష్ణారావు, అన్నీ వేదాలలో ఉన్నయషను బి.వి.ఎ. రామారావు నాయుడులు పరిచయం చేసారు.

అనంతరం సాహితీస్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్, ప్రజా సాహితి సంపాదకులు పి.ఎస్. నాగరాజులు జనకవనాన్ని నిర్వహించారు. అధికార నీలకంఠం, ఈ వేమన కె.వి. రాజారావు వంటి అనుభవజ్ఞులైన కవులే కాకుండా కంచరాన భుజంగరావు, పప్పుల వైకుంఠరావు, పి.ఎస్. శ్రీనివాస్, సిరికి స్వామినాయుడు, డా.పి. జగదీశ్, నెట్టిమి రమణరావు, చంద్రికారాణి, అనురాగ నిలయం ప్రసాద్ వంటి 108 మంది కవులు తమ కవిత్వాన్ని ఆసక్తిదాయకంగా వినిపించారు. గజల్ గాయకులు ప్రధాన ఆదినారాయణ, కవి గాయకుడు సన్నశెట్టి రాజశేఖర్ పాడిన 'సిరా' ప్రజా గజళ్ళు ఆహుతులను ఉత్తేజపరిచాయి.

ప్రముఖ కార్మిక నాయకులు వి.జి.కె. మూర్తి ముగింపోపన్యాసం చేయగా వర్ధమాన రచయిత్రి పరిమళ వందన సమర్పణ చేసారు. ఉత్తరాంధ్ర నలుమూలల నుండి వెల్లువలా పోటెత్తిన సమకాలీన కవుల జనకవనం కార్యక్రమం ఉదయం 10.00 గంటల నుండి రాత్రి 8.00 గంటల వరకు సాగి ఆహుతులను రసమయ జగత్తులో ఓలలాడించి చేతనజ్యోతులు వెలిగించింది. ప్రజానాట్యమండలి సాంస్కృతిక కార్యక్రమంతో సాహితీస్రవంతి శ్రీకాకుళం జనకవనం ముగిసింది.

కథానిలయం వ్యవస్థాపకులు, ప్రముఖ కథారచయిత, తొంభైవసంతాలు దాటిన కథావృద్ధుడు డా॥ కాళీపట్నం రామారావు (కారా)ను సాహితీస్రవంతి సముచిత రీతిని సత్కరించింది. అందుకు స్పందించిన ఆయన సాహిత్యం సమాజ ఉద్ధరణకోసం రావాలని, తనకు జరిగిన ఈ సత్కార కథకు జరిగినట్టుగా భావించాలని, కథ ప్రజలదైనప్పుడే సమాజం బాగుపడుతుందని అంటూ ఒకింత ఉద్వేగానికి గురియైనారు.

ప్రధాన ఆదినారాయణ రచించిన 'సిక్కోలు నానీలు' పుస్తకాన్ని అట్టాడ అప్పలనాయుడు, శ్రీమతి పత్తి సుమతి రచించిన 'అన్నీ వేదాలలో ఉన్నాయష పుస్తకాన్ని కవి గుప్పాడ రామకృష్ణం నాయుడు ఆవిష్కరించారు. సిక్కోలు నానీలు



**కర్నూలులో జరిగిన గురజాడ శతవర్ధంతి సభలో మాట్లాడుతున్న ఐద్వా నాయకురాలు నిర్మల. చిత్రంలో సాహితీస్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, జిల్లా పోలీస్ అధికారులు, తదితరులు**



**సాహితీస్రవంతి ఆధ్వర్యంలో నంద్యాలలో జరిగిన గురజాడ శతవర్ధంతి సభలో ప్రసంగిస్తున్న మాదాల శ్రీనివాసులు. చిత్రంలో సాహితీస్రవంతి రాష్ట్ర కమిటీ సభ్యులు కెంగార మోహన్, తదితరులు**

## నివేదిక

# సామాజిక సాంస్కృతికోద్యమ వారధి జాషువ

- పివి.రమణ
7396493100



గుంటూరులో గుఱ్ఱం జాషువా 120వ జయంతిని పురస్కరించుకుని ఎ.సి. కాలేజి ఆడిటోరియంలో సెప్టెంబర్ 27న గుఱ్ఱం జాషువా రచనలపై జరిగిన సదస్సు ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథులు

*సకల కార్మిక సమాజముల జీవిత కథా*
*నకము లాలించు కర్ణములు నావి*
*కఠిన చిత్తుల దురాగతముల ఖండించి*
*కనికరమొలికించు కలము నాది*
*దొడ్డపదవులనెక్కి గద్దె మేసెడివారి*
*ఎత్తిపొడుచు చిత్తవృత్తి నాది*
**-జాషువ**

ఆధునిక తెలుగు కవులలో ప్రతిఘటనా చైతన్యానికి ప్రతీకగా నిలిచి కులవివక్షను రచనల ద్వారా ప్రశ్నించిన మొదటి వ్యక్తి మహాకవి, కవికోకిల, నవయుగ కవిచక్రవర్తి గుఱ్ఱం జాషువ. గుంటూరు జిల్లా వినుకొండలో పుట్టి తెలుగు సాహితీ ప్రస్థానంలో తనకంటూ ఒక ప్రత్యేకతను సాధించుకున్న గొప్ప కవి గుఱ్ఱం జాషువ.

జాషువ 120వ జయంత్యుత్సవాలను ఆయన నడయాడిన గుంటూరులో పెద్ద ఎత్తున నిర్వహించాలన్న మా సంకల్పం జయప్రదమైంది. సాంస్కృతిక సాహిత్య సంచలనంగా కొనియాడబడింది.

**జాషువ సదస్సు నేపథ్యం**

2008 నుండి గుంటూరులో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో జాషువ జయంతి సెప్టెంబరు28వ తేదీన జాషువ జ్ఞాపకాలలో ఓ సాయంకాలం, జాషువ స్ఫూర్తితో కవితాగానం, జాషువ పద్యసాహితీ స్వరార్చన పేరుతో కవులు, కళాకారులు కార్యక్రమం నిర్వహిస్తూ ఉండేవారం. విజయవాడలో జరిగిన సివి సమగ్రరచనలు-సమాలోచనల సదస్సు జరిగిన తీరు చూసిన తర్వాత గుంటూరులో కూడా ఆ ప్రాంతపు సమకాలీన కవి జాషువ సమగ్రరచనల సదస్సు జరపాలని అనిపించింది. జాషువ సమగ్ర రచనల యొక్క సారాంశాన్ని నేటి యువ సాహితీవేత్తలకు, సామాజిక ఉద్యమ కార్యకర్తలకు ప్రజానీకానికి అందించటం ఏకైక కర్తవ్యంగా ప్రజానాట్యమండలి, సాహితీస్రవంతి, ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రధాన భూమికగా సామాజిక ప్రజాతంత్ర ఉద్యమ సంఘాలను, జిల్లాలోని జాషువ అభిమాన సంఘాలను భాగస్వామ్యం చేసిపెద్దఎత్తున నిర్వహించాలని అనుకోవడం జరిగింది. దానికి అనుగుణంగా ఉత్సవ కమిటీని, ఆ ఉత్సవ కమిటీకి ఛైర్మన్‌గా మాజీ మంత్రి, జాషువ కళాపీఠం మేనేజింగ్ ట్రస్టీ డొక్కా మాణిక్యవరప్రసాద్, అధ్యక్షులుగా మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, గౌరవ అధ్యక్షులుగా ఎసి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ముత్యం, ప్రధాన కార్యదర్శిగా ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి పివి.రమణ ఎన్నికవ్వడం జరిగింది. సెప్టెంబరు28 జాషువ 120వ జయంతి అయినప్పటికీ 27 ఆదివారం అయితే బాగా జరగటానికి వీలవుతుందని, ఆరోజు ఉదయం 10గంటల నుండి

సాయంత్రం 6గంటలవరకూ నిర్వహించాలని నిర్ణయించటం జరిగింది. మా అందరి సంకల్పానికితోడు ఎసి కళాశాల ప్రిన్సిపాల్, కళాశాల మాజీ తెలుగుశాఖ అధ్యక్షులు, జాషువ వీరాభిమాని డాక్టర్ పి.ముత్యం పూర్తి సహకారంతో వారి కళాశాలనే వేదికగా ఎన్నుకోవటం జరిగింది. ప్రజాశక్తి బుక్‌హౌస్ ఎగ్జిబిషన్ నుండి సదస్సు వరకూ ఎప్పుడు ఏమి కోరితే అది అందుబాటులోకి తీసుకురావడంలో వారి సంపూర్ణ మద్దతు ఇవ్వడంతో కార్యక్రమం దిగ్విజయంగా సాగింది.

**జాషువ రచనలకు అద్దంపట్టిన సదస్సు**

జాషువ సాహిత్యాన్ని అర్థవంతంగా జనానికి వివరించగల సాహితీవేత్తలకు తెలుగునాట కొదవలేదు. జాషువ సాహిత్యంపై కృషిచేస్తూ, స్పష్టమైన అవగాహన



**గుర్రం జాషువా 120వ జయంతి ఉత్సవ బ్రోచర్‌ను మీడియాకు విడుదల చేస్తున్న ఆహ్వాన సంఘం కార్యవర్గం పి.వి. రమణ, డొక్కా మాణిక్య వరప్రసాద్, డా. ముత్యం, కె.ఎస్. లక్ష్మణరావు**

ఉన్న వక్తలను ఆహ్వానించాలని, రెండు తెలుగు రాష్ట్రాలలోని ప్రముఖులను ఆహ్వానించాలని నిర్ణయించుకున్నాము. ప్రారంభానికి ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, ప్రజావాగ్గేయకారులు గోరేటి వెంకన్న, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, కత్తిపద్మారావు, జెడి.శీలం, ఎంవిఎస్.శర్మ, పాశం రామారావు, ఆంద్రమాల్యాద్రి తదితరులను ప్రారంభసభలో పాల్గొన్నారు. వక్తలుగా తెలుగు సాహిత్యం, జాషువ విశిష్టత, జాషువ రచనలు-సామాజికచైతన్యం, జాషువ రచనాశైలి-వస్తు వైవిధ్యం అనే అంశాలపై తెలకపల్లి రవి, ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, కొలకలూరి మధుజ్యోతి, అద్దెపల్లి రామ్మోహనరావు, రావెల సాంబశివరావు, సిఎస్ఆర్.ప్రసాద్, కోయి కోటేశ్వరరావు, బి.వేదయ్య, ఎండ్లూరి సుధాకర్, డాక్టర్ ఎమ్. స్వర్ణలతాదేవి, పెనుగొండ లక్ష్మీనారాయణ, మోదుగుల రవికృష్ణ తదితరులు భాగస్వాములయ్యారు. వక్తలందరిని ఆహ్వానించే బాధ్యతలను, వారిని సకాలానికి రప్పించే సహకారాన్ని, వౌరప్రసాద్, లక్ష్మయ్య సంపూర్ణంగా అందించారు. వివిఐటి విద్యాసాగర్, శర్మగారి సహకారంతో మల్టీకలర్ ఆహ్వాన పత్రాలు ముద్రించటం జరిగింది.

కార్యక్రమ వివరాలను తెలిపే బ్రోచర్‌ను ఆహ్వానసంఘం ప్రధాన నాయకత్వం డొక్కా మాణిక్యవరప్రసాద్, కెఎస్.లక్ష్మణరావు, డాక్టర్ పి.ముత్యం ఆవిష్కరించటం జరిగింది. గోడ పత్రికను బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, భారతిసోప్ వర్క్స్ అధినేత అరుణాచలం మాణిక్యవేలు తదితరులు ఆవిష్కరించటం జరిగింది.

నెలరోజుల నిర్విరామ కృషిఫలితం ఆహ్వానాలను రాష్ట్రంమొత్తం పంపిణీ చేయడంతో పాటు, సోషల్ మీడియాలోనూ, ప్రధాన తెలుగు దినపత్రికలైన సాక్షి, ఆంధ్రజ్యోతి, ప్రజాశక్తి పత్రికలలో ప్రధాన వార్తగా రావడం, అందాల్సిన వారందరికీ సమాచారం సకాలంలో అందించడంతో చేరుకోవల్సిన అతిథులు, ప్రతినిధులు, ఆహ్వానితులు సరైన సమయానికి చేరుకోవటం జరిగింది. 27వ తేదీ ఉదయం 9గంటలకే ఎసి కళాశాల ప్రాంగణం కిక్కిరిసింది. జాషువ కవిత్వంలోని ఉద్రేకాన్ని, ఉద్వేగాన్ని, పరుగుని, బిగువుని ఏమాత్రం సడలకుండా జాషువ పద్యాలను ప్రజానాట్యమండలి కళాకారులు రాజేష్, లెనీనా, కిన్నర్, వినోద్, అనీఫ్ తదితరులు పాటలుగా, హృద్యంగా మలచి ఆలపించడంతో జాషువ సదస్సు ఘనంగా ప్రారంభమైంది.

**ఉత్తేజపర్చిన ఉపన్యాసాలు**

సరిగ్గా ఉదయం 11గంటలకు ప్రారంభమైన సదస్సు సాయంత్రం వరకూ అంతే బిగువుగా, ఉత్సాహంగా జరిగిందంటే పాల్గొన్న ప్రతివక్త జాషువ రచనల విశిష్టతను ప్రజలకు వివరించి, తమ విద్వత్తును ప్రకటించి ఔరా అనిపించుకున్నారు.

**కులవివక్షపై కలమెత్తిన జాషువ : కె.శ్రీనివాస్,**

ఎడిటర్, ఆంధ్రజ్యోతి దినపత్రిక

జాషువాను సామాజిక జీవనంలోకి అన్వయించు కోవల్సిన కర్తవ్యం నేటి యువతరానికి అత్యంత ఆవశ్యం,




**ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించిన జాషువా సాహిత్య విమర్శ సంపుటాల ఆవిష్కరణ**

జాషువ రచనలలో సామాజిక కారుణ్యం ముఖ్యమైంది. తెలుగు పద్య కవిత్వాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చినవారిలో ఆయన ప్రముఖులు. ఎవరూ ఊహించని తీవ్రమైన వ్యక్తిత్వం జాషువాలో ఉంది. దేశం పెద్ద ప్రమాదంలో ఉంది. కొన్ని శక్తులు మితవాదాన్ని అణచివేయటానికి జాతీయ స్థాయిలో కృషిచేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో జాషువాను ఒక స్ఫూర్తిగా, ఆయుధంగా మలచుకోవాలి. ఈ రకమైన సదస్సులు అభ్యుదయ కవిత్వానికి పునరుత్తేజాన్నిస్తాయి. 1995లో జాషువ శతజయంతి కూడా ఇంతటి కోలాహలంగా జరగలేదు.

**బుద్ధుడు నడయాడిన నూతన రాజధాని ప్రాంతాన్ని విదేశీ వాణిజ్య కేంద్రంగా మార్చొద్దు: కత్తిపద్మారావు**

బుద్ధుడు నడయాడిన నూతన రాజధాని అమరావతి ప్రాంతాన్ని విదేశీ వాణిజ్య కేంద్రంగా మార్చడం తగదు. పేదలకు, ధనికులకు మధ్య అంతరాలు, అసమానతలు దీనివల్ల పెచ్చుమీరుతాయి. తెలుగు పద్యాన్ని ఆయుధంగా మల్చుకుని హేతుబద్ధమైన శ్రాస్తీయమైన ఆలోచనలతో గుర్రం జాషువ యుద్ధం చేశారు. సామాజిక సత్యాన్ని అక్షరరూపంలోచూపి ప్రజాహృదయాల్లో స్థానం సంపాదించుకున్నారు. వేమన తర్వాత ఆ తత్వాన్ని కొనసాగించిన మహా వ్యక్తి జాషువ. మొదట గాంధేయవాదిగా ఆయన రచనలు ఉన్నప్పటికీ మలిదశలో అంబేద్కర్ వాదాన్ని వినిపించాడు. తనపై నిప్పులు చెరిగిన కవులపై పిడుగులు కురిపించిన దిట్ట జాషువ.

**కమ్యూనిస్టులు లేకుంటే దళిత విముక్తి జరగదు :**
**గోరెటి వెంకన్న, ప్రజావాగ్గేయకారుడు**

సమాజంలోని పేదల, పీడిత వర్గాల వేదనను జాషువ తన రచనల్లో విన్పించాడు. అంతరానితనం తాండవిస్తున్న సమాజాన్ని చూసి రగిలిపోయాడు. వామపక్ష ఉద్యమం జాషువ సదస్సు జరపటం అద్భుతమైన పరిణామం. సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ వ్యవస్థ దేశాన్ని అధోగతిపాలు చేస్తోంది. వీటిని ఎదిరించేందుకు జాషువ స్ఫూర్తిగా నిలుస్తాడు. జాషువ బ్రతికుంటే నేటి పెట్టుబడి వ్యవస్థపై కవిత్వాన్ని ఆయుధంగా మలుచుకునేవాడు. కమ్యూనిస్టులు లేకుంటే దళిత విముక్తి జరగదు. సామాజిక వామపక్ష దళిత ఉద్యమాలు ఉవ్వెత్తున సాగాల్సిన తరుణమిది.

**ఎఎన్‌యులో జాషువపీఠం ఏర్పాటుచేయాలి**
**:జెడి.శీలం,** రాజ్యసభ సభ్యులు

ఆచార్య నాగార్జు యూనివర్శిటీలో జాషువపీఠం ఏర్పాటుచేయాలి. ఈ విషయాన్ని రాష్ట్రప్రభుత్వాన్ని పదేపదే కోరినా పట్టించుకోలేదు. జాషువ పీఠం ఏర్పాటుకు నా ఎంపి ల్యాడ్స్ నుండి రూ. 10లక్షలు కేటాయిస్తాను. అట్టడుగు వర్గాల వేదనా స్వేదం జాషువ రచనల్లో స్పష్టంగా కనబడతాయి.

**గుంటూరు జిల్లాకు జాషువ పేరుపెట్టాలి:**
**– కెఎస్.లక్ష్మణరావు,** మాజీ ఎమ్మెల్సీ

గుంటూరు జిల్లాకు జాషువ పేరుపెట్టాలి. నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో ఈ సభ జరగటం శుభారంభం. విద్యార్థులకు, నేటి యువతకు జాషువ రచనలు



అందుబాటులో ఉండేవిధంగా జాషువ పరిశోధనా కేంద్రం స్థాపించాలి.

**తెలుగుభాషకు జాషువ సొబగులు అద్దారు :**

**– డొక్కా మాణిక్య వరప్రసాద్,** మాజీమంత్రి

కనుమరుగవుతున్న తెలుగు పద్యానికి జీవంపోసి గొడ్డలి కాపరికూడా గొంతెత్తి కోయిలై, పద్యమాలపించే స్థాయికి తెలుగు పద్యాన్ని తీసుకెళ్లిన ఘనత జాషువాది. తెలుగు భాష బ్రతకాలన్నా, జాషువా పద్యాన్ని చదవాలి. తెలుగు భాష పునర్వైభవానికి జాషువా సాహిత్యాన్ని సాధనంగా ఎంచుకోవాలి.

**ఎసి కళాశాలలో సదస్సు జరగటం చారిత్రక ఘట్టం :**

**– డాక్టర్ పి.ముత్యం,** ప్రిన్సిపాల్, ఎసి కళాశాల

గుర్రం జాషువ నడయాడిన నేల తన బోధనలతో ఇక్కడ ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దిన జాషువ 120వ జయంత్యుత్సవాలు ఇక్కడ జరగటం ఎంతో ఆనందదాయకం. రాష్ట్రం నలుచెరగల నుండి ఈ సదస్సుకు రావటం ఎంతో ముదావహం.

**జాషువ పేరుతో ట్రస్టు ఏర్పాటు :**

**– పాశం రామారావు,**

వ్యవసాయకార్మిక సంఘం ఉపాధ్యక్షులు

జాషువ పేరుతో గుంటూరు జిల్లాలో సాంస్కృతిక కేంద్రాన్ని ఏర్పాటుచేస్తున్నాం. నిత్య సాంస్కృతిక, సామాజిక సేవాకేంద్రంగా ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దుతాం. అందరి సహకారం అవసరం. జాషువ అందరి మన్ననలు పొందిన కవి. కులమతాలకతీతంగా ఈ సమాజం ఉండాలని కోరుకున్నాడు.

**నభూతో నభవిష్యత్తు :**

**– ఎస్.బాలస్వామి,** జిల్లా రిజిస్ట్రార్, నరసరావుపేట

ఇటువంటి సభ జరగటం ఎంతో ఆనందదాయకం. నేను చూసిన ఎన్నో సభల్లో ఇది చిత్తశుద్ధితో కూడిన కార్యక్రమం. జాషువ రచనలపై ఇంత సుదీర్ఘ చర్చ జరగటం అభినందనీయం, భవిష్యత్తులో ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలి.

**– డాక్టర్ కోయి కోటేశ్వరరావు,**

కవి, విమర్శకులు

జాషువా పద్యాలలోని చక్కటి తెలుగు ప్రజల నాల్కలపై నాట్యమాడుతుంది. .జాషువా పద్యాలు తెలుగు భాషను సుసంపన్నం చేశాయి. జాషువా పద్యాలు భావాల సంపదే కాదు. భాషా సంపద కూడా. ఈనాడు జాషువా భావాలకు ప్రాసంగికత మరింతగా పెరిగింది.

**ప్రత్యేక ఆకర్షణగా ప్రజాశక్తి బుక్‌హౌస్**

ఈ ఉత్సవాల సందర్భంగా జాషువపై ప్రముఖ రచయితలు రాసిన పుస్తకాలను ప్రజాశక్తిబుక్‌హౌస్ ప్రచురించింది. అంతేకాకుండా ఎ.సి. కాలేజి ప్రాంగణంలో పదిరోజులు పుస్తక ప్రదర్శనను నిర్వహించింది. ఈ ప్రదర్శన పుస్తక ప్రియులను ఆకట్టుకుంది.

జిల్లా రిజిస్ట్రార్ ఎస్.బాలస్వామి, ఎస్సీ కార్పొరేషన్ ఇడి బాలాజీ నాయక్ మల్లెల శ్రీనాథ్ చౌదరి, చిట్టిపోతు మస్తానయ్య, గద్దె మంగయ్య, ఆలోకం పెద్దబ్బయ్య తదితరులు అతిథులకు జ్ఞాపికలు అందజేశారు. కెవిపిఎస్ జిల్లాకార్యదర్శి టి.కృష్ణమోహన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.భగవాన్‌దాస్, బి.లక్ష్మణరావు, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి వై.రాధాకృష్ణ, కాకుమాను నాగేశ్వరరావు, నళినీకాంత్, నూతలపాటి కాళిదాసు, గోనె లూథర్‌పాల్, సిహెచ్.కిన్నర్ తదితరుల సమన్వయంతో దిగ్విజయంగా ముగిసింది. కార్యక్రమం దిగ్విజయానికి ఆర్థికంగా, హార్దికంగా సహకరించిన పెద్దలందరికీ ధన్యవాదాలు.

**(వ్యాస రచయిత జాషువ 120వ జయంతి కమిటీ ప్రధాన కార్యదర్శి)**

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**

శ్రీకాకుళంలో 22.11.2015న జరిగిన గురజాడ శతవర్ధంతి కార్యక్రమాల దృశ్యాలు




అనంతపురంలో  గురజాడ శతవర్ధంతి కార్యక్రమాల దృశ్యాలు



తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో డిసెంబర్ 20న హైదరాబాద్, సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన లిటరరీ ఫెస్ట్‌దృశ్యాలు



SHAITYA PRASTHANAM RNI N0.APTEL/ 2004/18396 Postal Regd. No.H/SD/415/13-15
Date of Posting : 30.12.2015 ▪ Date of Publication: 26.12.2015


# MVGR COLLEGE OF ENGINEERING
## Autonomous

**Listed U/s 2(F),12(B)Act of UGC,Approved by AICTE,New Delhi & Permanently Affiliated to JNT University,Kakinada**
**Vijayaram Nagar,Chintalavalasa,Vizianagaram-535005,Ph:08922-241039 website:www.mvgrce.edu.in**

**Accredited by NBA Graded "A" by NAAC of UGC**


Late Dr.P.V.G. Raju, D.LITT
Founder, Mansas Trust


Dr.P.Anand Gajapathi Raju
Chairman, MANSAS
Former Education & Health Minister, Govt. of A.P.


Sri. P. Ashok Gajapathi Raju
Vice-Chairman, MANSAS
Minister for Civil Aviation, Govt. of India

### Vision

**Strives to become a center par excellence for technical education where aspiring students can be transformed into skilled and well-rounded professionals with strong understanding of fundamentals a flair for responsible innovation in engineering practical solutions applying the fundamentals and confidence and poise to meetthe challenges in their chosen professional spheres.**

### Mission

**To impart quality education in an atmosphere that motivates learning as a social obligation which we owe to the students, their parents/guardians and society at large and hence the effort to leave no stone unturned in proving the same with all sincerity.**

### Features

- Accredited for all eligible B.Tech & MBA Programmes by NBA of AICTE
- State of the art Laboratories, Computer centers and work shops
- Spacious and fully furnished central & Digital Library
- 45 Mbps LEASED LINE internet connectivity
- R&D cell to promote Research activity with an ongoing funded research worth Rs.60 lakhs
- Departments of Chemical,CSE, ECE and Mechanical are JNTUK recognized Research Centers
- Recognized as "Technology Learning Center" by WIPRO
- Institution in Collaboration with SUN,MICROSOFT, CISCO, PTC,SIEMENS, EDGECAM,NILABVIEW,THINKLABS, NEW DAWN AUTOMATION and SIMTECH is providing competencies on industry Ready Skills beyond curriculum.
- In Campus Health center
- Active department/professional student clubs
- Sprawling play ground spread over 8 acres provided with Basket court, Turf pitch and modern Gym
- Tennis court, Cricket stadium in collaboration with Andhra Cricket Association (ACS), NCC, NSS.
- MOU's with Centurion University , ODISHA and Bob Technologies, Bangalore
- Recognized as TCS Academic Interface Program (AIP)Collaborating Institute
- Partnering with TALENT SPRINT in developing student skills
- Transport facility from Vizianagaram and Visakhapatnam
- Spacious College Canteen In Campus Canara Bank facility with ATM
- On-campus coaching/guidance for GATE/GRE/TOEFL/IELTS
- Experienced and highly qualified faculty of which about 55 are with Ph.D
- 9 University Gold medals
- Academic awards for toppers each class first student equivalent to fee reimbursement
- Hostel Facility



**Placement Details**
2007 - 249
2008 - 239
2009 - 158
2010 - 216
2011 - 244
2012 - 354
2013 - 301
2014 - 384
2015 - 402

**U.G.COURSES B.Tech: Civil,Chemical,CSE,ECE,EEE,IT,Mechanical P.G.: MBA**
**M.Tech: Computer Science & Engineering,Computer Networks & Information Security Machine Design,VLSI, Structural Engineering,Power Systems**


If Un delivered please return to: Prasthanam, C/o M.H. Bhavan, Plot No. 21/1,
Near RTC Kalyana mandapam, Azamabad, Hyderabad - 500 020. Ph: 040- 27660013, Cell: 9490099059